
జ్యోతి

జూలై '64 – 60 పై!





తొలిమాట

జవహర్‌లాల్ అంతిమయాత్ర (17)తో, ఆయన భౌతికావశేషాలు త్రివేణీ సంగమంలో సంగమించడం (19)తో నవ భారత చరిత్రలో ఒక ఉజ్జ్వలఘట్టం ముగిసింది.

కొత్తఘట్టం ప్రారంభమైంది. శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి ప్రధాన మంత్రిగా కొత్తమంత్రివర్గం ఏర్పాటైంది. ఈ కొత్త నాయకత్వం క్రింద దేశం మరొక ఉజ్జ్వల ఘట్టంలో అడుగిడ గలదనే ఆశలు చిగురిస్తున్నాయి. (11)

•

గడచిన నెలలో ఆంధ్రదేశానికి పరోక్షంగా, విజయవాడకు ప్రత్యక్షంగా ఆందోళనకరమైన దారుణ సంఘటనలు జరిగాయి. (8, 9, 10)

•

తెలుగు చలన చిత్రరంగంలో ఒక అపూర్వ ప్రయోగం జరుగు తున్నది. అటువంటి ప్రయోగాలు ఎవరుచేసినా, వాటి ఫలితాలెలావున్నా, మనసారా ఆహ్వానించ దగినవి; ప్రోత్సహించ దగినవి. (105)

•

ఈ సంచికనుంచి ''జ్యోతి'' రెగ్యులర్ డెమీసైజుకు మారుతున్నది. పత్రికను ఇంకా ఆకర్షవంతం చేయడానికి, మీ మెప్పును ఇతోధికంగా పొందడానికి బహుధా ప్రయత్నించగల మని వేరే చెప్పాలా ?

సచిత్ర మాసపత్రిక
బకింగ్‌హామ్‌పేట, విజయవాడ-2

మేనేజింగ్ ఎడిటరు : వి. వి. రాఘవయ్య

విడిప్రతి వెల : 60 పైసలు — ఏడాది చందా : ఏడు రూపాయలే

సంపుటి 2 జూలై 1964 సంచిక 7

పాఠక మహాశయా ! ఈ నెల

ఇదో వరస....

చతుర్ముఖ చిత్రం :

బాబూమూవీస్‌వారి సంచలన చిత్రం "లేత మనసులు"లో
నటిస్తున్న కొత్త మనుసులు :
కృష్ణ, సుకన్య, సంధ్యారాణి, దేవానం ...సారీ, రామమోహన్

ఫొటో : రూప

సంపాదక వర్గం :
నండూరి రామమోహనరావు, ముళ్ళపూడి వెంకటరమణ,
బాపు, వి. ఎ. కె. రంగారావు, రావి కొండలరావు.

Edited and Published by V. V. Raghavaiah for Jyoti Publications
and Printed by him at Thrinadh Art Printers
Buckinghampet post, Vijayawada-2

ఉత్తరాయణం

జూన్ నెల జ్యోతి ముఖచిత్రం "సావిత్రి" చాల బాగుంది. "సెక్రటరీ" సీరియల్ ఈ నెలకూడా బాగా రాణించింది. "కంపార్టుమెంటాలిటీ" హాస్యరస భరితంగాఉండి నన్ను కడుపుబ్బ నవ్వించింది. రచయితకు నా ధన్యవాదాలు. మిగతా కథలుకూడా బాగానే ఉన్నాయి. ముఖ్యంగా శ్రీ భమిడిపాటి కామేశ్వరరావుగారిని గురించి వ్రాయటం జూన్ నెల జ్యోతికే ఒక ఆకర్షణ. "జ్యోతి" నెలనెలాభివృద్ధి చెందుతూ చదువరుల హృదయాలను ఆకర్షించాలని కోరుతున్నాను.

కూచిభొట్ల శివరామకృష్ణారావు,
గుడివాడ.

"జ్యోతి" ముఖచిత్రంలో తనకు సాటి లేదనిపించుకుని అందరినీ ఆకర్షిస్తూ యున్నది. కాని మీరు కేవలం సినిమాతారల ముఖచిత్రాలకంటే, సహజ సౌందర్యములు కనపరచే లిఖితచిత్రాలు ముఖపత్రాలపై ప్రచురించడంకూడా తెలుసుకోవలసి యున్నది. జ్యోతిలో ఎక్కువగా రచయిత్రులే కనిపిస్తూయున్నారు. రచయితలు మాత్రం బహుస్వల్పంగా కనిపిస్తూన్నారు, మీజ్యోతికి పురుషరచనలయందు ద్వేషమా? ఏది ఎట్లయినా సర్వాంగ సుందరమైన మీ జ్యోతి మా అందరి యింట జ్యోతిగా వెలుగుచున్నది.

ఎన్. నాగరాజు, యలమంచిలి.

తాను సీరియస్‌గా ఉంటూ మాటలలో, చేతలో వ్రాతలో హాస్యరసా న్నొలకబోసిన మేధావి శ్రీ భమిడిపాటివారు. భావ ప్రకటన లేని పద్య పఠనమును సంస్కరించుటకు ఆయన తీసుకొన్న శ్రద్ధ అనల్పము. ఆయన వ్రాసిన హాస్యనాటికలు తెలుగు వారికి చిరపఠనీయములు ఆయన చిరస్మరణీయుడు. ఆ "హాస్యబ్రహ్మ"ను గురించి సముచితంగా ప్రచురించినందులకు నా ధన్యవాదములు.

ఉండమట్ల లక్ష్మణమూర్తి, కేసవరం.

జూన్ సంచిక సావిత్రిగారి ముఖచిత్రం చాలా బాగుంది. సులోచనారాణీగారి "సెక్రటరీ" సీరియల్ చాలా బాగుంది. రచయిత్రి గారికి నా హార్దీ థాంక్సు. ఆచంట శారదా దేవిగారి "దృక్పథం" నన్నెంతో ఆకర్షించింది. అందుకు నా కృతజ్ఞత తెలియజేయుచున్నాను.

మిస్. వాసంతి, గజపతినగరం.

సావిత్రి ముఖచిత్రముతో వెలువడిన సంచిక చాల అందముగా, ఆకర్షణీయంగా యుంది. యద్దనపూడి సులోచనారాణిగారు వ్రాసిన "సెక్రటరీ" అనే సీరియల్ చదువుతున్నకొలది ఇంకా చదవాలనే ఉత్సుకతను ప్రేరేపిస్తోంది. సశేషాన్ని చూడగానే పై సంచికలో ఇంకేమవుతుందో అనే కుతూహలం మాకు దినమొక యుగంగా తోచింప జేస్తున్నది. రచయిత్రి వర్తమాన వాస్తవ పరిసితులను చక్కని విమర్శనాత్మక దృక్పథంతో చిత్రీకరిస్తున్నారు. వారికి మా హృదయపూర్వక దన్యవాదాల్ని మా జ్యోతి సంచిక అందజేయగలదని ఆశిస్తున్నాం. "డాక్టర్ చక్రవర్తి"లోని చిత్రాలను ఎక్కువగా వేయమని కోరుతున్నాం.

జి. వి. ఆర్. ఆచారి,
బి.ఎల్.ఎన్. స్వామి, భువనేశ్వరం.

ఈ నెల జ్యోతి బహుచక్కగా ఉంది. అట్టమీద బొమ్మ స్వర్గీయ పండిట్‌జీది ఉంటే సమంజసంగా ఉండేది. "దృక్పథం" ఇతివృత్తంకన్నా రాసేవిధానం బాగావుంది. సెక్రటరీ డిటో. విట్లు తగ్గించేస్తున్నారు.

జనపరెడ్డి వెంకటరమణ, ఆకివీడు.

ఈ నెల సావిత్రి ముఖచిత్రం చాల ఆకర్షణీయంగాఉంది. రాజకీయ వార్తావరణం చాలాబాగుంది. మా అభిమాన రచయిత్రులు యద్దనపూడి సులోచనారాణిగారు, ఆచంట శారదాదేవి గారలు రచించిన "దృక్పథం", "సెక్రటరీ" చాల బాగున్నవి.

వి. ముత్తయ్యా, సరోజిని,
లక్సెట్టిపేట.

జూన్ నెల "జ్యోతి" అట్టమీదబొమ్మ "సావిత్రి" చాలా అందంగావుంది. రచనలలోకెల్లా "కంపార్టుమెంటాలిటీ" అనేది చాల బాగుంది.

జి. అలివేలుమంగ, శ్రీకాకుళం.

పత్రిక ఆలస్యమైనా పండిట్‌జీ ఫొటో లతో ప్రచురించడం సమంజసంగాయుంది. మన ఆంధ్రదేశానికే గర్వకారణమైన "హాస్యబ్రహ్మ" గురించి వ్రాసి మరువరాని మహామనీషిని మరల గుర్తుకుతెచ్చి, మరల మా కళ్ళముందుపెట్టిన "తంబు" గారికి నా ధన్యవాదాలు. కామేశ్వరరావుగారు రచించిన ముఖ్యమైన కొన్ని నాటికలు ఉదహరిస్తే యింకా బాగాయుండును. రావి కొండలరావుగారి "కంపార్టుమెంటాలిటీ" నిత్యానందంగారులేని లోటు తీర్చింది. "సెక్రటరీ" కథ మంచి రసవత్తరంగా యుంది.

లోలుగు అప్పాజీ, రాజమండ్రి.

జ్యోతి నెల కొకసారే రావటం అనేది చాలా బాధగాఉంది. అంతకాలం భరించలేక పోతున్నాను. చదివిన కథలే చదివి, నవ్విన విట్లకు మళ్ళా నవ్వుకుంటున్నాను. కూనలమ్మపదాలు బాగున్నాయి. కనుక ఓ మహాశయా! జ్యోతిని కనీసం 15 రోజుల కొకమారైనా విడుదల చెయ్యండి! 15 రోజులు ఎలాగో సరిపెట్టుకుంటాం! జ్యోతి అనేది వెలిగినంతసేపు ఒకేరకం కాంతిని ఇస్తుంది. అలాగనే "జ్యోతి" పుస్తకం ఎన్నిసార్లుచదివినా ఒకటే ఆనందం ఇస్తోంది. సెక్రటరీ సీరియల్ బాగుంది. జోక్సు ఎక్కువ వేస్తారని ఆశిస్తున్నా!

కొల్లూరి భాస్కరరామారావు,
రాజమండ్రి.

"జూన్" నెల సంచిక ఆశించినంత బాగాలేదు. ప్రత్యేకాకర్షణ అంటూ మీరు వేసిన "దృక్పథం" కథానికలో ప్రత్యేకత ఏమీలేదు. శారదాదేవిగారి ఇతర కథానికల ముందు ఇది ఆశాభంగం కలిగించిన మాట వాస్తవం. "మనసుచాలని మంచిబ్రతుకు" కథకు చిత్రాలులేవు. కారణం తెలియదు. బాపుగారిని దయవుంచి కాస్త శ్రద్ధతీసుకోమని ప్రార్థన. అందరూ మంచికథలకోసం పుస్తకాలు కొంటుంటారు. కొందరు, నాలాంటివారు, బొమ్మలకోసం కూడా కొంటుంటారు. శ్రీ కొండలరావు "కంపార్టుమెంటాలిటీ" నవ్వు తెప్పించింది: భమిడిపాటిని గూర్చి తంబు వ్రాసిన వ్యాసం బాగుంది. సులోచనారాణీగారి సెక్రటరీ చక్కగా నడుస్తున్నది

ఎ. జి. నాధ్‌బాబు, వాల్తేరు.

పతాభి పన్ చాంగాన్ని - పతాభి ఫన్ చాంగముగా మారుస్తే బాగుటుందని నా అభిప్రాయము.

పాండు, తెనాలి.

□□□

కూనలమ్మ పదాలు

ఆరుద్ర


క్రష్టజీవుల కొంప
కాల్చి బూడిద నింప
తెగునులే తనదుంప
ఓ కూనలమ్మ.

జనుల ప్రేముడిసొమ్ము
క్షణములోపల దుమ్ము
తులువచేయును సుమ్ము
ఓ కూనలమ్మ.

దహనకాండల కొరివి
తగలబెట్టును తెలివి
కాదు కాదిక అలవి
ఓ కూనలమ్మ.

కూరుచుండిన కొమ్మ
కొట్టుకొను వాజమ్మ
హితము వినడుకదమ్మ
ఓ కూనలమ్మ

తెలివితేటల తాడు
తెంపుకొను మొనగాడు
అతివాద కాప్రేడు
ఓ కూనలమ్మ.



జూన్ 10 వ తేదిన విజయవాడలో జరిగిన కృష్ణలంకా దహనం

ఇజము: నెరిగినవాడు
నిజము చెప్పనినాడు
ప్రజకు జరుగును కీడు
ఓ కూనలమ్మ.

స్టాలినిస్టు చరిత్ర
సగముగాడిద గత్ర
చదువుకో ఇతరత్ర
ఓ కూనలమ్మ.

మధ్యతరగతి గేస్తు
మంచి బందోబస్తు
జనులకిక శుభమస్తు
ఓ కూనలమ్మ.

సామ్యవాద పథమ్ము
సౌమ్యమైన విధమ్ము
సకల సౌఖ్యప్రదమ్ము
ఓ కూనలమ్మ.

అరుణబింబము రీతి
అమర నెహ్రూ నీతి
ఆరిపోవని జ్యోతి
ఓ కూనలమ్మ.

రాజకీయ వాతావరణం

నెహ్రూ తరవాత కథ

మే 26 సాయంత్రం డెహ్రాడూన్ నుంచి తిరిగివస్తూ కారులో తన ప్రక్క కూర్చున్న లాల్ బహదూర్ తో నెహ్రూ చెప్పిన ఆఖరి మాట—కామన్ వెల్తు ప్రధానుల సమావేశానికి లండన్ వెళ్ళటానికి సిద్ధంగా వుండమని—

భువనేశ్వర్ కాంగ్రెసు సభల్లో ఒకి మాటు తాను అస్వస్థుడైనప్పుడే, ఢిల్లీ తిరిగొచ్చి మంత్రివర్గంలో: లాల్ బహదూర్ ను చేరమని తాను చూచే ముఖ్యవ్యవహారాలన్నింటినీ ఆయనకు అప్పచెప్పారు శ్రీ నెహ్రూ—

అసలు ఆదిలోనే అయిదారేళ్ళగా అంతర్జాతీయవ్యవహారాలను తాను చూచుకుంటూ, జాతీయ సమస్యలను లాల్ బదూహర్ కు అప్పచెప్పారు శ్రీ నెహ్రూ—

అప్పచెప్పటం, చెప్పి చెయించటం, నెహ్రూ లాల్ బహదూర్ లమధ్య ఈమధ్య, మొన్న మొన్న ప్రారంభమైంది కాదు—

దృక్పథాల్లో గాంధీజీ, నెహ్రూలమధ్య కొంత వ్యత్యాసం కనిపించితే లాల్ బహదూర్ నెహ్రూవైపే మొగ్గుచూపేవారుట 1931 దగ్గరనుంచీ —

ఆడలో ఆరోజుల్లో అల్హాబాద్ మునిసిపల్ నాయకత్వంరోజులనుంచీ లాల్ బహదూర్ కు పండిట్ జీ తర్ఫీదు ప్రారంభమైంది.

"నెహ్రూ తరువాత యెవరు" అనే ప్రశ్నార్ధకం ఇంత తేలికగా నాటకంలో అంకంమారినంత సాఫీగా జరిగిపోతుందని యెవరుమాత్రం అనుకున్నారు !

అయినా, శ్రీ నెహ్రూమాత్రం ఇదంతా ఇట్లాగే క్రమబద్ధంగా జరిగిపోతుందని తప్పకుండా అనుకుని వుంటారని ఇప్పుడు నమ్మకం కలుగుతోంది.

జాతివ్యూహాలు, ఆలోచనలు, ఆశలు ఆవేదనలు శ్రీ నెహ్రూకు తెలిసినంతగా మరెవరికీ తెలియవేమో. పూర్వాపరాలను అపూర్వంగా సమన్వయించుకున్న అద్భుతమైన వ్యక్తిత్వం ఆయనది.

చెప్పకుండానే చెప్పి వెళ్ళిపోయారాయన. వెనక్కు తిరగకుండానే తన వెనుక నడచి వస్తున్న వ్యక్తిని సూచనమాత్రంగానే చూపించి వెళ్ళిపోయారాయన—

తన వారసుని నిమిత్తం ఆయన జాతిని శాసించలేదు. ఆయన ఊహలతో తాదాత్మ్యం పొందిన జాతి ఆయన మనోగతానుసారంగానే, ఆయన లేని సమయంలోకూడా వ్యవహరించటం—

అందుకే ఆయన అజరామరుడు, అనంతమూర్తి-పువ్వులో పువ్వుగా, ఆకులో,

కాయలో, పావనగంగలో, అఖండ భారతావనిలో అట్లా అంతర్లీనమైపోయారు—

తన దశాబ్దంలో శతాబ్దాల శతాబ్దిని జీర్ణించి ఒక మహత్తర అనుసంధానాన్ని సాధించి జాతి చరిత్ర సృష్టించిన యుగపురుషుడు శ్రీ నెహ్రూ.

• • •

అందుకే కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ కామరాజ్ "నెహ్రూ లాంటి నెహ్రూను మరొకరిని పొందగలగటం సాధ్యపడదు. అయినా సమష్టి నాయకత్వంతో దేశ భవితవ్యాన్ని నడిపించాలి" అన్నారు.

నిజమే-నెహ్రూలాంటి ఉన్నతుడు, విశ్వమూర్తి తిరిగి లభ్యంకావటం కష్టం-సమష్టి నాయకత్వం అవసరం—

కాని ఈమధ్య పది పదిహేను రోజులుగా జరిగిన, జరుగుతున్న పరిస్థితుల పరిణామం పరిశీలిస్తుంటే కొంత భయాందోళన కలుగుతోంది. సమష్టి నాయకత్వం కట్టుదిట్టంగా సాగితే మంచిదేకాని, బెసిగిపోయి పెడదారులకు లాగితే అంతా అయోమయం అనిపిస్తుంది—

నెహ్రూకు వారసుడుగా పేరు నిర్ణయం అయిన వెంటనే తరువాత జరిగిన పత్రికల వారి గోష్ఠిలో శ్రీ లాల్ బహదూర్ అన్న మాట ఒకటి గమనార్హమైనది. మంత్రివర్గంలో వుండాల్సిన వ్యక్తుల నిర్ణయం కేవలం సమర్థత (మెరిట్)ను బట్టిమాత్రమే కాకుండా, 'ఇతరసర్దుబాట్ల అవసరాలనుబట్టి' కూడా' (అదర్ కన్సిడరేషన్స్) జరుగుతుంది.' అన్నారు శ్రీ లాల్ బహదూర్.

ఇది ఆయనలోని ఒక 'విధమైన సర్దుబాటు గుణాన్ని' ద్యోతకం చేసినా ఈ విషయం అంత బహిరంగంగా అంత గబగబ అనటం భవిష్యత్తులో రాజకీయం అపశ్రుతిలో పడిపోతుందా అనే భయాన్ని కలుగచేస్తోంది.

అయినా శ్రీ లాల్‌బహద్దూర్ చాలా ఉత్తముడు. సచ్ఛీలుడు. ఎదుటివారు చెప్పేది వినేవోపిక, ఆయనకున్నంతగా మరి వేరెవరికీ లేదేమో.

పొట్టిగా మెత్తగా అనిపించినా, ఆలోచనలో ఘటికుడు. కార్యసాధనలో సమర్థుడు.

కాని ఆయనను ఆవరించిన, ఆవరిస్తున్న 'సమష్టి నాయకత్వం' ఆయనను యెంతవరకు పూర్తి సఫలపుకోనిస్తుందా అనేది చూడవలసిన విషయం.

ఎంత వద్దనుకున్నా, యెంతకాదన్నా కొన్ని కొన్ని 'కార్య కారణ సంబంధాలు భవితవ్యాన్ని గురించిన ఆందోళనలు కలిగిస్తున్న మాట వాస్తవం.

'బెడిసికొట్టిన కామరాజీయం,' (అంటే కామరాజ్ పథకం) నెహ్రూ అస్థి నిమజ్జనానికి ముందుగానే ఢిల్లీలో నాలుగుగోడల మధ్య వినిపించిన రాజకీయాల బడబడలు ఆ తరువాత సద్దు కొంతవరకు సర్దుకున్నవనేది వేరే విషయం—

అన్నింటికంటె ముఖ్యం—

కేంద్ర నాయకత్వ నిర్ణయ, రాష్ట్ర నాయకుల జోక్యంమీద ఆధారపడుతుందనేది కొంతవరకు సూచించబడటం - మరీ ఇరకాటం.

భువనేశ్వర్ సెషన్స్ కాగానే, దక్షిణాది నాయకులు, శ్రీ అతుల్యఘోష్ కలిసి తిరుపతివెళ్ళి సమాలోచనలు జరపటం.ఆ తరువాత మొన్న ఢిల్లీలో నెహ్రూ వారసత్వ నిర్ణయంలో వీరు చూపించిన "విశేష ఆసక్తి" ఎంత కాదనుకున్నా, కొంత ఆందోళనను కలిగిస్తోంది—



నెహ్రూ తరవాత మేస్త్రి శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి

నెహ్రూ నిర్యాణ సమయంలో, సందిగ్ధ వాతావరణంలో శ్రీ కామరాజ్ చూపిన చొరవ ప్రశంసనీయమైనది. కర్తవ్యాన్ని నడిపించటంలో ఆయన చేసిన చేతలు, చవి చూపించిన చాకచక్యం ప్రశంసనీయం.

ఆయన కాకలుతేరిన నాయకుడు. గడుసుతనం, పట్టుదల, ఆయనలో అన్నీ సమ్మిళితమైనాయి.

—కాకపోతే తిరిన రాజాజీలాంటి మహానాయకుని ప్రాభవం చెన్నరాష్ట్ర కాంగ్రె

సులో అంతఇదిగా అంతమొందించగలిగి వుండేవారా.... మరి !

పరిపాలనాదక్షుడు, మనసెరిగి నడిపించ గల నాయకుడు శ్రీ కామరాజ్.

కాని ఒక్క విషయం—

రాష్ట్రంవేరు; యావద్భారతదేశం వేరు- భిన్న పరిస్థితులలో, విశాల వాతావరణంలో, విపుల సమస్యలమధ్య, మంత్రాంగ ప్రయోగం-అప్రమత్తతతో ఎంతో నిభాయింపుతో సాగించవలసిన తతంగం.

—ఏమాత్రం యేమరుపాటు కలిగినా అంతా "మదరాసు కార్పొరేషన్ వ్యవహారం" కాకపోదు అనేది చాలామంది భయం.

దేశ నాయకులంటే-దేశం హోరులెత్తి పరవళ్ళుత్రొక్కి స్వాగతాలు పలకాలి.

అంతేకాని, తాంత్రికంవల్ల, ముఠా రాజకీయాల చతురతవల్ల పైకి ప్రాకిన వినాయకులు కారాదు—

పరిణామాలను వూహించాలంటే భయం వేస్తుంది.

నెహ్రూలాంటి ఉన్నతుడు వెళ్ళిపోవటం వెక్కిరిస్తోంది.

● ● ●

ఈనాడు పరిస్థితి —

మంత్రివర్గంలో చేరటానికి శ్రీమురార్జీ నిరాకరించాడు. శ్రీ జగ్‌జీవన్‌రాంను చేర మనే అనలేదు.

కాంగ్రెసులో అతివాద వర్గానికి ఎలాంటి ప్రాతినిధ్యం ఈనాడు మంత్రివర్గంలో లేదు.

పంజాబ్ ముఖ్యమంత్రి పదవి వదలిన శ్రీ కైరాన్‌ది ఒక ప్రత్యేక సమస్య.

ఒరిస్సాలో శ్రీ బిజయానంద్ పట్నాక్ అసంతృప్త వర్గానికి చెందినవాడు; ...మైన నవతరం ఆశావాది.

ఉత్తరప్రదేశ్ రాజకీయాలతో అగ్గి బుగ్గి అయి ఇంకా రాజుకుంటూనేవున్న రాష్ట్రం.

కాశ్మీర్‌లో మళ్ళీ అబ్దుల్లా పాతధోరణికి కొత్త కొత్త వెర్రి తలలు వేస్తున్నాయి. కాశ్మీర్ భవితవ్యం కాశ్మీర్ వాసులదే కాని. అటు పాకిస్తాన్‌కుగాని, ఇటు భారతదేశానికి గాని యెటువంటి నిమిత్తం లేదు అంటున్నారు షేక్‌సాహెబ్.

గడ్డురోజులు - కలవరపెడుతున్నాయి.

ఇలాంటి సమయంలో శ్రీ లాల్‌బహదూర్‌లాంటి వ్యక్తి —

ఎంత మెత్తటివాడో అంత గట్టివాడే - కానీ పరిస్థితులు అదుపుజారితే 'గట్టితనమే' సరిఅయిన అదునులేక బెడిసికొడుతుంది.

అయినా శ్రీ లాల్‌బహదూర్ ఉన్నతుడు—

దేశం ఆయనకు బాగా మననమైంది- ప్రజల ఆవేదనలను ఆయన అర్థం చేసుకున్నాడు-భారతీయ సంస్కృతి ఆయనలో జీర్ణించింది - ప్రతిబింబిస్తుంది.

అణకువ, శ్రద్ధాసక్తులు, నిరాడంబరంగా చిన్నిచిన్ని మాటలతో అర్థస్ఫూర్తినిస్ఫురించి జాతిని కదలించగల సమర్థుడు.

అతి బీదరికాన్ని అనుభవించి - చిన్నతనంలో గంగదాటటానికి పడవకు డబ్బులు లేకపోయినా పుస్తకాలు తడవనియ్యకుండా గంగను అద్దరినుంచి ఇద్దరికి ఈదిన దిట్ట—

నెహ్రూ వారసుడుగా ఆయన చేసిన మొదటి రేడియో ప్రసంగం మరుపురానిది—

దేశం, జాతి, సంస్కృతి - వీటిపట్ల ఆయనకు గల అచంచల విశ్వాసం - అదే మనకు శ్రీరామరక్ష.

గాంధీజీ పుట్టినరోజు, యాభైతొమ్మిదేళ్ల నాడు ఆయన జన్మదినం—

ఆయన యే కాలేజీకి వెళ్ళి డిగ్రీలు పొందలేదు.

కాశీ విద్యాపీఠం ఆయన మెట్టిన విశ్వవిద్యాలయం - యెంతో నిగ్గుదేరిన నైపుణి ఆయనలో అందగిస్తుంది.

ఈనాడు జాతి కర్తవ్యం నిభాయింపుతో వ్యవహరించటం.నాయకుల కర్తవ్యం అప్రమత్తతతో బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజల విశ్వాసాన్ని పొందగలగటం.

"ప్రజాస్వామ్యంలో నాకు నమ్మకం వుంది. ప్రజలను ప్రేమిస్తాను గౌరవిస్తాను. ప్రగతి సాధనే నా తారక మంత్రం" అన్నారు తమ రేడియో ప్రసంగంలో శ్రీ లాల్‌బహదూర్.

ప్రజలను ప్రేమించటమేకాదు-ప్రజలను గౌరవించటం, ప్రజాభిప్రాయాన్ని మన్నించగలగటంకూడా ఇతర నాయకుల కర్తవ్యం.

● ●

రాష్ట్ర రాజకీయం

రాష్ట్రంలో పంచాయతీల వ్యవహారం ఒక కొలికికి వచ్చింది. పంచాయితీల యెన్నికలు పూర్తి అయినాయి. నాయకత్వంలో మార్పు. తత్సంబంధమైన కషభిషలు అన్నీ కూడా చరమాంకానికే చేరుకున్నాయి. ఇప్పటికిమాత్రం ఇది ఏటువంటి ఉత్కంఠ లేని చరమాంకమేనేమో.

అయినా ఒక్క విశేషం —

పంచాయతీల యెన్నికలంటే అంత సామాన్యమైనవికావు. వ్రేళ్ళ దగ్గర, తరు మూలాలతో సహా అధికార వృక్షంపొంద వలసిన సశాస్త్రీయమైన కాయకల్ప చికిత్స అది యావత్తూ —

మున్ముందు అసాధారణంగా జరిగే సాధారణ ఎన్నికలకు యీ 'పంచాయతీల యెన్నికలు' నాందీ ప్రస్తావన.

అయినా చిత్రమైన విషయం - దాదాపు రాష్ట్రంలోని 15 వేల పంచాయతీలలోనూ, సగపాలు యెన్నికలు ఏకగ్రీవంగానే జరిగినాయి. ఇంత ఐకమత్యం ప్రజలలో వుందదనుకుని 'అనంతం' అంటే, మీరు అవుననుకున్నా. మరికొద్దిరోజుల్లో జరుగుతున్న సమితుల పరిషత్తుల యెన్నికలు మాత్రం వీటికి భిన్నంగా పరిణమిస్తాయి.

పంచాయతీలలో పార్టీప్రాతిపదిక లేకుండా యెన్నికలు జరిగాయి. ఇదిగొప్ప విషయం - ప్రజలలోని హుందాతనం; చూశారా అన్నారు కొందరు.

— కాని అయిందనిపించుకున్న మరునాడే యెన్నికైన పంచాయతీల సభ్యులందరూ, యెవరిగుర్తులు వాళ్ళుచెప్పుకుని 'హాజరుపట్టీ'కి సిద్ధమయారు. గుర్తులులేని కొందరికి పైవాళ్ళువచ్చి గుర్తులేసి వెళ్ళారు.

ఎవరి జెండావాళ్ళు పుచ్చుకొని పరిషత్తు ఆఫీసుముందు హాజరవుతున్నారు

మరో చిత్రం —

జాతి, మత, కులవిభేదాలను మరచిపోయే రోజులు కాబట్టి, పార్టీ విభేదాలుకూడా ఈమధ్య పంచాయతీల సందర్భంలో మరిచిపోయారుట.

కాంగ్రెసులో వర్గాలు; అట్లాగే కమ్యూనిస్టులలో వర్గాలు - ఒక జిల్లాలో ఒక కాంగ్రెసు మంత్రిగారి వర్గ బలాన్ని "చితక కొట్టటానికి" ఒక కాంగ్రెసుపార్టీ అధ్యక్షుడు కమ్యూనిస్టు వర్గాలతో "చుట్టరికం" (బాగుండకపోతే "ఎడ్జస్టుమెంటు" అనండి) కలిపాడుట—

అంతా "రంగపోడి" సామెత. భజరంగ భళీ మరి—

"విధి విలాసం—

హాయిగా వ్యవసాయం చేసుకుందాం అనుకుని జతఎడ్లను కొనుక్కుని మా వూరు, ఇల్లూరు వెళ్ళిపోతే - నెహ్రూగారికి జబ్బు చేసింది అన్నారు-ఢిల్లీ వెళ్ళి అటు ఇటు తిరిగి "దేశక్షేమం గురించి మథనపడుతుంటే· నీ కే పోర్టుపోలియో కావాలో చెప్పు. మంత్రి పదవి చేద్దుగాని అన్నారు శ్రీ లాల్ బహదూర్. ధాన్యం పండిద్దామనుకున్న వాడిని, ఉక్కు పండించమన్నారు—

మీ కెవరికన్నా కావాలా, నా జత ఎడ్లు? ...." అన్నారు మొన్న శ్రీ సంజీవరెడ్డి మాతో హైదరాబాదు తిరిగివచ్చి.

-ఇది వార్త-వార్తగానే చదువుతుందాం-

రాష్ట్రంలో నాయకత్వంలో మార్పు - అంటే యెంతవరకూ బేసబబో ఆలోచించటం ప్రస్తుతాంశం.

శ్రీ సంజీవరెడ్డిగారు ఆంధ్రుల నాయకులు-ఢిల్లీలోవున్నా హైదరాబాదులోవున్నా ఇల్లూరులోవున్నా, ఆయన ఆయనే-ఆయన మహానాయకులు.

రాష్ట్ర నాయకత్వంలో మార్పు అనటం పూర్తిగా బేసబబే....


అయినా-కాదు—

ఇప్పటికింతే—

"నందోరాజా భవిష్యతి"—అది పాత సామెత.

(ఆవాల్సిన మంత్రులు చేసే ప్రస్తావన అది).

—అనంతం,



తుది కోర్కె

"భారత ప్రజలనుంచి నేను పొందిన ప్రేమానురాగాలలో శతాంశమైనా ఎన్నటికీ తీర్చుకోలేను. అసలు అనురాగంవంటి అమూల్య ఋణాన్ని ఎలా తీర్చడ ? ప్రజల ప్రశంసలను, గౌరవాన్ని అపారంగా పొందిన వారెందరో లేకపోలేదు. కాని నాకుమాత్రం భారతప్రజలలో అన్నివర్గాలవారి అనురాగం అనంతంగా లభించి నన్ను వెల్లువలా ముంచెత్తింది.........

భారతీయులందరివలెనే నేనుకూడా మన ప్రాచీన సంస్కృతికి వారసుణ్ణి కావడం నాకెంతో గర్వం కలిగిస్తున్నది....దీనికి నిదర్శనంగా, నాసాంస్కృతిక వారసత్వానికి అంతిమోపహారంగా, ఒక గుప్పెడు నా అస్థికలను అలహాబాదులో గంగానదిలో కలిపి భారతీయ తీరాలను తరంగ హస్తాలతో కౌగలించుకునే మహాసముద్రంలో మిళితమై పోనివ్వాలని నేను కోరుతున్నాను.

అయితే, నా చితాభస్మంలో అధికభాగాన్ని విమానంలో విహాయసానికి గొంపోయి, భారతీయ కర్షకులు నిత్యం శ్రమించే సస్యక్షేత్రాలలో వెదజల్లాలని నాకోరిక. అప్పుడది నాదేశపు మృత్తికలోకలిసిపోతుంది; నేను భారతభూమితో వేర్పరచరాని విధంగా విలీనమై పోతాను."

[1954 జూన్ 21 వ తేదీన శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ వ్రాసిన వీలునామానుంచి]

ఋతురాజు


యువ భారత సింహాసనానికి నిస్సందేహంగా అర్హుడు జవహర్‌లాల్. అతని పట్టుదల మొక్కవోనిది; ధైర్యం అకుంఠితమైనది. నైతిక సత్యంపట్ల నిశ్చల విశ్వాసంతో, అకలంక సంకల్పశుద్ధితో అతడు ఉన్నత శిఖరాలందుకున్నాడు.

పరవంచన, ఆత్మవంచనలతో సాధారణంగా నిజాయితీని నేలపాలుచేసే రాజకీయ సంక్షోభం మధ్య అతడు నైతిక నిర్మలత్వాన్ని ఉజ్జ్వల పతాకంలా ప్రతిష్ఠించాడు. హానికరమని తెలిసినా అతడు సత్యాన్ని విడనాడలేదు; స్వసుఖంకోసం అసత్యంతో చెలిమిచేయలేదు. డొంకతిరుగుడు మార్గాలద్వారా సులభంగా గెలుపును సాధించగలిగినా, అది నీచమని అతని సునిశితబుద్ధి దాన్ని నిర్భయంగా తిరస్కరించింది. ఆశయాల స్వచ్ఛత, నిరంతర సత్యాన్వేషణ—ఇవి స్వాతంత్ర్య సమరానికి జవహర్‌లాల్ సమకూర్చిన విశిష్టలక్షణాలు.

ఈనాడు వసంతోత్సవం. వాడిన, వీడిన ఎండుటాకుల మధ్య ప్రకృతి నవజీవనా గమనానికి, మృత్యువుపై విజయోత్సవానికి సమాయత్త మవుతున్నది. చిగురుటాకులు ఆనందపు నైవేద్యాన్నందిస్తున్నాయి.

ఈ ఉత్సవసమయంలోని ఋతు పరివర్తన సంరంభమే దేశంలో ప్రచలితమవుతున్న నవజీవితానికి సంకేతం. ఈ యౌవన పునరున్మీలనానికి, విజయోల్లాసానికి, అధర్మంపై సమరానికి, స్వాతంత్ర్యోద్యమంపట్ల గాఢ విశ్వాసానికి ప్రతినిధియైన జవహర్‌లాలే ఋతురాజు.

[విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ 1936 మార్చి 8 వ తేదీన చేసిన ప్రసంగంనుంచి.]



పఠాభి పన్చాంగము

జూలై

1. నమ్మవలసినవాటిని నమ్మకుండుట,
నమ్మజాలని వాటిని నమ్ముట –
ఇదే హిందువుల ప్రత్యేకత.

2. హృదయములో దయ వున్నది.

3. కాళిదాసు కాలంలో మెయిలు
రాయబారం
నవీన కాలంలో
మెయిలు రాయబారం

4. చదువు సంధ్యలేని వయోజన
కార్మికులకు
సంధ్య చదువు ప్రయోజనకారి.

5. కబూకి నాట్యంలో అడుగుతీసి
అడుగు వేయుటకు అరగంట
పడుతుంది
నిజంగా చాలా ఆలాస్యమది.

6. పురాణాలలో సుచరిత్రలు
తారలవుతారని ప్రతీతి
నేటికాలంలో ఇది వ్యతిరేకంగా.

7. నా గొంతుకోసినా పాడలేను
అయితే. పాడితే తప్పకుండా
నాగొంతు కోస్తారు.

8. నారికీ వారనారికీ మధ్య
చాలా వారవుంది.

9 అసలుదారుల నిర్మూలించి
సుఖమార్గముల చూపిస్తానంటాడు
సామ్యవాది.

10. జగంలో, జగడం రహితమైనచో
జరగడం వుంటుంది.

11. పాటలన్నిటిలో, వేలముపాట నా
మనస్సును స్పందింపచేస్తుంది.

12. మగవానికి క్రియ
ఆడుదానికి అలంక్రియ

13. మనదేశంలో ఆహారధాన్యం
కంటె ఆహారధ్యానం ఎక్కువైంది.

14. వివాహంముందు కలకంఠులుగా
వుండే
అనేకస్త్రీలు, తర్వాత
కలహకంఠులుగా మార్తారు.

పఠాభి పన్చాంగము

15. దేహశుద్ధికి, చిత్తశుద్ధికి మంచి
నడవడి మంచిది.

16. రెక్కాడితేగాని
డొక్కాడనివాడు రైల్వే
సిగ్నలల్.

17. ప్రాపగాండాలో నిజం చాటు
బడుతుంది.

18 ట్యూబు బేబీలు వచ్చాక
మాతృత్వంలోని మహనీయత
గాజువారింది.

19. జనులందున
కొందరు ఉదరపోషకులు
మరికొందరు ఉదారపోషకులు

20. బట్టతల కప్పునది తలగుడ్డ.

21. స్త్రీని కొలిచేది ప్రియుడున్ను
దర్జీయున్ను.

22. ఇంటిపిల్ల దార
మింటిపిల్ల తార

23. కసిని ఆదిలో అరికట్టకపోతే
రక్కసిగా పరిణమించగలదు.

24. మంచిడోబీలేనిదే డాబులేదు
మంచి దర్జీలేనిదే దర్జాలేదు.

25. బ్రతుకులో మూడు అంతస్తులు:
బడి, వరుంబడి, ఎత్తుబడి.

26. పట్టుతోడ పనిచేయుటలో
జపానువారు అగ్రగణ్యులు.

27. వట్టివేళ్ళకన్నా వనితవేళ్ళుచలువ.

28. ఆదిలో ప్రథమా విభక్తియేఆడుది

29. నిష్కామప్రేమలో నాకు
నమ్మికలేదు
ప్రణయంలో పడకతప్పదు.

30. ఎన్నికలలోఅంతా ఓటుమాటలేను.

31. వేదాలు వల్లించి వల్లించి
కడకు దద్దమ్మగా
తయారయినాడు.

— పఠాభి




సినిమాల్లో ఆడవాళ్ళను పతివ్రతలుగా చూపిస్తున్నారని ఆ లక్షయమ్మ మొగుడు ఆక్షేపిస్తాడు. నన్నడిగితే అట్లాగే ఉండాలంటా. మనం కొత్త పద్ధతులు-కొత్తపద్ధతులనుకునేవన్నీ మన మెడకి ఉచ్చులే ననుకోండి.

ఆడదైంది మొగుణ్ణి దేవుడనుకోవటంలో నష్టమేవిటంట. కనిపించని దేవుళ్ళకి ముడుపులుకట్టి మొక్కుంటున్నాం కావా? ముడుపులన్నీ పుచ్చేసుకుని వాడు మన కోరికలీడేర్చకపోతే ఏంచేస్తున్నాం! మొగుడట్లాకాదే. అడిగిందేదో ఇచ్చిందాకా అలగొచ్చు. భీష్మించుక్కూచోవచ్చు. చెంబు తప్పేలాలు మరింత గట్టిగా కొట్టొచ్చు. మొగుడుకు నిద్రాహారాలు లేకుండా చెయ్యొచ్చు. కూరలు మాడ్చొచ్చు. అన్నం అడుగంటించొచ్చు. ఇంకెన్నన్నా చెయ్యొచ్చు. ఇల్లూ, మొగుడి కష్టసుఖాలూ మన చేతుల్లో ఉన్నాక ఇంకా హక్కులూ హక్కులంటారేవిటి? ఎందుకొచ్చిన హక్కులు?

మొగుడే సర్వస్వమూ అనటంలో మన కెంత సౌకర్యంఉందో కాస్త ఆలోచించండి. మన కష్టాల కన్నిటికీ వాడే బాధ్యుడు-చచ్చినట్టు. కావలిస్తే రుజూ చెయ్యొచ్చు. ఆడది తల్చుకుంటే ఏదైనా రుజూ చెయ్యగలదు. మనకు వేరే తర్కం వుందని లోకమంతా ఆమోదించేసింది.

కాస్త ఆలోచించండి. ఆడవాళ్ళకు హక్కులు కావాలంటున్న దెవరు? మగాళ్లు. దేనికి? మన బాధ్యతలు వదిలించుకునేందుకు. హర్‌విలాస్ సార్డా అనేఆయన - బోలెడంతమంది ఆడపిల్లల తండ్రో ఏమో ఖర్మం! - చిన్నపిల్లల పెళ్ళిళ్ళు నిషేధిస్తూ బిల్లుతెచ్చి చట్టంచేశాడు. దాంతో ఆడపిల్లల పెళ్ళిచేసే బాధ్యత మగాళ్ళకు తప్పిపోయింది. పెళ్ళికావలిసిన వయసున కాలేజీ



చదువు చదువుకోమంటారు. ఆ తరవాత, నీ పెళ్ళి నువ్వేచేసుకో. లేకపోతే ఉద్యోగం చేసుకో. కట్నాలుపోసి నీకు సమ్మంధాలు వెతకలేమంటారు! సార్డా బిల్లే రాకపోతే ఈమాట అనగల్గుతారా?

ఆడవాళ్ళ కింకా స్వేచ్ఛఇచ్చి మగాళ్ళతో సమంచేస్తామంటున్నారు? దేనికి? మగాళ్ళకి జీవితం దుర్భరమవుతున్నది. ధరలు పెరిగిపోయి, సంపాదన పెరక్క నానాగడ్డీ కరుస్తున్నారు. అందుచేత మనకోసం ఆ పాట్లన్నీ పడలేక, మీకు స్వేచ్ఛ ఇస్తామంటున్నారు. మనమీది దయతోకాదు. బానిసల్ని గిట్టుబాటయినంతకాలం పోషించి, చాతకాక మీకు స్వేచ్ఛఇచ్చాం పొండి అన్నాడట. వాళ్ళెక్కడికి పోతారు? తిండి ఎవరుపెడతారు? స్వేచ్ఛ పొందామో మన గతి అంతేఅవుతుంది. మగాళ్ళమాటలు నమ్మకండి. మనకు స్వేచ్ఛ హెచ్చినకొద్దీ కట్నాలరేటు పెరుగుతుంది. ఇది తిరుగులేని సత్యం.

మనపట్ల మగాళ్ళు "ఆదరంగా" మసలుకోటంలోకూడా ఎంతో మోసం వుంది. కొందరు నెల్జీతం రాంగానే ఇంటిఖర్చుకని గృహిణికి డబ్బిచ్చేస్తారు. దేనికి? ఇంటిక్కావలిసినవి కనుక్కుని కొనుక్కొచ్చే బాదరబందీ లేకుండా చేసుకుని హాయిగా వెళ్ళి క్లబ్బులో పేకాడుతూ కూచోటానికి! ఉన్నట్టుండి "అబ్బబ్బ! ఇంటికెంతడబ్బూ చాలకుండాఉంది. ఎక్కణ్ణుంచి తెచ్చేట్టు?" అంటారు. మనమేదో ఇంటిఖర్చులోమిగిల్చి వడ్డీవ్యాపారం చేస్తున్నట్టు. ఓవేళ అయిదో, పదో దాచిపెట్టామే అనుకోండి. అవసరానికక్కరకురావూ? ఎప్పుడన్నా చూడండి. ఈ మగాళ్ళు జానెడిచ్చి, బారెడు పుచ్చుకుంటారు.

ఆడాళ్ళని మభ్యపెట్టటానికి ప్రేమంటూ ఒకటి లేవదీశారు. ఏమిటా ప్రేమ? తెలీ కడుగుతాను. మొదట్లో కొ_స్త ఋలపాటం ఉంటుంది. అదికాస్తా వారం తిరక్కముందే తీరిపోతుంది. ఆ తరవాత అది చట్టపు మాపుగా వాస్తూపోతూఉంటుంది. ఆ తర వాత సినిమా ప్రేమే-అంటే త్యాగంచేస్తూ పోవటం, బలికావటం, అష్టకష్టాలూ సహించి, ఆలోలక్షణా అని ఏడవటం. అదే ప్రేమంటే!

కాదన్ను - మగాళ్ళ కొందరు పెళ్ళాలకి ఫాషన్లుచేస్తారు. చీరెలు కొంటారు. చాతనయితే కారెక్కించి తిప్పుతారు. దేనికి? వాళ్ళ హోదా నిలబెట్టుకోటానికి! గొప్పగొప్పవాళ్ళళ్ళకట్టిస్తారు చూడరాదూ? అదే పద్ధతి! వీసమెత్తు తేడాలేదు.

ఒక్కవిషయంలో మనం నిజంగా పైకొస్తున్నాం. అది నేను కాదన్ను. పత్రికలపైన ఆడాళ్ళ బొమ్మలుచూడండి. సినిమా పోస్టర్లమీద చూడండి. పత్రికల ప్రకటనల్లో చూడండి. ఆడది విధిగా ఉండితీరాలి ఈమాట మగాళ్ళ విధిలేక ఒప్పుకుంటున్నారు.

కథలుకూడానూ, ఆడాళ్ళరాసిన కథలే బాగుంటున్నాయి. మగాళ్ళకూడా చచ్చినట్టు అవే చదూతున్నారు. కథలపోటీ, నవల్లపోటీ - అన్నింట్లోనూ ఆడాళ్ళే నెగ్గుకొస్తున్నారు. ఇదిచూసి కొందరు మగాళ్ళ - మొహాలకు సిగ్గన్నాలేదు! - పెళ్ళాలపేరా, కూతుళ్ళపేరా పత్రికలకి కథలు పంపిస్తున్నారు! మగాళ్ళగతి అక్కడికి దిగజారింది!

తెలీకడుగుతాను మంచి నవల రాయటానికి ఆడది లిప్‌స్టిక్కేసుకుని, ఎత్తుమడమల చెప్పులు తొడుక్కోవాలా? సినిమాతార కావటానికి బియ్యేలు పాసుకావాలా? ఇంకా ఈ మగాళ్ళ మన్నేదో ఉద్ధరించి పైకి తెస్తామనీ, చదువుకోమనీ, ప్రేమించి పెళ్ళాడమనీ, ఏవేవిటో అంటారేమిటి?

వాళ్ళమాటలు నమ్మకండి. వాళ్ళ చెప్పినవేవీ చెయ్యకుండానే మనం పైకిరాగలం-వస్తున్నాంకూడా! ౦౦౦

— "సత్యభామ"



అన్యాయం

కొడవటిగంటి కృష్ణమూర్తి

ఆదివారం అందరికీ సెలవేకదా అనుకుంటే రామనాధాయికి ఆరోజునా 'పని' వుందని తెలిసేటప్పటికి నాకాశ్చర్యం వేసింది. వాడి ఖర్మకాకపోతే మరేమిటి?

పి. యు. సి. చదువుతుండగా పరీక్షలు మూడునెలలున్నప్పటికీ నేనెంత బతిమాలినా వాడొక్క సినిమాకూడా వచ్చేవాడుకాదు. నాదెప్పుడూ వానాకాలం చదువే కాబట్టి, నిండామునిగినవాడికి చలేమిటి అన్న ధోరణిలో నేమటుకు సాధ్యమైనంత వరకు ఏ సినిమా వదిలిపెట్టేవాడినికాదు. కాని చివరకు వాడు పరీక్ష తప్పటం, నేను ప్యాసుకావటం జరిగింది. ఇలాటి అన్యాయాలు అనేకమంది జీవితాల్లో జరగటం మామూలుగా చూస్తూనే వుంటాం. కాని నా ఆత్మకు ఒక్కటే సంతృప్తి - వాడు పరీక్ష తప్పటానికి నేనుమటుకు కారణంకాదు. లేక నేనేనా? ఎలాగైనా వాణ్ణి సినిమాలకి లాక్కెళ్ళివుంటే వాడి మనస్సు కొంత తేరుకుని, చదివినది తలకెక్కి, వాడూ నాకుమల్లే ప్యాసయివుండేవాడా అన్న ఆలోచన నన్నినాటికి బాధిస్తూనే వుంటుంది!

రామనాథాయి తర్వాత సెప్టెంబరు పరీక్షల్లో ప్యాసయి ఇంట్లోవుండే రోజుల్లో వాళ్ళ నాన్నకు అపూర్వమైన ఆలోచన తట్టి మునిసిపాలిటీలో ఉద్యోగమేదైనా వుంటేమోనని విచారించాడు. మునిసిపాలిటీ ఉద్యోగాల్లో ఎప్పుడూ ఖాళీవుండదనీ, ఉద్యోగాలు సంపాదించేవాళ్ళు సంపాదిస్తూనే వుంటారనీ తేలింది. మొత్తంమీద రామనాథాయికి మునిసిపాలిటీలో ఖాళీలేని గుమాస్తా ఉద్యోగమే దొరికింది. అదే ఇంతకు తెచ్చింది కాబోలు!

నేను బి. ఏ కూడా చదివి, లాయరు పరీక్షకూడా ప్యాసయి ఇంటిముందు బోర్డు తగిలించే సమయానికి రామనాథాయి ఉద్యోగంలో రాయి అయిపోయినాడు. "ఊళ్ళో ఉద్యోగం!" అని వాడి తండ్రి ఆయన ఆత్మకు, ఇతరుల మనస్సులకు తృప్తికలిగించాడు. "గుమాస్తాగా ప్రారంభమయి గవర్నరువాకా వెళ్ళినవాళ్ళున్నారు" అని రామనాథాయి నాతో వాదిస్తూవచ్చాడు. వాడి ధైర్యం, ఆత్మ విశ్వాసం నాకు కొంత ఆనందం కలిగించక పోలా.

రామనాథాయి తన పనిని అతిశ్రద్ధగా, ఏ పొరబాటు రానీకుండా, ఎవ్వరూ తప్పు పట్టటానికి వీల్లేకుండా చేసేరకం. వాడికి ఈ "అతి" చిన్నప్పటినుంచే ఎలాగో అలవాటయింది. మునిసిపాలిటీలో ఎవర్ని అడిగినా అలాటి గుమాస్తా లేడంటారు. అలాటి వాడిని పైకి పోనిచ్చి ఏ తెలివితక్కువ గుమాస్తానో తెచ్చుకుని అవస్థలు పడటానికి ఎవ్వరికీ ఈ అయిదారేళ్ళబట్టీ ఇష్టంలేకుండా పోయింది. అఖిల భారత ఉత్తమ గుమాస్తా పోటీలో రామనాథాయి తప్పక మొదటి వాడుగా వస్తాడని అంతా అంగీకరిస్తారు. కాని ఒకవేళ అలాటి పోటీపెట్టితే వాడిని బహుశా పాల్గొననీయరు. ఏమో అప్పుడే మవుతుందో! ఇంతెందుకు — వాడెంత మంచి గుమాస్తాట అంటే వాడు ఆఫీసు నుంచి ఇంటికిపోవటానికే ఎవ్వరికీ ఇష్టం లేదు!

అదిమటుకు రామనాథాయి తప్పేమున్న గాయ్యేనట. అందరిగుమాస్తాలకూ వారం, పది, నెల రోజులుపట్టే పనిని రామనాథాయి ఓ గంటలో చేస్తాట. కానీ, వాడొక గంటలో చేసే పనికి కడం గుమాస్తాలు వారం, పదిరోజులు తీసుకుంటారట. అంటే రామనాథాయి మేధావి అనీ కాదు, మిగతా గుమాస్తాలు దద్దమ్మలూ అనీకాదు. వాళ్లూ ఆ పనిని ఒక గంటలోనే చెయ్యగలరట కాని పదిరోజులన్నా తీసుకోకపోతే పని వున్నట్టు వుండదట! రామనాథాయి తనకిచ్చిన ప్రతి పనిని త్వరగా, చక్కగాచేసి కూచోటంవల్ల కడంవారికి చెడ్డపేరు రావటం దాకా రావటం, రామనాథాయికి పనివున్నా లేకపోయినా మిగతావాళ్ళు, ఆఫీసు అధికార్లు అతనిని ఎక్కువగా ఊదరపెట్టటం, రామనాథాయి ఉద్యోగ జీవితం గిడసబారిపోవటం కొద్దికాలంలోనే తేలిపోయిందిట!

సోమ, మంగళ, బుధ, గురు, శుక్ర, శనివారాల్లో రామనాథాయిని కలుసుకోటానికే వీల్లేకుండా పోయింది. కోర్టులో పనిలేకపోవటంవల్ల నేనెప్పుడన్నా సాయంత్రం వాడి ఆఫీసుకు వెళ్ళుతూ వుండేవాణ్ణి. నేనక్కడ వున్న నాలుగు నిమిషాల్లో ఎవరో వాణ్ణి పిలిచేవాళ్ళు. వాడో గదిలోకివెళ్ళి వచ్చి నాతో ఏదో చెప్పబోతుండగా మళ్ళీ యింకెవరో కబురుచెయ్యటం, వాడు మరో గదిలోకి పోవడం జరిగేది. కాని ఒకసారి వాడు నాతో ఇంటికి బైలుదేరబోతుండగా ఎవరో వచ్చి ఏదో చెప్పి ఆఫీసునుంచి వెళ్ళిపోవటం, రామనాథాయి మళ్ళీ పనికి ఉపక్రమించటం చూసేటప్పటికి వాణ్ణి ఆఫీసులో కలుసుకోటానికి ప్రయత్నించి లాభంలేదనీ, అలా నేను ప్రయత్నించటం వాడికి మరింత బాధ కలిగించినా కలిగించకపోయినా రామనాథాయికే యిష్టంలేదనీ గ్రహించి మానేశాను.

అధికారులు అధికారం చెలాయిస్తూ వుంటేనే అధికారులుగా వుంటారు! లేకపోతే వారికి కడం వారికి భేదమేముంది? పై అధికారి కెవరికయినా రామనాథాయిని అక్కడికక్కడే కేకలెయ్యాలని కుతూహలం కలగవచ్చు. నేనో, పరాయివాడో వుంటే ఆయన కోరికను మనస్సులో అణచిపెట్టుకు రావచ్చు. కోరికల్ని మనస్సులో అణచిపెట్టెయ్యటం ఆరోగ్యానికి మంచిది కాదని శాస్త్రజ్ఞులు రుజువు చేసవున్నారు మరి!

"నీ పనిలో నీకింత 'భక్తి' లేకపోతే నీవు కొంత పైకి వస్తూవుండేవాడివేమో!" అన్నాను ఒకసారి.

"నాకీపని యిష్టంలేకపోయినా లభించిన పనిలో నేను కావాలని శ్రద్ధతీసుకోటం అలవాటు చేసుకున్నాను. మరి అందరికీ యిష్టమైన పనులే దొరుకుతయ్యా? తమ పనిలో నిర్లక్ష్యంచూపికూడా పైకి వచ్చే వాళ్ళను చూస్తూన్నా నేను అశ్రద్ధగా వుండలేకపోతున్నాను. అలా వాళ్ళు పైకి రావటం నన్నేమాత్రం ఆకర్షించలేకుండా వుంది. ఎవరైనా తమ పనిలో ఎంత అశ్రద్ధ చూపితే నాకు నా 'విధి'లో అంత ఉత్సాహం, గౌరవం పెరుగుతున్నయ్యి అదిచిన్నప్పుడే నేర్చుకున్నాను!"

"అయితే నీ గతి ఇంతే! కాని నీకెవరో ఈ గుమాస్తాగిరి ఇప్పించకుండా నీవే సంపాదించివుంటే వ్యవహారం ఇంత ఘోరంగా అవతరించేది కాదేమో!"

నా యీ సూచనకు మొదట్లో వప్పుకోక వాదిస్తూవచ్చినా, ఈ మధ్య మౌనంగా వుంటున్నాడు. మౌనం అర్ధాంగీకారమేకదా!

ఏమయితేనేం-రామనాథాయి జీవితం నా జీవితం వేరయిపోయినై. చిన్నప్పటినుంచీ కలిసి చదువుకున్నాం. ఒక వూరివాళ్ళం. ఒక వూళ్ళోనే వుంటున్నాం కాని ఇక మేం ఒకటిగా వుండటానికి సాధ్యంకాదు. మా తరగతులు, అంతస్తులు మారిపోయినై! ఈ సంగతి నాకంటేము దర రామనాథాయే తెలుసుకున్నాడు. నాకు మటుకు ఈ ఆదివారమే తెలిసింది.

"ఈ సాయంత్రం కొత్త ఛైర్మనుకు బహిరంగ సన్మానం అవునేగాక-కాని నీవు సినిమాకి రావటానికేం!" అన్నాను నేను. నా అజ్ఞానంచూసి రామనాథాయి జాలిపడ్డాడు!

"నేనా ప్రాంతాల కనిపించకపోతే నాకు ఛైర్మన్‌పట్ల నిర్లక్ష్యంవుందని ఎవరైనా అనుకుని హెడ్‌గుమాస్తాకు రిపోర్టుచేసి నా ఉద్యోగం తీయించటానికి ప్రయత్నించవచ్చు!"

"అయితే మీ ఆఫీసువాళ్ళంతా వస్తారా?"

"ఎవరి ఇష్టం వారిది."

"రానివాళ్ళ కేం అవుతుంది?" అన్నాను నేను.

"కొందరు ఏంచేసినా, ఏం చెయ్యకపోయినా పర్వాలేదు" అన్నాడు రామనాథాయి.

రామనాథాయి ఈ అయిదారేళ్ళలో ఎంత జీవితం చూసివుంటాలో నాకు అర్థమైంది. వాడి అనుభవాన్ని తప్పుపట్టటం, ఎగతాళి చెయ్యటం వానాకాలంలో గొడుగుకొనే వాడినిచూసి నవ్వటంలాగానే వుంటుంది- జోరున వానకొడితే గొడుగు పనికిరాకపోవుగాక!

ఇంతావేస్తే కొత్త ఛైర్మన్ వీరాసామి! తన్నదియ్యా ఇవాళ ఛైర్మన్‌అయి కూచున్నాడు. మా నాన్న, రామనాథాయి తండ్రి, వీరాసామి కలిసి చిన్నప్పుడు నాలుగోక్లాసు చదివినవాళ్ళే. పరీక్షలయి స్కూలు తెరచిన మొదటిరోజున వీరాసామి పరీక్ష తప్పాడనీ, మిగిలినవాళ్ళు అయిదో క్లాసుకు వెళ్ళచ్చునని మేష్టారు చెప్పారట. కాని ప్యాసు అయినవాళ్ళలో ఒకడు నిజంగా పరీక్షల్లో తప్పాడనీ అయితే అతగాణ్ణి అయిదోక్లాసుకు తోసేశారనీ ఆ రోజుల్లో చెప్పుకునేవారుట. ప్యాసయిన పిల్లలంతా పైక్లాసుకు వెళ్ళుతుంటే వీరాసామి ఒక్కడూ దిగులుగా పాతక్లాసులో కూచునిపోయాట్ట

ఆతరిక్లాసులో పరీక్షలుతప్పిన కుర్రాళ్ళు వున్నా వాళ్ళకాసంగతి అదివరకే తెలిసి మొదటిరోజున స్కూలు దాయలకేరాలేదు! ఏమయితే ఏం-వీరాసామిని పైక్లాసుకు నెట్టేరవాడు లేరుసరికదా అతను పరీక్ష తప్పాడన్న కబురు చెప్పినవాళ్ళూ లేకపోయారు!

వీరాసామి అనాటినుంచి మరి స్కూలుకే రాలేదు. వీరాసామిని చదివించటం అతని తండ్రికి సుతరామూ యిష్టం లేదట. భార్య పోరుమీద చెప్పించాడట. తగినశాస్తి అయిందని కొడుకును తనతోపాటే పని చెయిస్తూ వచ్చాడు తండ్రి తదనంతరం వీరాసామి యజమాని అయినాడు.

మునిసిపాలిటీ ఎన్నికల్లో వీరాసామి కూడా పోటీచేశాడు. కొన్నేళ్ళు పోటీపడి ఏపార్టీకి చెందని వీరాసామిని ఛైర్మన్ చేశారు! నిజంగా చెప్పుకోతగ్గ విషయం. జీవితంలో ఏ అవకాశమూ లేక తరతరాలుగా దానిలో కప్పలా జీవిస్తూ వచ్చినవాళ్ళ వ్యక్తి ఛైర్మన్ అయినాడంటే అతనిలో ఏదో విశేషం వుండితీరాలి. అదేమిటో చూద్దామని సినిమా హాలేనే సన్మానసభకు వెళ్ళాను. తతంగం చాలా అయేపోయింది. ఛైర్మన్ కాగితం చదువుతూ తనని యెన్నుకున్న ప్రజలకు కృతజ్ఞత ప్రకటిస్తున్నాడు.

"పద్నాల్గు ఏళ్ళక్రిందట ఒకనాడు ఓ కుర్రాడు వచ్చెను. పిలచితిని, అతను 'వద్దు' అని తల త్రిప్పెను, నే నాశ్చర్యపోయి 'ఏమని' విచారించితిని. నువ్వుయజమానివి, లెక్కచెయ్యవు క్రిందటిసారి వీధిలోపోయే వాళ్ళతో మాట్లాడుతూ పావుగంటపనిని అరగంటచేసితివి. నీ అసిస్టెంటు చాలు' అని చెప్పెను. ఆమాట నాకు చెంపదెబ్బవలె తగిలెను. బతిమాలి అతనిని కూచోపెట్టి చక్కగా నాకు చేతనైనంత బాగా క్రాపు చేసి పంపితిని. ఆ కుర్రవాని మాటలు నన్ను మార్చివేసినవి. ఇవాళ మీదయవల్ల ఛైర్మన్ అయినాను!"

"ఆ కుర్రాడెంతవాడయి వుండాలో!" అన్నాను నేను రామనాథాయితో కలిసి ఇంటికి వచ్చేస్తూ.

"నేనేవాణ్ణి!" అన్నాడు రామనాథాయి అంతవరకూ ఏమాటా మాట్లాడకుండా! వాడిమొహంలో ఆశ్చర్యమూ లేదు, గర్వమూలేదు!

○□□

రచయితలకు మనవి

"జ్యోతి"కి రచనలు పంపేవారు అవి నిరాకరింపబడిన పక్షంలో వాటిని త్రిప్పిపంపగోరితే రచనలతోపాటు తగినన్ని స్టాంపులను జతచేసి పంపించాలని మనవి. రచనతోపాటు కాక తరువాత స్టాంపులు పంపవద్దని. అట్టివారికి రచనలు త్రిప్పిపంపడం కష్టసాధ్యమని గుర్తించాలనికూడా మా విజ్ఞప్తి.

—మేనేజింగ్ ఎడిటర్.



"నాకు మీ ఆఫీస్‌లో పనిచేస్తున్న వాళ్ళందరి ఇళ్లూ తెలియవు అన్నాయ్!"

పట్టుచీర కట్టుకొని, చేతిలో కుంకుమభరిణ పుచ్చుకున్న అనసూయ కొత్తగా ఆఫీస్ మేనేజరుగా ప్రమోషన్ పొందిన సుందరంతో అన్నది.

"శంకరాన్ని పంపుతాను. వేను ఆఫీస్‌కెళ్ళి! అతనొచ్చి అందరి ఇళ్ళూ చూపెడతాడు. అంచాకా నీకు తెలుసున్న వాళ్ళనందర్నీ పిలుచుకురా!" అన్నాడు సుందరం.

"శంకరాన్నా!" నిర్ఘాంతపోయింది అనసూయ. శంకరం మొన్న మొన్నటిదాకా, సుందరంతోపాటే ఆ ఆఫీసులో గుమాస్తాగా వుండేవాడు. సుందరం అదృష్టం కలి

కొచ్చింది. ఇన్నాళ్ళూ గుమాస్తాగావున్న ఆ ఆఫీస్‌కే మేనేజరయినాడు. శంకరం ఇంకా శంకరగిరి మాన్యాలే దున్నుతుంటున్నాడు

"అవునమ్మా మన శంకరాన్నే." విదానంగా "టై" కట్టుకుంటూ అన్నాడు సుందరం.

"మరి అతనికి ఆఫీసులో పనివుండదా?"

"పనివుంటే ఏం? వడ్డించేవాడు మనవాడయితే కడబంతిన కూర్చోమన్నారు పెద్దలు" గర్వంగా తనేదో ఉపకార చింతన వున్నవాడల్లే అన్నాడు సుందరం.

అనసూయకి అయోమయంగా వుంది. శంకరం ఏ సేవ్ బంట్రోతుపని కాదు. ఆఫీస్‌లో ఫైల్సు వ్రాయాల్సిన గుమాస్తా! అల్లాంటి గుమాస్తాని ఆఫీస్‌లో పనిచెయ్యాలసిన సమయంలో సెలవు పెట్టించి, తనతో పేరంటం పిలుచుకురావటానికి పంపుతానంటున్నాడు సుందరం. నడమంత్రపు సిరి, నరంమీద పుండూ అంటారు. ఇందుకే కాబోలు. నిన్నటిదాకా సుందరం, శంకరం చెట్టాపట్టాలేసుకుని తిరుగుతూ, వాళ్ళపై అధికారియొక్క నిరంకుశత్వాన్ని వేనోళ్ళ పొగుడుకుంటూ వుండినవాళ్ళే! అల్లాంటిది, ఈ రెండూ నెల్ల మేనేజరుతనంలో సుందరానికి తను గొప్పవాణ్ణనే అహంభావం కళ్ళుమూసుకునేట్లు చేసిందంటే, కామ క్రోధ లోభమోహ మదమాత్సర్యాలను సృష్టించిన భగవంతుణ్ణి మెచ్చుకోతప్పదు. అనసూయ ఇరుగుపొరుగులని పేరంటం పిలవటానికి వెళ్ళింది శ్రీదేవి సోఫాలో కూర్చుంది పిల్లవాడు స్టాండు ఉయ్యాల్లో నిద్రపోతున్నాడు. శ్రీదేవికి పెళ్ళయిన పది సంవత్సరాలకి పిల్లవాడు కలిగాడు. వాడి జన్మదిన విశేషం వల్లనే సుందరానికి మేనేజరుగా ప్రమోషన్ వచ్చింది. అంచేత వాడి పుట్టినరోజు గొప్పగా చెయ్యాలని సంకల్పించింది శ్రీదేవి. అంచేత పొరుగూరులో వున్న ఆడబిడ్డ అనసూయని పిలిపించింది. అనసూయభర్త ఒక ఎలిమెంటరీస్కూలులో టీచరుగా పనిచేస్తున్నాడు. అతను స్కూలుకి ఇనస్పెక్టరుగారు వస్తారని రాలేదు. అతను రాకుండా చెల్లాయి నొక్కదాన్ని పంపించినందుకు సుందరం అంతెత్తు యెగిరాడు.

"ఏమిటే అనసూ? తినగా తినగా గారెలు కనరెక్కాయిట వెనకటికి. అల్లా వుంది అతనిస్థితి. ఏం? వచ్చి ఈ నాలుగు రోజులూ ఇంట్లో వుండి, ఇంట్లోకి కావల్సిన నాలుగు సామాన్లూ తెచ్చిపడేయకూడదూ? నాకు నౌకర్లు లేకపోలేదు ఏదో ఇంట్లోమనిషే అంటే అదో నమ్మకం. పోయేటప్పుడు ఏదో ఒక పంచెగుడ్డ కొనిపడేయనా ఏమిటి?" అన్నాడు. అనసూయ ప్రాణం చివుక్కుమనిపించింది. తనయితే ఏదో అన్నయ్యకు లేక లేక కలిగిన పిల్లవాడి పండుగకదా అని అయితేనేం. ఏదో ఇన్నాళ్ళకి అన్నయ్య పెద్ద హోదాలోకి వచ్చాడుకదా అని అయితేనేం వచ్చింది కాని. తనభర్తకూడా వచ్చి వీళ్ళకు కొలువు చెయ్యాలని వుందా? తన పుట్టింటి మమకారం ఆయన నెత్తిమీద కూడా ఎక్కడమని రుద్దుతుంది? అనసూయ ఏమీ అనకుండా వూరుకొంది.

ఇటు అన్నగారిని అన్నా ప్రమాదమే ఏమన్నా అంటే ఏడాదికోసారి ఇంటికి పిల్చి రెండుచీరలు కొని యిచ్చేదికూడా మానికుంటాడు. అటు భర్తని "ఏమండీ? పోనీ మా అన్నయ్యదగ్గరకు రాకూడదా? మనకి ఏదన్నా సాయం చేయకుండా వుంటాడా?" అంటే, "ఏం? మీ అన్నయ్యకి నౌకర్లు తక్కువయినారా? నువ్వెళ్ళి వాళ్ళని మెప్పించుకుని మేకతోళ్ళు కప్పుకు



వస్తున్నావు చాలటంలేదా?" అని కసురుకుంటాడు. అంచేత అనసూయ యెవర్నీ ఏమీ అనకుండా రోజులు గుట్టుగా గడపటం అలవాటు చేసుకుంది.

● ● ●

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. శ్రీదేవి బద్దకంగా కళ్ళు విప్పింది. గదిలో ఒకమూల చాపమీద వుతికిన షర్టుపరిచి. చెంబులో కణ కణలాడే నిప్పుల్ని పోసి "చెంబిస్త్రీ" చేస్తున్న సుందరం కన్పించాడు. శ్రీదేవి హృదయం భగ్గుమంది కోపంతో.

"ఇంకా తెల్లారలేదు. అప్పుడే లేచి కూర్చున్నా రెందుకో? చీకటిదయ్యమల్లే!" అంది.

"లేచి చప్పున కుంపటి రాజేసి కాఫీ నీళ్ళుపడెయ్యి. స్నానం చేసేశానులే!" నిదానంగా అన్నాడు సుందరం.

"ఇవ్వాళ ఆరింటికే రమ్మన్నాడా ఏమిటి మీఆఫీసరు!" అంది విసుగ్గా.

"నీ ప్రశ్నలన్నీ ఒక కాగితంమీద వ్రాసి వుంచు! సాయంకాలం తీరిగ్గా జవాబులు

కె. వి. ఎస్. అచ్యుతవల్లి

వ్రాస్తాను. ముందు నామీద దయవుంచ వప్పున ఇన్ని కాఫీనీళ్ళు వచ్చే ప్రయత్నం చేయి!" అన్నాడు సుందరం. శ్రీదేవి విసురుగా లేచి చెంబులూ గిన్నెలూ చప్పుళ్లు చేస్తూ, కుంపటిదగ్గర కూర్చుని టప్‌టప్ మని కుంపటి విసురుతూ కూర్చుంది.

ఇంతలో హడావుడిగా శంకరం వచ్చి "ఇంకా ఇల్లానే కూర్చున్నావు(ట్రా)టయ్యా!" అంటూ అక్కడున్న మూడుకాళ్ళ కుర్చీ మీద కూర్చున్నాడు

"ఏమిటండీ మహానుభావా! ఈరోజు ఏదన్నా జాతర జరుగుతున్నదా ఏమిటి!" శంకరాన్ని చూసి అడిగింది శ్రీదేవి.

"జాతరన్న మాటే అనుకోండి" శంకరం నవ్వుతూ అన్నాడు సుందరం నెమ్మదిగా చెంబిస్త్రీ చేసుకున్న షర్టుని తొడుక్కుని టకప్ చేసుకుంటూ.

"అయిందా కాఫీ! వీడికూడా కాసిని పొయ్యి." అన్నాడు.

"డికాక్షన్ తీయటం అయ్యింది. ఇంకా పాలది రాలేదు." అన్నది.

"పాలది ఒకనాడన్నా వేళకువచ్చేదిస్తేగా! వక్కా విడని కాసిని పొయ్యమను." అన్నాడు సుందరం.

"రోజూ నేను ఈ అప్పులకి తిరగలేను బాబూ! అంతకన్న ఈ కాఫీలు మాను కుంటే నయం. నెలకి ఇరవయి రూపాయలు కలిసొస్తాయి లేకపోతే బడాయిమీకుకావి!" శ్రీదేవి కోపంగా అంది.

"అల్లాగే మానేద్దాం! తరవాణీకుండ ఒకటి ఓపెన్ చెయ్యి. చలవైనా చేస్తుంది." అన్నాడు సుందరం.

"తరవాణీ కుండ ప్రారంభోత్సవానికి మన మానేజరుగార్ని అధ్యక్షులుగా వుండ మనాలని నా ప్రతిపాదన" అన్నాడు శంకరం.

"మానేజరేం ఖర్మ! ఆహారశాఖ మాత్యుల్ని పిలిపిస్తే యింకాబాగుంటుంది." వెక్కిరింపుగా అంది శ్రీదేవి. ఇంతలో పాలది పాలు తెచ్చింది. పాలు పుచ్చుకుని, కాఫీ కలిపి యిద్దరికీ చెరోకప్పూ యిస్తూ

"ఇంతకీ అసలుసంగతి చెప్పారుకాదేం! వస్రోతవ్యమా ఏమిటీ!" అంది.

"అవశ్యం శ్రోతవ్యం! కాని చెప్పడం బాగుండదు అనుకోండి. కాని చెప్పకుండా వుండటం యింకా బాగుండదు. కనుక చెప్పక తప్పదు అని నా అభిప్రాయము" అన్నాడు శంకరం.

"ఏమిట్రా వెధవగోల! కాఫీలో పంచ. దార లేదే శ్రీదూ!" అన్నాడు సుందరం

మీకాఫీకి నాలుగు కిలోల పంచదార కావాలి." అంది శ్రీదేవి.

"పాలు పలచగా వున్నప్పుడు యింకో రెండు చెంచాలు పంచదార యెక్కువ వేసు కుంటే, సానకం త్రాగామన్న తృప్తైనా మిగులుతుంది మరి." అన్నాడు సుందరం!

"అసలు టీలో పాలు పోసుకోరు." అన్నాడు శంకరం.

"వెధవ న్యూసెన్సు! ఉత్తిహాస్యాలజీ ప్రొఫెసరువు నువ్వు! పద! టైం అయి పోతోంది.' తొందర చేశాడు శంకరాన్ని సుందరం.

"ఉత్తి న్యూసెన్సు అంటే చాలదుట్రా వెధవ అనే విశేషణం కూడా యెందుకు! ఆడమ్మా యి, ఆగ్గి నిప్పు అన్నట్లు!" అన్నాడు శంకరం.

"సంతోషించాం నీ తెలివికి! నడు మహా దేవా!" సుందరం శంకరాన్ని బయటకు లాక్కుని పోబోయాడు

"సర్లెండి! సంగతేమిటో చెప్పకుండా పోతున్నారుకదూ!" అంది శ్రీదేవి వెనుక నించి.

'అదేనండి. మరేమో. మరేం -" అంటూ సాగతీయటం మొదలెట్టాడు శంకరం.

"మరేమో. మరేం! ఏమిటా సంగిరి పింగిరిమాటలూ!" విసుక్కున్నాడు సుందరం.

"అదేనండి! ఆవిడా - ఆవిడేమో!"

"ఆవిడా! ఆవిడెవరూ!" ముఖం చిట్లించింది శ్రీదేవి.

"ఆవిడంటే ఆవిడేనండి! చాలామంచి వారండి. మీలాగే నేను ఎప్పుడువెళ్ళినా వెండి గ్లాసుతోగ్లాసుడుకాఫీ యిచ్చేస్తుందండి. పంచ దారకూడా ఎక్కువగానే వేస్తుంది. వాళ్ళింట్లో కాఫీ చాలాబాగుంటుంది. ఏమంటే పాలు చిక్కనివి. పైగా కాఫీపొడరుకూడా చాలా ఖరీదు వాడుతారు." శ్రీదేవికినవ్వువచ్చింది.

"నేను కాఫీగురించి వర్ణనచెయ్యమన్నా నా మిమ్మల్ని!" అంది. శంకరానికి తను చెబుతున్నదేమిటో అర్థం అయింది.

"ఆవిడంటే, అదే ఆ కాఫీ యిచ్చే ఆవిడ, మా ఆవిడకాదులెండి. కానిసాక్షాత్తూ మా ఆవిడకి డూప్లికేటు అనుకోండి. అదే కోపానికి! ఇంతకీ ఆవిడ మా మానేజరు గారి భార్యా రత్నం." అన్నాడు.

"సరే! ఇప్పుడు యింతకీ, మీరు తూర్పు తెల్లవారకుండా వెళ్ళి చేయాల్సిన ఘనకార్యమేమిటంటా!"

"అదే చెబితేతంటా!" సుందరం వేపు చూశాడు శంకరం. అప్పటికప్పుడే సుందరం సైకిలెక్కిపోవటం, ఆ వాహనం, అఘ మేఘాలమీద ప్రయాణం చెయ్యటం కూడా చూసి నిర్ఘాంతపోయాడు శంకరం. వెనక నించి

"శంకరం బాబూ!" అన్న పిలుపు వినపడటంతో వెనక్కి తిరిగాడు. ఆఫీస్ బంట్రోతు గురవాయి.

"ఏంటోయ్!" అన్నాడు శంకరం.

"అమ్మగారు చాలా బాధపడుతున్నా రుటండీ. మిమ్మల్ని వచ్చేటప్పుడు, టాక్సీ తీసుకరమ్మన్నారు మానేజరుగారు." అన్నాడు గురవాయి.

"వస్తానండీ వదినగారూ." అంటూనే సైకిలెక్కేసి వెళ్ళిపోయాడు శంకరం.

"ఏమిటో హడావిడి!" అంది శ్రీదేవి.

● *వాటాకావాలని వచ్చినవాడితో ఇల్లుగలాయన: "మా ఆవిడకి చీమ చిటుక్కుమన్నా నిద్రపట్టదు. అంతా నిశ్శబ్దంగావుండాలి. మీకు పిల్లలున్నారా!"*

"లేరు."

"రేడియోవుందా!"

"లేదండి"

"మీ ఆవిడ పాటలు పాడుతుందా!"

"ఉహు, అదేంలేదుగాని, అప్పుడప్పుడు నా పెన్నుమాత్రం రాసుకుంటుంటే గరగరమంటుందండీ."

"అమ్మగారునొప్పులుపడుతున్నారండీ!" అన్నాడు గురవాయి.

"అయితే ఏ "అయా"కో కబురంపితే సరిపోలా? ఈ మగధీరులెందుకు?"

"ఆమెగారు చాలా కష్టపడతారంట పాపం!"

"పడితే పడతారుమరి. వీళ్ళేంచేయగల రట?"

"ఈవూళ్ళో సుందరంగారంటే, శంకరం గారంటేపుట్టిపెరిగారుగందా? అంచేత ఈళ్ళకి వూళ్ళో ఏడమంచి హాస్పటాలో తెలుస్తది కదాని పిలిపించారు. పైగా ఈరు కూడా మానేజరుగారి తల్లో నాలుకల్లా మసలు కుంటారు." అన్నాడు గురవాయి. శ్రీదేవి నణుక్కుంటూ లోపలికి వెళ్ళి పోయింది.

• • •

"జున్ను చాలా బాగుందే శ్రీదూ!" అన్నాడు సుందరం. శ్రీదేవి వాళ్ళ పుట్టిల్లు ప్రక్కనున్న పల్లెటూరు. వాళ్ళ గేదె ఈనిందట. పాలేరుచేత జున్ను పంపించారు శ్రీదేవి పుట్టింటివారు.

"ఇంకొంచెం పెట్టనా?" అంది శ్రీదేవి. పంచదారా, మిరియప్పొడితో మహారుచిగా కుదిరింది జున్ను.

"వొద్దులే! నువ్వుతిన్నావా? ఇంకా ఎంతవుంది? గిన్నె చూపెట్టు!" అన్నాడు సుందరం. గిన్నె చూపెట్టింది. ఇంకా మూడువంతులువుంది అందులో.

"తెల్లగా, గడ్డలా భలే కుదిరింది." అన్నాడు. ఈ స్తోత్రపాఠం ఎందుకు వల్లె వేస్తున్నాడో శ్రీదేవికి తెలియందికాదు.

"దేనికి చెప్పండి!" అంది.

"వాళ్ళ అమ్మాజీకి జున్నంటే చాలా ఇష్టంట. మొన్న ఏదో మాటలపందర్భంలో చెప్పింది. కాస్త ఇద్దామనిపించింది." నెమ్మదిగా అన్నాడు.

శ్రీదేవి చర్రుమంది. అమ్మాజీ అంటే ఆఫీసు మానేజరుగారి మరదలు.

"ఎందుకండీ మీకీ ఆరాధన? కొత్తగా కాకారాయుళ్ళు అయిపోతున్నారు? మనమటుకు మీ ఎత్తులు, జిత్తులు తెలీకుండా వున్నారనుకున్నారా ఏమిటి?" అంది.

"మనకి షన్నదాంట్లో ఇంకొకరికి పెట్టటం, మంచిగా అవతలవాళ్ళని విమర్శించకుండా సర్దుకుపోవటం ఎత్తులు, జిత్తులు అవుతాయా? ఏదో పెద్దాయన. గౌరవనీయుడు. ఏది యిచ్చినా తృప్తిగా స్వీకరిస్తాడు. మన మంచితనానికి మర్యాదకి సంతోషిస్తాడు." శాంతంగా అన్నాడు సుందరం.

"తేరగావస్తే నేనూ సంతోషిస్తాను. ఇంట్లోకి ఏదన్నా తేవటం భయం. ఆయనకి పట్టుకెళ్ళి ధారపోస్తారు. ఇంతాచేస్తే, మీకు ఆయనగారు ప్రమోషన్ ఇచ్చేదీలేదు, చచ్చేదీలేదు. ఇద్దరం మనుష్యులం! మనకేం పిల్లా, జెల్లా? ఎవరున్నారు? ఏదో నాలుగు డబ్బులు వెనకవేసుకుందామన్న ధ్యాసే లేదు. ఇంట్లో ఇలి, పైవాళ్ళకి బలి. లేనిపోని ఆడంబరాలకుపోయి అస్తమానం ఆఫీసరుగారి సంతని సినిమాలకు తీసుకెళ్ళా? టీపార్టీలు చెయ్యా; డిన్నర్లుచెయ్యా. ఎక్కణ్ణించి వస్తుంది? మీతాతగారిముల్లే, మా తాతగారిముల్లే మూలిగి ఏడుస్తూందా ఏమిటి? ఇల్లా అయితే నేనీ సంసారం ఈదలేను బాబూ!" రుద్ధకంఠంతో అంది.

"అంత కోపమెందుకే శ్రీదూ? నువ్వయినా అంతా తినెయ్యలేవుకదా? ఎల్లానూ ఇరుగుపొరుగుకి కాస్త పెడతావుకదా? అందులోదే కాస్త ఇమ్మన్నానుకాని, అంతా పట్టుకెళ్ళిఇచ్చేస్తానా?" అన్నాడు సుందరం.

శ్రీదేవి మాట్లాడకుండా జున్ను అంతాతీసి, ఒక వెండిగిన్నెలో పెట్టి యిచ్చింది. ఇస్తూ "వెండిగిన్నె బాగుంది అంటారు వాళ్ళు! అంటే ఆ గిన్నెకూడా యిచ్చేసి రాకండి" అంది.

సుందరం నవ్వుకుని వెళ్ళిపోయాడు.

• • •

ఇవ్వాళ ఒంటిగంటకే వేంచేశారేం శ్రీవారు? మీ ఆఫీసరుగారు వూళ్ళోలేరా?" సైకిలుదిగి స్టాండ్ వేసి లోపలికి వస్తున్న సుందరాన్ని అడగబోతూ గుమ్మందగ్గర కారు ఆగటం, అందులోంచి ఒక రెండు జడల అమ్మాయి వయ్యారంగా దిగటం చూసి, నాలికని అదుపుచేసింది శ్రీదేవి. ఆ అమ్మాయిని ఆహ్వానించి చాపవేసి కూర్చోపెట్టింది శ్రీదేవి సుందరం గోడ కానుకుని నిలబడ్డాడు.

"ఈ అమ్మాయి మన ఆఫీసరుగారి మరదలు. పేరు అమ్మాజీ. డాక్టరు కోర్సు చదువుతున్నారు. అస్తమానూ మిమ్మల్ని అడుగుతోనే వుంటుందండి మా అవిడ. ఏదీ, మీ అక్కగార్ని చూట్టానికి వద్దామనుకుంటూంది. నన్ను రోజూ తీసుకెళ్ళండి! అని అడుగుతోంటుంది. నాకు తీరుబాటు లేక తీసుకరావటం లేదు." అన్నాడు సుందరం.

ఆ అమ్మాయిలేచి చిన్నగా నవ్వుతూ, శ్రీదేవి ముఖాన బొట్టుపెట్టి,

"రేపు మా అక్కకూతుర్ని ఊయల్లో వేస్తారు. తప్పకుండా పేరంటానికి రండి." అన్నది.

ఆ అమ్మాయి కట్టుకున్న డెకరాన్ చీర వేపు బిక్కగా చూస్తూ నిలబడింది శ్రీదేవి.

"కాస్త టీ ఇయ్యవే శ్రీదూ!" అన్నాడు సుందరం. శ్రీదేవి గబగబా లోపలికివెళ్ళి భర్తకోసరం ఫ్లాస్కులో పోసుంచిన, టీని రెండు గాజు గ్లాసుల్లోకి వొంపి తెచ్చి ఇద్దరికీ చెరొక గ్లాసూ ఇచ్చింది.

"నాకు టీ అలవాటు లేదండీ. ఒక్కసారి పుచ్చుకున్నానంటే, స్లీపింగ్ టాబ్లెట్స్ వేసుకుంటేకాని, రాత్రిళ్ళు నిద్రపట్టదు. ఆ టాబ్లెట్స్ వేసుకుంటే గుండెకి మంచిది కాదుట" అన్నది అమ్మాజీ.

"అయితే మధ్యాహ్నం మీరేం పుచ్చుకుంటారు?" ఆదుర్దాగా అడిగాడు సుందరం.

"ఫోర్ థర్టీకి డ్రింకింగ్ చాకొలెట్ తీసుకుంటాను" అన్నది అమ్మాజీ.

"ఒక్కనిమిషం కూర్చోండి. ఈలోగా మీరేదయినా మాట్లాడుతూవుండండి" అని భర్తతోనూ, అమ్మాజీతోనూచెప్పి ప్రక్కవాటాకొనికి వెళ్ళింది.

"నా గురించి శ్రమతీసుకుంటున్నారు పిన్నిగారు" అన్నది అమ్మాజీ.

"దానిదేముంది లెండి. ఇంతకీ మీరు హిందీసాంగ్స్ లైక్ చేస్తారా, లేక తెలుగు సాంగ్స్ లైక్ చేస్తారా?" అంటూ తన

● *ఏటేటా పురుడుపోసుకుంటున్న అరడజనుమంది పిల్లల తల్లిని పక్కింటావిడ అడిగింది!*

"ఎన్నో నెలమ్మా ఇప్పుడు?"

"ఇకనుంచీ నెలాలేదు గిలాలేదు. ఏటా పురుడెందుకొస్తోందో మాకు తెలిసిపోయింది."

పెళ్ళికి అలకపాన్పుమీద తన మామగారు కొనిచ్చిన మూడువాల్వులు, రెండుబ్యాండులు గల రేడియోలో, "వివిధ భారతి"ని ట్యూను చేశాడు సుందరం. శ్రీదేవి ప్రక్కవాటా వారి అబ్బాయిని బ్రతిమాలుకొని, ఒక అర్ధ రూపాయి చాకొలెట్ బిళ్ళలు కొని తెప్పించింది. ఒక స్టెయిన్‌లెస్ పళ్ళెంలో పెట్టి తెచ్చి అమ్మాజీకి ఇచ్చింది. అమ్మాజీ ముందు తెల్లబోయింది. తర్వాత తనలో తనే నవ్వుకుంటూ ఆ చాకొలెట్లుతిని కాసిని మంచినీళ్ళు త్రాగింది.

"ఇంక వెళ్ళివస్తాను. రేపు పెంద్రాళే వచ్చెయ్యండి."

అని కారుదగ్గరికి నడిచింది సుందరం కూడా వెనకాతలే వెళ్ళటంచూచి "మీరు మళ్ళీ వెళ్ళిపోతున్నారా?" అన్నది శ్రీదేవి.

"వుష్! అరవకు. ఇంకా నూటయాభై ఇళ్ళలో పిలవాలి" దగ్గరగావచ్చి అన్నాడు సుందరం చేతిలోని లిస్టుచూస్తూ.

"అయితే సైకిలు అక్కడపెట్టి వెళ్ళండి. ప్రక్కవాటావారి రామంచేత నాలుగు కిలోల బొగ్గులు తెప్పించుకుంటాను. ఇంట్లో ఒక్క బొగ్గుముక్క లేదు. పొయ్యిమీదకి లేవు! పొయ్యిలోకి లేవు! నే నెల్లా వండి వార్చతాను?" అంది శ్రీదేవి విసుగ్గా.

"సైకిలు విగవిడిచి నే నెల్లాపోతానే, అక్కడో ఇల్లూ, అక్కడో ఇల్లూ తగలడ్డాయి! ఇవ్వాళకి ఎల్లాగో అల్లాసర్దుకపోదూ. నీకు దండంపెడతాను" లాలింపుగా అన్నాడు సుందరం.

"ఆఁ సర్దుకపోతాను మిమ్మల్ని కట్టుకోటమే నా బ్రతుక్కి సరుకపోవటమయింది. రోజూ నేను సర్దుకపోతూంటే, తెల్లారేసరికి మేకువుతెచ్చి నెత్తికెత్తుతానంటారు మీరు! ఎల్లా చచ్చేది దేమురా?" ఉక్రోషంగా అంది శ్రీదేవి.

"పూరుకోవే దేవతా! అమ్మాజీ వింటే ఏమన్నా అనుకుంటుందీ" ప్రాధేయపడుతూ అన్నాడు సుందరం.

"ఎందుకనుకుంటుందేం! అంతగా మీరే ఇళ్ళన్నీ చూపించాలని వుంటే కారులో తీసుకపోకూడదా యేం?"

"పూరుకోమంటున్నా కాదుటే బాబూ! ఇవ్వాళ నీకు ఎంత రాత్రయినా సరే, బొగ్గులూ, బియ్యం తెచ్చిపడేస్తాను. సరేనా!" విసుగ్గా అంటూ బయటకు వెళ్ళాడు సుందరం.

మొత్తానికి సుందరం మేనేజరుగారికి చేసిన పూజ బొగ్గులపూజకాలేదు. అతని పూజాఫలంవల్ల మేనేజరుతనం వచ్చింది. మేనేజరు ట్రాన్స్‌ఫర్ అవగానే సుందరానికి ప్రమోషన్ ఆర్డరు వచ్చింది. ఈవార్తకి అతని సహచరులు అంతా సంతోషించారు. ఘనంగా సన్మాన సభ ఏర్పాటు చేశారు. శంకరం అధ్యక్షోపన్యాసం చాలా ఉద్రేకంగా చేశాడు.

"మనువంటే మేనేజరనబడే వ్యక్తిపైనుంచి రావటంవల్ల మనతో కలియకుండా తనేదో ఏడుకొండలవాడిలా ఫోజులిస్తూ కూర్చుని, మన్ని వేపుకుతినేవాడు. కాని నేడు మన మేనేజరుగా, ఇన్నాళ్ళూ మన సహబాధితుడుగా వున్న వ్యక్తి అవడం చేత అతనికి మనపట్ల సంపూర్ణ సానుభూతి వుంటుంది. మన భవిష్యత్తు అంతా ఆశాజనకంగా వుంది. మనమంతా ఒకే కుటుంబం వాళ్ళం. ఇనుక మనకిక నిశ్చింత" అంటూ చెప్పుకుపోయాడు. గుమస్తాలంతా మిన్ను ముట్టేట్లు కరతాళ ధ్వనులు చేశారు ఒక భావకవి "అందరం, మన మందరం, సుందరం అందలం ఆరోహణం చూసి విస్మితులం. మందస్మితులం. దరహసితులం" అంటూ ఆశుకవిత్వంగా పాడాడు. అతని ఖండకావ్యం అప్పటి కప్పుడే గుమాస్తాలందరిలోనూ మంచి ప్రచారం సంపాదించింది. ఇంకొక ఆధునిక కవిత్వరీతుల్ని ఆకళింపు చేసుకుంటున్న పిల్లకవి జపాను భాషలో వ్రాయబడే హౌక్కుల పద్ధతిలో అప్పటికప్పుడు

"సుందర్!

పెదవులపై లాస్యంచేసే నగవులుగల ఆఫీసర్!

ఇహమీదట మా భయాలన్నీ నీ సమక్షంలో ఖబాదూర్!"

అని వ్రాసిన చీటీ గులాబీపూలగుత్తిలో పెట్టి సుందరానికి ఇచ్చాడు. సుందరం వినమ్రంగా తలవంచి స్వీకరించాడు అది ప్రక్కనే కూర్చున్న శంకరం చదివి అందరికీ విన్పించాడు. చివరికి తెలిసిన శారాంశ మేమంటే సుందరం పదవీస్వీకరణవల్ల పిల్లకాకులన్నీ కోకిలలుగా పరివర్తనం చెంది పంచమస్వరంలో ఆనందగీతాలు ఆలాపించాయి.

శ్రీదేవికి మునపటికి మల్లే చీటికిమాటికి కోపం రావటంలేదు. మితంగా మాట్లాడటం, అమితంగా భక్ష్యపానీయాదులందు శ్రద్ధ తీసుకోవడం అలవాటు అయింది. మానేజరు భార్య అయినాక శ్రీదేవికి తెలుగు తిండి, తెలుగుభాష, తెలుగుసినిమాలు అంటే గిట్టటంలేదు. ఆవకాయలు, కందిపొడుం, గోంగూర పచ్చడీ మొదలైనవి, ఆమెకి మోటు తిళ్లుగా కనపడుతున్నాయి. పని

● ఒక గానసభలో గాయకుడిని ఒక పెద్దమనిషిలేచి సినిమాపాటలు పాడమని కోరాడు.

ఆ గాయకుడు వెంటనే 'మూగమనసులు'లోని పాట పాడాడు.

'ఇంకా పాతది పాడండి' అన్నాడాపెద్దమనిషి.

'మాయాబజారు'లోని పాట అందుకున్నాడు గాయకుడు.

'అబ్బే! ఇంకాపాతది!' అన్నాడు.

కొంచెం విసుగుతోనే ఆపాట ఆపి 'బాలరాజు'లోది మొదలుపెట్టాడు!

'ఏం అనుకోక ఇంకా పాతపాట పాడండి! వినాలనివుంది!' అన్నాడు పెద్దమనిషి.

గాయకుడికి ఒళ్ళు మండిపోయింది. మాట్లాడకుండా ఊరుకున్నాడు!

'పాడరేం' అన్నాడతడు.

"ప్రస్తుతం నేను పాడుతున్నది బాగా పాతపాట! మొట్టమొదటి మూకీ చిత్రంలోనిది!" అని సమాధానమిచ్చాడు గాయకుడు

—ద్విభాష్యం రాజేశ్వరరావు,
యలమంచిలి.

పిల్లలు మొదలు పనివాళ్ళవరకూ. ఆమె ఇంగ్లీష్‌లో మాట్లాడటం చూసి విస్తుపోయే వారు. ఇంగ్లీష్ ధారాళంగా మాట్లాడటం కోసం ఆమె ప్రత్యేకంగా ఒక ట్యూటర్‌ని నియమించుకుంది. సుందరం కాపుఆగగానే. ఆమె "శ్రీదేవినీ. నీదుదేవేరినీ" అని పాడుతూ స్వాగతం ఇస్తుంది.

"కృషితో నాస్తి దుర్భిక్షం అన్నారు చూశావా ?" అనేవాడు సుందరం.

"అందుకనే వర్క్. వర్క్. వర్క్" అన్నా రెవరో శ్రీదేవి వంతపాడేది.

• • •

"అర్జంటుగా పదవే ! ఇంటికి తాళం వెయ్యి" అన్నాడు శంకరం పార్వతితో. మధ్యాహ్నం రెండుగంటలయింది. ఎండ నిప్పులుచెరుగుతోంది. అల్లాంటి వేళ భర్తరాక చూసే ఆశ్చర్యపోతూంటే, తన్నుకూడా బయలుదేరమంటంచూసి ఇంకా విస్మితురా లయింది పార్వతి.

"ఎక్కడికి ?" అంది.

"సుందరం ఇంటికి." అన్నాడు.

"ఎందుకు ?"

"ఏమిటా చొప్పదంటు ప్రశ్న ! చెప్పిన పేముఖకొని రమ్మంటుంటే !" విసుక్కున్నాడు శంకరం.

"కారణం లేందే దేనికీ ఎండలో ?"

"రేపు వాడికొడుకు పుట్టిన రోజుట. అందుచేత ఇంట్లో పండిదివంటలకి నన్నూ, బయట సర్దుబాట్లకి నన్నూ రమ్మన్నాడు."

"ఏం వంటవాళ్ళని పెట్టుకోకూడదా ! అన్నింటికీ మన్నే పిలుస్తారు దేనికి ? మన మేమన్నా వాళ్ళ వాళ్ళమా ?" కోపంగా అంది పార్వతి.

"అదేంమాట ! మేమిద్దరం చిన్నప్పట్నించీ స్నేహితులం కనుక చనువుగా పిలుస్తాడు వాడికి నౌకర్లులేకనా"

"అవునవును పాపం. ఆప్తమిత్రులు ! అందుకనే. ఆయనకిప్రమోషన్ వచ్చిఆర్నెల్లయినా. మీ సీటు ఆరంగుళమన్నా కదల లేదు. సిగ్గులేకపోతేసరి ముఖానికి ! వూళ్ళో అందరూ "ఆఫీసను ఇంటిచుట్టూ తిరుగుతాడు. ఆయన్ని బుట్టలో వేసుకుందుకు ప్రయత్నంచేస్తున్నాడు. అనుకోవటం మానిం వెళ్ళి అక్కడ ఆప్యాయతగా పలకరించే దిక్కన్నా లేకపోయినా అడవాచాకిరీ చేయటం దేనికి ఈ శ్రమ చెప్పండి !" పార్వతి బాధగా అంది.

"లోకులు ఏవో అనుకుంటారు లెద్దూ. నువ్వు చెప్పిన తెలుసు. ఈ రోజు అందుకనే సెలవు తీసుకువచ్చాను. సుందరం వెంటనే ఇచ్చాడు సెలవు."

"వెంటనే ఇచ్చాడు. పాపంఎంతదయ మీ మీద ?

తనపని కనుక యిచ్చాడు. అదే మనం మాట్నీకి పోతామంటే యిస్తాడా సెలవు ?" అంది పార్వతి.

"అదీ చూద్దాంకాని ముందు నువ్వుపద!" అన్నాడు శంకరం.

• • •

"పండక్కి పదిరోజులెందుకోయ్ సెలవు ?" అన్నాడు సుందరం పదిరోజులు సెలవుకోసం దరఖాస్తు పెట్టిన శంకరాన్ని.

"అబ్బే. పండక్కికాదు. మాచెల్లాయి పెళ్ళి ఒకటన్నది. దానికి పనులూ అవీ చేసుకోవాలి" నెమ్మదిగా అన్నాడు శంకరం.

"మీఇంట్లో బోలెడుమంది బంధుజనం వుండగా. నువ్వే చేయాల్నా ఏమిటిపనులు! అసలు నీకు ఆఫీసు పనంటే బద్ధకం బలిసి



పోతోంది" అన్నాడు సుందరం. శంకరం బిక్కచచ్చిపోయాడు. అయినా నిదానంగానే

"మానాన్నగారు పెద్దవారై పోయారోయ్ మరి. అన్నిటికీ ఇంట్లో నే నొక్కణ్నేగా చెయ్యవలిసినవాణ్ని" అన్నాడు.

"అయితే. ఏ కాజుయల్‌లీవు ఈ సంవత్సరానికి అయిపోయిందికనుక జీతనష్టం మీద లీవు తీసుకో ?" అన్నాడు సుందరం

శంకరం నిర్ఘాంతపోయాడు. తనకిచ్చే వందరూపాయల్లోనూ, పదిరోజులజీతం నష్ట పోతే, తనకి వచ్చేనెలంతా ఎల్లాగడుస్తుంది? నిజానికి కాజుయల్‌లీవు అంతా సుందరం ఇంటిపనులకోసమే వాడాడుకద తను ! అది సుందరం యెందుకని గ్రహించుకోడు ?

బరువుగా కాళ్ళీడ్చుకొంటూ మేనేజరు రూంలోంచి ఇవతలికివస్తున్న శంకరాన్ని హాల్లోకూర్చున్న గుమాస్తాలంతా పరామర్శించారు. విషయం అందరికీ విశదపర్చాడు శంకరం.

"నీ లోకువచూసి తెగ చేయించు కున్నాడు" అన్నాడు ఒకడు.

"అసలెప్పుడూ గీర్వాణమే వాడికి!" ఇంకోడు ధ్రువపరిచాడు.


"వాడి పెళ్ళాం ఇప్పుడు దొరసానమ్మ అయిపోయింది!" ఇంకో బ్రహ్మచారి గొణుక్కున్నాడు.

"ఇదంతా నా ఖర్మ!" శంకరం నిర్వేదంగా అన్నాడు.

"ఖర్మ సిద్ధాంతం కట్టిపెట్టుశయ్యా! తొండముదిరితే ఊసరవెల్లి అయి రంగులు మారుస్తుందట! అల్లావుంది వీడివ్యవహారం వాడింట్లో పిల్లిపిల్లఛస్తే మనమంతా పూడిగం చేయాలంటాడు. ఎవరుచేస్తారు? నువ్వు మామూలుగా ఎర్న్డ్ లీవుపెట్టివెళ్ళిపో! వాడుకనుక జీతంకోసేస్తే, మేమంతా సమ్మె చేస్తాం. కుదురుతుంది వాడి తలతిక్క! నడమంత్రం సిరి. నరం మీద పుండూ అన్నట్లు వుంది వాడి వరస!" ఇంకో విప్లవవాది సలహా చెప్పాడు.

అందరూ మెల్లిగా ఆఫీస్‌వదలి బయటికి వచ్చారు. ఆఫీస్ ఆవరణలో ఒక కాకిచచ్చి పడుంది. ఆ చచ్చిన కాకి చుట్టూ చేరిన కాకులు గోలగా అంటున్నాయ్. అయినా ఏదేవుడూ ఆకాకికి ప్రాణం పొయ్యడు.

000



సత్యాదేవి వీణ వాయిస్తోంది.

హిందోళరాగం ఆలాపిస్తోంది ఆమె - శ్రీకృష్ణునికి ప్రియమైన రాగము హిందోళ. ఈ ఉదయము అద్భుతంగాపలుకుతోంది వీణ. శిశిరఋతువును వీడ్కొలిపి, వసంతాన్ని ఆహ్వానిస్తూ ఏవేవో వింత వింత రాగచ్ఛాయలను స్ఫురింపజేస్తున్నాయి వీణ, పైన వింతగా నాట్యమాడుతూన్న సత్యభామ వ్రేళ్ళు.

నా కోసము

చటుక్కున వీణా వాదమును ఆపింది సత్య.

ఎదుట కూర్చున్న శ్రీకృష్ణుడు ఆమె సంగీతాన్ని వినడంలేదు.

అతడేమో పరధ్యానంలో మునిగిపోయాడు వాద్యమును వింటూవింటూనే. సత్య ముఖం చిట్లించుకుంది. కాని, వెంటనే తేరుకుని వేదికనుండి దిగివచ్చి, నాధుని భుజాన చేయిఉంచి, అనునయిస్తూ అడిగింది "ఏమిటి ఆలోచిస్తున్నారు?" అని.

శ్రీకృష్ణుడు పలుకలేదు.

సత్య మళ్ళాఅడిగింది. ఈసారి మరింతగా బుజ్జగిస్తూ "ఏమిటి ఆలోచిస్తున్నారు? చెప్పరా?" అని.

ఆమెకేసి ఎంతో ఆదరంగాచూస్తూ అన్నాడు శ్రీకృష్ణుడు "ఏమీలేదు సత్యా!" అని.

సత్య నమ్మలేదు. చెప్పక తప్పదంది పట్టుదలతో.

దూరాన ఆకాశాన్ని అంటుతూన్న పూచిన పున్నాగ వృక్షపు చిటారికొమ్మల పైన దృష్టినిలిపిఉన్న శ్రీకృష్ణుడు అన్నాడు "ఇందుమతి, పాపము చాలాబాధపడుతోంది. కన్నీరు మున్నీరుగా ఏడుస్తోంది, ఇంమా, పాపము!" అని.

సత్యాదేవి విశాలనేత్రాలు ఈర్ష్యాకషాయితములు కాలేదు. కాని, ఆమె చెక్కిళ్ళపైన గులాబీలు మరింత ఎర్రనైనవి.

"ఇందుమతి ఎవరూ?" అని ప్రశ్నించింది సత్య, సాధారణస్వరంతోనే

ఒక్కక్షణం ఆగి, శ్రీకృష్ణుడు ప్రత్యుత్తర మిచ్చాడు! "నేను వ్రేపల్లెలోవుండగా పన్నెండేళ్ళ బాల. సుగుణపాలుని కూతురు—"

"గొల్లపిల్లా!" అంటూ, అతని మాటకు అడ్డము వచ్చింది, సత్య.

"అవును; గొల్లపిల్లే; మా అందరితోనూ బృందావనములో ఆడుకునేది. బంగరపు బొమ్మ; చక్కని కంఠస్వరము ఆమెది. ఎప్పుడూ ఆడుతూ పాడుతూ ఉండేది. ఆబాల ఇప్పుడు నవయౌవన అయినది ఆమె పెండ్లికై పెద్దవారు తొందరపడుతున్నారు"

"ఆమె కిష్టంలేదు పెండ్లిచేసుకోవడం. అంతేనా?" అన్నది సత్య. కాస్త కటువుగానే కాని మరుక్షణము. ఆమె గొంతుక మారింది. శ్రీకృష్ణుని కన్నులలోని కరుణ

పెళ్లివను గుర్తించి ఎంతో నెమ్మదిగా పలుక సాగింది ఆమె. "ఒకసారి ఇందుమతిని చూడాలని ఉన్నదా? వెళదాము పదండి. నేనూ వస్తాను మీతో వ్రేపల్లెకు. అదీగాక, అత్తమామలను చూచి చాలా రోజులైనది" అంటూ కృష్ణుని చేతులను తన చేతులలోకి తీసుకుంది సత్య.

ప్రొంచెత్తే అపేక్షతో ఆమెకేసిచూస్తూ శ్రీకృష్ణుడు అన్నాడు "మన మోహన కుమారునికూడా మనతో తీసుకువెళ్ళదాము .... మోహనుడు బుద్ధిమంతుడు."

మోహన కుమారుడు సత్యాదేవి మేనల్లుడు. మేనత్తను చూడాలని వచ్చాడు ఈ మధ్యనే.

అవతల అడుగుల చప్పుడైంది. "అత్తయ్యా!" అని పిలుస్తూ మోహనుడే లోనికి వచ్చాడు. మామకు నమస్కరించి, సత్యాదేవిని చూస్తూఅన్నాడు: "వీణ అవివే శావేమి అత్తయ్యా? నే వినాలని వచ్చాను" అని.

సత్యాదేవి అన్నది "మోహనా! మనకు ఊరిప్రయాణము కలిగింది. మీ మామయ్య మనల్ని వ్రేపల్లెకు తీసుకువెళతారట!" అని.

శ్రీకృష్ణుడన్నాడు "అతడే మనలను తీసుకు వెళతాడు. మనకు వేరే సారధి ఎందుకూ? రధమును మోహనకుమారుడే నడుపుతాడు!" అని అంటూ మోహనునికేసి పరీక్షగాచూచాడు.

"ఎందుకలా పరీక్షగాచూస్తున్నారు? అంతా మీ పోలికే! ఎలావచ్చిందో కాని, మమ్మూర్తులా మీ స్వరూపమే. శిఖిలో నెమలికన్నూ, చేతిలో వేణువూ ఉంటే రెండవ శ్రీకృష్ణుడే, మీ అల్లుడు!" అన్నది సత్య సంభ్రమముతో.

మోహనకుమారుని ఉత్సాహానికి మేర లేదు. ఎన్నాళ్ళనుంచో అనుకున్నాడు శ్రీకృష్ణునితో వ్రేపల్లెనుచూడాలని. ఎన్నాళ్ల నుంచో ఆశపడ్డాడు శ్రీకృష్ణుని రధాన్ని తాను నడపాలని.

2

గుర్రాలు ఉత్సాహంతో పరుగెత్తుతున్నాయి, వ్రేపల్లెవైపు.

మామా అల్లుడూ ఏమేమో మాట్లాడుకుంటున్నారు, రథశబ్దంలో, వారిమాటలు కొంచెము వినిపిస్తున్నాయి. కొంచెము వినిపించడములేదు, సత్యభామకు. అప్పుడప్పుడు మాత్రము, ఇందుమతి పేరువింటూ ఉన్నట్లనిపించినది ఆమెకు. లేత చిరునవ్వు సత్యాదేవి ముఖకమలాన్ని మరింత కాంతివంతంగా చేసింది, ప్రయాణపు బడలికను క్రమ్మివేసి.

యమునా తీరము చేరేసరికి మోహన కుమారుని ప్రశ్నలు మరీ ఎక్కువైనాయి. అతను ఉత్సాహంతో అడుగుతున్నాడు మామను, పూర్వవిషయాలను గురించి. శ్రీకృష్ణుడు మరింత ఉత్సాహంతో వర్ణిస్తున్నాడు బృందావన వివరాలను

నీటిదరికి చేరేసరికి గుర్రాలు సకిలించాయి.

"దప్పికైనట్లున్నది. రధమునుఆపి, కళ్ళెములను సడలించు" అన్నాడు శ్రీకృష్ణుడు.

ఆచంట జానకిరామ్

ఫాల్గుణమాసము చివరిరోజులు కావట్టి యమునలో నీరు సన్నముగాప్రవహిస్తోంది.

శ్రీకృష్ణుడు ఆలోచనలో మునిగిపోయాడు.

ముహూర్త పర్యంతము అంతా నిశ్శబ్దము. ఎవ్వరూ మాట్లాడలేదు. యమున అవ్వలివొడ్డునుంచి మాత్రము వ్రజకులం సందడి వినిపిస్తోంది.

లేగదూడల అంబారవమూ, అలకాపరుల అదలకింపూ ఆలకిస్తూ పూర్తిగా పూర్వస్మృతులలో నిమగ్నుడైపోయాడు శ్రీకృష్ణుడు. అర్ధనిమీలితనేత్రుడైన అతని మనోభావాలను గుర్తిస్తూందిసత్య, పైకి కనుపించని మందహాసముతో.

దప్పితీరగా, సంతుష్టితో సకిలించాయి మళ్ళా, శ్వేతాశ్వములు జూలలనువిదురుతూ. నిద్రలోంచి మేల్కొన్నవానిలా శ్రీకృష్ణుడు అదరిపడిలేచి, రధమును పోనిమ్మని అల్లునికి సైగచేశాడు. నిశ్శబ్దంగానే వారు నదినిదాటాడు.

కొడుకునూ కోడలినీ చూచి నందుడు పరమానంద భరితుడయ్యాడు. యశోద ఆనందానికి అవధిలేదు. కాని, కొంతసేపయ్యాక సత్యాదేవిని నిదానించి చూస్తూ, తన మనస్సులోని బెంగను ప్రకటించింది యశోద, ఇలా: "అమ్మాయీ! నీవు పన్నీటనే కాని జలకమాడవట. నులివెచ్చని సంపెంగనూనెతోగాని తలంటుకోవట. అరుదైన అగరు సాంబ్రాణి ధూపాలతో గాని కురులార్చుకోవట. ఈ పల్లెలో ఏమి ఇబ్బంది పడతావో!" అని, వినయసంపద వెల్లువారగా సత్య అన్నది: "అదేమిటి,

అత్తయ్యా! మీతోపాటే నేనూ - నాకు ప్రత్యేకంగా ఏమీ అక్కరలేదు ...వల్లె అంటారేమి? మీ ఆప్యాయతో యెక్కడున్నా అదే ద్వారక నాకు!" అని. సత్యాదేవి సౌజన్యానికి చాలా హర్షించింది యశోద.

నందయశోదా సహితులై సుగుణపాలుని ఇంటికివెళ్ళారు వారు.

శ్రీకృష్ణుడు ద్వారబంధమును దాటాడో లేదో మెరుపుతీగలా మెరుస్తూ ఒక్కపరుగునవచ్చి అతని పాదాలపై వ్రాలింది ఇందుమతి. అతని కాళ్ళను పెనవేసుకుని, ముందుకు పోనిచ్చిందికాదు. నిరంతర బాష్పధారతో పరమాత్ముని పదపంకజములకు అభిషేకము చేసింది.

కౌలకుబలో నిండిన కన్నీటిని ఆత్తే అపుకొని, శ్రీకృష్ణుడు తన పజ్జనున్న సత్యవైపు చూచాడు. అతని మనోభావమును గ్రహించి, సత్య ముందుకువంగి ఇందుమతిని లేవనెత్తి తన కౌగిటిలో జేర్చి పదిలముగా యశోద ఉన్నచోటికి తీసుకువెళ్ళింది. వారు ముగ్గురూ స్త్రీజనమున్న లోపలి ఆంగణములోనికి వెళ్ళిపోయారు

శ్రీకృష్ణుడు మేనల్లునివైపు చూచాడు. కన్నులు మిరుమిట్లుగొలిపిన మెరపుతీగ ప్రభావమునుంచి అతనింకా తేరుకోలేదు. వారు వెళ్ళినవేపే చూస్తూ ఉండిపోయిన మోహనుడు శ్రీకృష్ణుడు తనదెస చూడడము గమనించి, సిగ్గుపడుతూ తలవంచుకున్నాడు. అతనికి వశపాటు శ్రీకృష్ణునికి ఆనందాన్నిచ్చింది.

శ్రీకృష్ణునికి స్వాగతమిస్తూ సుగుణపాలుడన్నాడు: "కృష్ణయ్యా! నీరాకవల్ల మా కుటీరము పవిత్రమైనది. ఎన్నాళ్ళకు మాద కలుగుతున్నాను. నిన్ను. ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు!" శ్రీకృష్ణుడు అతని వీపు నిమురుతూ సుహాసినుని గావించి, ఉత్సాహముతో అన్నాడు: "మామా! మన ఇందుమతికి పెండ్లి సంబంధము తీసుకు వచ్చాను." అని.

నందుడు మోహనకుమారుని భుజము పైన చేయివుంచి అతనినిదగ్గరకు తీసుకున్నాడు. మోహనుని రూపలావణ్యమును పరికిస్తూ సుగుణపాలుడన్నాడు "శుభము! నీకు మాయందు ఎంత అభిమానము! ఎటువంటి పెండ్లికొడుకును తీసుకువచ్చావు. కృష్ణయ్యా! మా ఇందుబాల నిజముగా అదృష్టవంతురాలు! కాని ...కాని"—అని ఏదో అనబోతున్నాడు.

శ్రీకృష్ణుడు అన్నాడు "నేనున్నాగా! నా మాటపాటిస్తుంది ఇందుబాల" అని.

అందరూ లోనికి వెళ్ళారు.

శ్రీకృష్ణుడు ఇటూ అటూ పరికించి చూస్తున్నాడు - ఇందుమతి ఎక్కడా కనిపించడములేదు. చివరకు తల్లిని ప్రశ్నించాడు "ఏదీ ఇందూ?" అని. చిరునవ్వు నవ్వుతూ యశోద అన్నది; "వెర్రిగోల! అదుగో! ఆ మాలతీ మంటపంలో దాక్కున్నది. ఇవతలకు రానంటోంది." అని.

"సత్యా! రా!!" అంటూ దేవీసహితుడై శ్రీకృష్ణుడు మాలతీ మంటపంలో ప్రవేశించాడు వారి అడుగుల సవ్వడి విని ఇందుబాల పారిపోవడానికి ప్రయత్నించింది బెదరిన లేడిచూపుతో ఇటూ అటూ చూస్తూ సత్య ఆమెను పోనియ్యలేదు

"ఇందూ! ఇటుచూడు! ఇటు చూడు!" అన్నాడు శ్రీకృష్ణుడు.

ఇందుమతి తలపైకెత్తలేదు

మళ్ళా అన్నాడు శ్రీకృష్ణుడు మరింత ఆప్యాయతతో "ఇందూ! ఇటు చూడు. నాతో మాట్లాడవా?....నామాట వినవా? అని



ఆమె అతనివైపు క్రీగంటజూచింది. కాని, ఆమె పెదవులు అదురుతున్నాయి. పలుకరిస్తే వెల వెల ఏడ్చివేస్తుందేమో అన్నట్టున్నది ఎఱ్ఱబారిన ఆమె ముఖము.

ఒక అడుగుముందుకు వచ్చి, ఆమె భుజాన చేయివుంచి, అతి సుకుమారంగా ఆమె చుబుకమును పైకెత్తుతూ సూటిగా ఆమె కన్నులలోకి చూస్తూ వేణుగోపాలు డన్నాడు ఒక్కమాటే: "నాకోసము!" అని.

ఆమాటకు అదిరి పడింది సత్యభామ.

కాని, ఆమాటవిని నిలువునా కంపించి పోయింది, ఇందుబాల.

ఏదో విద్యుచ్ఛక్తిప్రవాహము ఆమెలోని ప్రతి అణువునూ కదలించివేసి నట్లనిపించింది.

హఠాత్తుగా ముందుకు వంగి శ్రీకృష్ణుని పాదములను తాకింది తన రెండుచేతులా, ఆ ముద్దరాలు.

తన పవిత్రవేళ్ళనూ కన్నుల కద్దుకున్నది. ఆమె వెర్రిగా పదిసార్లు. ఇంతలో దుఃఖము ముంచుకొచ్చింది ఆమెకు. సత్య ఒడిలో తలదాచుకొని వెక్కివెక్కి ఏడువసాగింది. సప్త సముద్రాలూ కట్టతెంచుకున్నవేమో అనిపించింది ఆ నిమిషము.

లేని తీవ్రతను నటిస్తూ సత్య అన్నది శ్రీకృష్ణుని ఉద్దేశిస్తూ "మీరు వెళ్ళిపొండి ఇక్కడనుంచి!" అని.

ద్వారకలో, మళ్ళా.

ఆపిన హిందోళ గానమును పూర్తిచేసి, లీలగా రాగమును మాత్రము మరొక్కసారి వీణ తంత్రులపై పలికించి, వీణను అటుంచి శ్రీకృష్ణుని సమీపించి అంది సత్య, అతని ముఖంలోకి అదోవిధంగాచూస్తూ ప్రశ్నించింది ఆమె: "నిజంగా, నీ కోసమేనా?" అని. శ్రీకృష్ణునితో తన యిన్నేళ్ల సహవాసంలోనూ అతని పెదవులనుండి ఆమాట విని ఉండలేదు సత్య. శ్రీకృష్ణుడా ఒకరిని అర్థించడము!

శ్రీకృష్ణుడు జవాబుచెప్పలేదు.

కొన్ని క్షణాలు నిశ్శబ్దము.

ఉన్నట్టుండి, శ్రీకృష్ణుడు సత్యాదేవి మూర్ధమును ముద్దుపెట్టుకున్నాడు. అప్పుడే పదిసార్లు అనుభవించిఉన్నా, అస్పర్శ ఆమెను పరవశురాలిని చేసింది.

ఆమె అతనిని కౌగలించుకుంది, గట్టిగా, మరీగట్టిగా.

అప్పుడన్నాడు శ్రీకృష్ణుడు "నిజంగా మన మోహనుడు ఎంతో అదృష్టవంతుడు. ఎంత అదృష్టవంతుడో!" అని.

కౌగిలివదలి కాస్త రోషంతో అన్నది సత్య: "కాదు మీ ఇందుబాలే అదృష్టవంతురాలు!"

"అల్లాగా!" అని శ్రీకృష్ణుడు గట్టిగా నవ్వాడు.

ఆ నవ్వును ప్రపంచములోని పంచ వర్ణపు చిలుకలన్నీ ప్రతిధ్వనించాయి ఒక్క గొంతుకతో పదిసార్లు.

ఆ ఆనందానికి విశ్వమే ప్రతిస్పందిస్తూ లాడింది.

పదునాల్గు భువనాలలోని గుడిగంటలు గణగణ మ్రోగాయి. శ్రవణపేయంగా అన్నీ ఒక్కసారిగా గణగణమ్రోగాయి.

"పదండి! మీ పాదపూజకు వేళఐంది. పదండి!" అంటూ మణికింకిణీ మధుర స్వరముతో, తన కుడిచేతిని శ్రీకృష్ణుని నడుముచుట్టూపోనిచ్చి, అతనిని ముందుకు నడిపించుకు వెళ్ళింది సత్య.

వారిని తనవద్దకు ఆహ్వానిస్తూ పరిమళ భరితమైన పూలవాసనను కురిపించింది విరగ బూసిన పారిజాతము. □□□



దేవుడి లాంటి మనిషి

ఉదయం లేచే సరికి యీ వార్త చెవిని పడింది.

సత్యమూర్తి యిలాంటి పని చేశాడంటే నమ్మ శక్యం కాకుండా వుంది. ఎందుచేత నంటే సత్యమూర్తితో సరిపోల్చగల సన్మార్గుడూ, సద్గుణ సంపన్నుడూ, సాధువర్తనుడూ, సహనశీలి సాధారణంగా అరుదని నా అభిప్రాయం. అతను అందరకూ ఆదర్శప్రాయుడు.

పెద్దలలో పెద్దగా వ్యవహరించే సత్యమూర్తిని నే నెరుగుదును. పిన్నలలో పిన్నగా మెలగుతూ, వాళ్ళతో పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ పరుగులు తీసే పిల్లవాడ్ని కూడా సత్యమూర్తిలో నేను చూశాను. 'ఫెళ్ళు' మని ఒక చెంపమీద కొట్టినా, పెదవుల మీది చిరునవ్వును చెదిరి పోనీయకుండా, ఒక్క పరుష వాక్యం కూడా పలుక కుండా "ఈ రెండో చెంప మీద కూడా ఒక్కటి వెయ్యి" మన్నట్టు రెండో చెంప చూపేటంత సహనశీలినికూడా సత్యమూర్తిలో కన్నాను. దారంట పోతూంటే "ధర్మం బాబూ" అన్న ప్రతివాడికీ పాత్రాపాత్ర విచక్షణ చేయకుండా, యెంతో కొంత దానంచేసే సత్యమూర్తి ధర్మబుద్ధిని ఆతడ్ని యెరిగి వున్న వాళ్ళందరూ యెరుగుదురు. పరస్త్రీల వైపు కన్నెత్తైనా చూడని ప్రవర్తన్నికూడా సత్యమూర్తిలో ప్రతీవారూచూస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే సత్యమూర్తి దేవుడి లాంటి మనిషి!

ఇంతటి సుగుణరాశిగా పరిగణించబడు తున్న సత్యమూర్తి అటువంటి నీచకార్యం చేశాడంటే యెలా నమ్మడం?

ఒక మనిషిమీద యెంత సదభిప్రాయం వుండనివ్వండి. ఎంత ప్రేమాభిమానాలు వుండనివ్వండి. అతను అటువంటి పని చేయడానికి సాహసిస్తాడనైనా యెవరూ వూహించని పని చేశాడని తెలుస్తే.. అందు లోనూ సాంఘికనియమాలనూ సామాజికపు కట్టుబాట్లనూ నరకుచెయ్యకుండా మరీ చేశాడని తెలిస్తే,—అతడి మీదుండే సదభిప్రాయ మంతా వేడికి వెన్న కరిగినట్టుగా కరిగిపో తుంది. అభిమానం అంతా సూర్యరశ్మికి మంచు కరిగినట్టు కరిగిపోతుంది. హారతి కర్పూరంలా హరించి పోతుంది. సత్యమూర్తి విషయంలోనూ సరిగ్గా అంతే జరిగింది.

ఈ సంగతి వినగానే 'నిజమా కాదా?' అని సందేహించడం మాట అటుంచి, అత నంటే ఎవరో పగవాడిని గూర్చి మాట్లాడి నట్టు మాట్లాడడం మొదలు పెట్టారంతా.

"ఎవరికి ఏ బుద్ధి ఎప్పుడు పుడుతుందో ఎవరు చెప్పగలరు? ఏపుట్టలో ఏ పాముందో ఎవరికి తెల్సు?"

"అందుకనే కాబోలు ఆ రమణయ్యకు అంత సహాయం చేశాడు."

"ఎవరికి ఎవరూ కాని ఈరోజుల్లో ఏ ప్రతిఫలాపేక్ష లేకుండా పరోపకారం చెయ్యడానికి యిది పురాణకాలం కాదండీ. స్వార్థపరులతో నిండివున్న నేటిప్రపంచం పాప పంకిలం కదటండీ."

"అంతలా అంతులేకుండా అపేక్ష ఒలి కిస్తుంటే అప్పుడే అనుకున్నాను. ఎప్పుడో యిలాటిదేదో జరిగి తీరుతుందని."

"కలికాలం! అందుకే యిలా మండి పోతోంది ప్రపంచం."

"వినాశకాలే విపరీతబుద్ధిః అని. వాడికి వినాశకాలం వచ్చింది. ఇలాటి పనులు ప్రారంభించాడు."

అబ్బ! ఎంత సంకుచిత స్వభావాలు వీళ్ళవి? వీళ్ళంతా సంఘానికి సభ్యులు! సమాజానికి శాసకులు!! నీతి నియమాలకు రక్షకులు!!!

సత్యాసత్య విచారం లేకుండా, కనీసం అన్వేషణాభిలాషయినా లేకుండా, అపవాదులు అల్లడం, అభాండాలు వేయడం అలవాటు వీళ్ళకి!

అర క్షణంలో అభిప్రాయాలు మార్చు కునే ప్రపంచం రంగులు మార్చే ఊసర వెల్లిలా కనిపించింది!


• • •

రమణయ్యా, సత్యమూర్తి, నేనూ పని చేసేది ఒకే ఆఫీసులో. ఉండేది కూడా ఒకే వీధిలో. ఎర్రగా బక్కపలచగా వుండే రమణయ్య కోల మొహంలో అమాయ కత్వం కొట్టొచ్చినట్టు కనపడుతుంది.

అతనికి వచ్చే జీతం ఎంతో అందరికీ తెల్సిందే కాని ఆ అరవైరూపాయలతో, అతనూ, అతని భార్య కనకం, ముసలి తల్లి రోగిష్టితండ్రీ గల రమణయ్య సంసారం ఎలా గడుస్తూందో రమణయ్యకీ, అంగట్లో

రావి శ్రీకృష్ణమూర్తి

..దాంతో నాకు మా ఆవిడమీద మా చెడ్డ కోపం వచ్చేసింది.
.'ఏం మీదమీదకొస్తున్నావ్ కొడతావా' అన్నా....



అతని బాకీ ఎంతుందో కోమటి కోటయ్యకూ బట్టలకొట్లో అతని బాకీ బట్టలకొట్టు బ్రహ్మయ్యకూ తప్ప యీ విషయాలు తెలిసిన మనిషి యింకెవరయినా వుంటే అది సత్యమూర్తే.

"ఎన్నాళ్ళకయినా రమణయ్య తండ్రి జబ్బు నయం కాదే"మని డాక్టరు ధర్మా రావుని గాని, "మరీ రంగునీళ్ళే పోస్తున్నా వే"మని కంపౌండరు కరుణాకరాన్ని గాని అడగండి.

"జబ్బు నయం అవలేదని నామీద నింద మోపడమేగాని బకాయిపడ్డ పైకం పంపే ఏర్పాటు చెయ్యడంసంగతి ఆలోచించవేం?" అని యెదురుప్రశ్న డాక్టరు ధర్మారావు వేస్తాడు.

"ధర్మారావుగారి పేరుచూసి ధర్మాసుపత్రి అనుకొని మందు తీసుకెళ్ళడమేగాని, మరి తిరిగి చూడటం అలవాటులేని రోగుల రోగానికి ధర్మారావుగారు కనిపెట్టిన కొత్త మందిది. రంగునీళ్ళంటా రేమిటి? అయినా ధర్మంగా పోయడానికి రంగునీళ్ళయినా దండగే కదండీ?" అని కంపౌండరు కరు ణాకరం జవాబిస్తాడు!

ఏ పరిస్థితులలో రమణయ్య యింటి విష యాలు గ్రహించావో కాని, సత్యమూర్తితో స్నేహం కలసిన తర్వాతే కోటయ్య కొట్లో అప్పుతీరింది. బ్రహ్మయ్య బాకీతీరింది. డాక్టరు ధర్మారావు ఎకౌంట్సులో ఆరేడు నెలలుగా రమణయ్య పేరను బేలన్సున్న బాకీ కూడా "బేడ్‌డెట్సు" క్రింద పడబోయే సమయానికి తీరిపోయి వూరుకుంది.

అసలు జరిగినది ఏమిటో తెల్సుకుందా మని రమణయ్య యింటికి వెళ్ళాను. ఇంటికి వెళ్ళడమయితే వెళ్ళాను. గాని, వీధరుగు మీద దిగాలుపడిన తమ్ము డిలా, ఆషాఢభూతి చే దోచబడ్డ బ్రాహ్మడిలా కూర్చున్న రమణయ్యను ఏమని అడిగను?

సంకటావస్థలో పడి ఏమీ తోచక పడుతూండగా రమణయ్యే మాట్లాడి నేను అడగవలసిన అవసరం లేకుండా చేశాడు.

"ఆ ఛండాలపు వెధవ ఇంతపని చెయ్యడానికి సాహసిస్తాడనుకోలేదండీ! అటువంటి తుచ్ఛుడిని బొమికలు విరిగేలా తన్నినా పాపం వుండదండీ! సహాయం చేసినట్టే చేసి ఎంత నాటకం ఆడాడు నాదగ్గర? "స్నేహితుడొకాయన భార్యాసమేతంగా అనుకోకుండా వచ్చాడు. నాగదిలో ఖాళీ లేదు. నన్ని రాత్రికి మీ సావిట్లో సాగోరనిస్తారా?" అనడిగాడు వంగనాచిలా. సహాయం చేస్తున్నాడంటే సద్బుద్ధితో చేస్తున్నాడనుకుంటున్నానుగాని యింతటి నీచమైన వూహలతో వుయ్యాలలూగుతున్నాడనిగాని. అవుకాలేని మోహంతో, మదోన్మాదంతో తూగుతున్నాడని గాని ఎవరూహించగలరు చెప్పండి? ఎప్పుడూ నవ్వుతూనే వుంటాడు మళ్ళీ? పయోముఖ విషకుంభం! ఛీఛీ!!" కసిగా కాండ్రించి ఉమ్మాడు.

"అసలేం జరిగింది?" అనడిగాను.

"ఛీ! ఛీ! ఏం చెప్పమంటారు వాడు చేసిన వెధవ పని....ఒక రాత్రికి సావిట్లో పడుకోడమే కదానని సరేనన్నాను........ తెల్లవారు ఝామున మా కనకం పెరట్లోకి వెడుతోంటే చేయి పట్టుకొని లాగేడట.... పిచ్చిది హడలిపోయి పరిగెట్టుకు వచ్చినన్ను లేపింది. నే వచ్చేసరికి కాళ్ళకు బుద్ధి చెప్పాడు. లేకుంటే పులుసులోకి ఎముక మిగలకుండా చితక్కొట్టేవాడిని! ఎక్కడికి పోతాడులేండి! వాడి అంతు చూడక పోతానా!"

పళ్ళు పటపట కొరికాడు రమణయ్య!

"అయినింటి ఆడబడుచు వంటిమీద చెయ్యి వేసిన నాడు అగ్గిలో మాడిమసయి పోతాడు నాయనా! అంతటి దుర్మార్గుడని కానుకోలేక పోయినాడు మా రమణ."

"ఏ పుణ్యాత్మురాలు కన్నదో యీతడిని. ఆవిడ నిజంగా ధన్యురాలు. దేముడి నే కన్నది" అని లెక్కలేనన్నిసార్లు నాముందు సత్యమూర్తిని పొగిడిన రమణయ్య తల్లి నోటివెంట వచ్చిన మాటలే యివి!

ఇటువంటి పని సత్యమూర్తివల్లకాదు. అతడి ప్రతి అణువులోనూ మూర్తీభవించిన మంచితనమేకాని, మాటల గోడలవెనుక దాగే దురూహాలు వుండడానికి అవకాశం లేదు. ఉన్నాయన్నా నేను నమ్మలేను. ఎందుచేతనంటే సత్యమూర్తిని నేను ఒక పది సంవత్సరాలుగా ఎరుగుదును. అతడి ప్రవర్తన అందరికి అనుసరణీయం. పూజనీయం.

నేనేం మాట్లాడాలో తెలియలేదు. ఇందులో నిజ ఎంతో అబద్ధంఎంతో! అయినా అబద్ధమాడవలసిన అవసరం ఏమిటి రమణయ్యకు? అందులోనూ తనను అన్నివిధాలా ఆదుకున్న సత్యమూర్తిపైనా? ఊరికే నరదాకు అపవాదు వేస్తాడా? మరి? సత్యమూర్తే....ముందు యిక ఆలోచించ లేకపోయాను.

ఉన్నట్టుండి రమణయ్య ఒక్కసారి అరుగు మీద నుండి దూకి రోడ్డుమీదకు వెళ్ళాడు. ఏమిటాని అటు తిరిగి చూశాను. రోడ్డుమీద సత్యమూర్తి పడివున్నాడు. మీద కూర్చొని గుభీ గుభీ మని చేతి కొచ్చినట్టు కొడుతున్నాడు రమణయ్య. తిరగబడడానికిగాని. అతడు కొట్టిన దెబ్బలు తప్పుకోడానికి గాని సత్యమూర్తి ప్రయత్నించడం లేదు. రమణయ్య పౌరుషం పేట్రేగి పోయింది. అందులోనూ ప్రత్యర్థి తిరగబడకుండా వూరుకున్నాడు.

ఇంక మరీ విజృంభించాడు. పెద్దగా అరుస్తూ, నోటికొచ్చిన తిట్టుతిడుతూ చేతి కొచ్చిన దెబ్బకొట్టసాగాడు.

రెండు నిముషాలు చేష్టలుడిగి అచేతనంగా నిల్చున్నాను అప్పటికే నలుగురైదుగురు చేరారు. కాని యిటువంటి మనిషికి తగిన శిక్ష యిదేనని, తమచేతనయిన సాయంగా, తలోచెయ్యి సత్యమూర్తిపైన వెయ్యడం మొదలుపెట్టారు.

నేను ఇంక ఊరుకోలేకపోయాను. మానవత్వంలేని మానవులు మానవులుకారు. దానవులకైనా దాక్షిణ్యం దయా వుంటాయేమో! నాలోని నిద్రపోతున్న మానవత్వం మేలుకొంది. గబగబ అక్కడికి వెళ్ళాను. అతి కష్టంమీద వాళ్ళనుండి విడిపించాను అతడిని అతని మొహం రక్కుకుపోయింది. ముక్కునుండీ పెదాల నుండి రక్తం కారుతోంది. కాళ్ళూ చేతులూ రక్కుకుపోయాయి. చూడడానికి భయంకరంగా అగుపిస్తున్నాడు.

మెల్లగా నడిపించి అతని గదికి తీసుకు వెళ్లాను. అతడి గదిముందు ఒక రిక్షా ఆగివుంది. లోపలకు అడుగు పెడుతూండగా, ఒకతను బయటకు వస్తున్నాడు. వెనకాలే అతడి భార్య కాబోలు. వుంది. రిక్షా వాడు పెట్టె బెడ్డింగూ తీసుకొస్తున్నాడు.

"అదేమిట్రా? ఎక్కడికీ ప్రయాణం? ఇంకా రెండు రోజులుండి వెళ్తానన్నావ్- అప్పుడే బయలు దేరుతున్నావు ఎక్కడికి?"

అప్పుడే జరిగినదంతా మరచిపోయినట్టు అసలు ఏమీ జరగలేదన్నట్టూ, ధూళి ధూసరితమైన శరీరాన్ని, రక్త సిక్తమైన మొహాన్ని మరచిపోయి, మాయమైన చిరునవ్వును మళ్ళీ పెదవుల మీదకు మళ్ళించి అడుగుతున్నాడు అతడిని సత్యమూర్తి.

"చాలురా చాలు! ఈమాత్రం సేపు వుంటేనే నీగురించి యింతోటి విన్నాం. ఇంకా వుంటే ఇంకా ఏమి వినవలసి వుంటుందో. ఇంతవరకూ చిన్ననాటి సత్యానివే అనుకుంటున్నా నీవింత ప్రతిభావంతుడవని తెలుస్తే అసలు నీ పేరే ఎత్తక పోదును."

"మా చిన్నప్పటి స్నేహితుడు సత్యమూర్తి దేముడిలాంటి మనిషి అంటూ పరిగెట్టుకువచ్చారు. చూశారుగా ఎంత దేముడిలాంటివాడో? ఇంక నడవండి!" అంటూ పక్కనుండి దూసుకొని పోయిందతని భార్య-పేరేమిటో తెలియదుగాని 'సూర్యకాంతం' అని పిలవాలనిపించింది!

రిక్షా ఎక్కుతూ "తగిన శాస్తి జరిగిందిలెండి వెధవకి. వళ్ళు హూనంచేసినట్టుంది" అంది అతని భార్య.

● ఒకానొక రోమియో ఒక కాలేజ్జూలియట్‌ని గాఢంగా ప్రేమించాడు. "నువ్వు నన్ను పెళ్ళి చేసుకోకపోతే నేను చచ్చిపోతానంతే" అని బెదిరించాడు.

"మంచిదంగా" అని జూలియట్ అతన్ని తిరస్కరించింది. అతరువాత యాభైఏళ్ళకి అతను నిజంగానే చచ్చిపోయాడు.

పెద్ద విట్టు వేసినప్పుడు పగలబడి నవ్వే నవ్వులా గాలిలో కలిసిపోతూ వినిపించింది సత్యమూర్తి "చిన్ననాటి స్నేహితు"డి నవ్వు!

బంధుత్వాలనే బంధాలను సహితం తెంచుకొని ఎవరికివారే యమురగా తీరేగా నివసించే హైదరాబాద్ వంటి మహానగరంలో వరులపంచను పడుకొని, తన గదిని రెండు రోజులు వీళ్ళకి యిచ్చినందుకూ, ఆతిధ్యం అందించినందుకూ, ఇంకా వుడమని బలవంతంచేస్తున్నందుకూ సత్యమూర్తి కిది ప్రతిఫలమా? దెబ్బలుతిని వున్నాడన్న కరుణకూడా కనిపించదే. సత్యమూర్తి వీళ్ళందరకూ సహాయం ఎందుకు చేస్తున్నట్టు? వీళ్ళనుంచి ఏం ప్రతిఫలం ఆశిస్తున్నట్టు?"

"ఇలాంటి వాళ్ళనందర్నీ చేరదీసి అంత ఆప్యాయంగా ఆదరిస్తా వెందుకు?" అనడిగాను.

"అది వాళ్ళ తప్పు కాదు కదా! నిజమేమిటో తెలిస్తే వాళ్ళు అలా వెళ్ళిపోతా రంటావా?" అన్నాడు సత్యమూర్తి.


అతడి పెదిమల మీద చిరునవ్వు అలాగే వుంది.

"నిజం ఏమిటో చెప్పి వాళ్ళ మనస్సులోని దురభిప్రాయాన్ని ఎందుకు తొలగించవు?"

"నిజం చేదుగావుంటుంది. చేదుగావుండే నిజాన్ని నిజంగా గ్రహించ గలగడానికీ మానడానికీ, ప్రజల మీద పరిస్థితుల ప్రభావం ఎక్కువగా పనిచేస్తుంది"

"అలాగని నిజాన్ని తొక్కి వుంచడం మంచిదా?" దీనికి సత్యమూర్తి మాట్లాడ లేదు.

"మానవుడిలో స్వార్థం ఎక్కువ అంటారు. మరి నీ స్వార్థ కోసమయినా, సంఘంలో ఈ సంఘటనవలన నీకు కలిగిన చెడ్డపేరును చెరుపుకోవేం, నిజంచెప్పు?"



"చెప్పానుగా చేదుగావుండే నిజాన్ని నిజంగా నిరూపించడం కష్టమని."

"అలాగని నువ్వు నలుగురిలో చెడ్డవు తావా? కష్టమయినా, నష్టమయినా నిజాన్ని ప్రజలముందుంచి, నీ పేరు నిలుపుకోవడం మంచిదికాదా? ధనం లేకపోయినా బతకవచ్చుగాని, పేరులేకుంటే పదిమందిలో తిరగగలవా నువ్వు?"

"పదిమందినీ బాధపెట్టే నిజాన్ని బయట పెట్టి దాన్ని నిరూపించడానికి నిష్ప్రయోజనంగా బాధపడేవానికంటే ఒక్కడు లోకం దృష్టిలో దోషిగా వుండడ నయం కాదూ?"

"నీ మాటలు నాకేం అర్థమవటంలేదు. అసలేంజరిగిందో చెప్పు."

"జరగడానికి, చెప్పుకోడానికీ ఏముందియిందులో. మానవ జీవితం అన్నాక కోరికలూరడం సహజం. కోరుకున్నవన్నీ చేరువైతే యింక మరి జీవితం ఏముంది? కెరటాలు కడలిలోనే కదలాడాలిగాని చెలియలి కట్టనాటితే ప్రమాదమేగా, మనసులో మెదిలే కోర్కెలు కెరటాల వంటివి. ఆ కోర్కెలు, ముఖ్యంగా అవి తీరేవి కానప్పుడు, అవినీతికరమైనవప్పుడూ మనసులోనే మరుగుపడాలి. కాని, సమాజపు కట్టుబాట్ల చెలియలి కట్ట దాటి, వెల్లువికి పైకి ప్రవహిస్తే ప్రతిఫలం ఎవరికో వకరికి ప్రమాదమే కదా!"

సంగతేమిటో అర్థమవడానికి అట్టేసేపు పట్టలేదు నాకు.

మాట్లాడకుండా చిరునవ్వుచిందే సత్యమూర్తి మొహాన్ని చూస్తూ అతడి మనో వైశాల్యాన్ని అంచనా కట్టడానికి ప్రయత్నిస్తున్నాను.

సంఘం దృష్టిలో సత్యమూర్తి చీడపురుగు లాంటివాడిప్పుడు "పయోముఖ విషకుంభం" అన్నాడు రమణయ్య. "ప్రతిభావంతుడ"ని వెక్కిరించాడు సత్యమూర్తి "చిన్ననాటి స్నేహితుడు". మదాంధుడు. మిత్రద్రోహి యింకా యింకా ఎన్నో అంటారు సమాజానికి సభ్యులూ, సమాజానికి నీతి నియమాలకూ రక్షకులు అయినా సత్యమూర్తిలో దైవాంశ నాకు కనిపిస్తూంది. అతడు దేముడిలాంటి మనిషి!

లోకం గుర్తించలేని అసంఖ్యాకమైన సత్యాలలో యిదీ ఒకటి! □□□

● భార్య: "చూడండి. పక్కింటి మొగుడూ పెళ్ళాలు ఎంత ముచ్చటగా వుంటారో. ఆ అబ్బాయి రోజూ ఆఫీసుకెడుతూ పెళ్ళానికి టాటా చెప్పిమరీ వెడతాడు. మీ కల్లాంటి సరదాలే లేవాయె."

భర్త: "నేనూ టాటా చెబుదునుగాని, ఆ అమ్మాయి వూరుకుంటుందా అని."

సెక్రటరీ



యద్దనపూడి సులోచనారాణి

(గతసంచిక తరువాయి)

ఆ రాత్రి పడుకున్నదన్నమాటేగాని జయంతి కంటిమీద కునుకేలేదు. ఏమిటిది? జీవితం తన్ను యెటువైపు లాగుతోంది! ఏం చెయ్యబోతోంది తను! సుమిత్రాదేవికి రాజీనామా యిచ్చిన వెంటనే మనసు భయంతో బిగుసుకుపోయినమాట నిజం. కాని, కాని - ఇదేమిటి? ముక్కుమొహం తెలియని తను రాజశేఖరానికి సెక్రెటరీగా వుండటమా! ఇది కలా నిజమా! ఒంటిమీద స్పృహ అనేది వుండే తను ఈపని చేయబోతోందా? తనసలు యేవిషయంలోనూ వేలుపెట్టి చూపించటానికి వీల్లేకుండా అంత జాగ్రత్తగా ప్రవర్తించినప్పుడే వాళ్ళు అన్నివిధాల అన్నారే! ఇప్పుడు? ఇప్పుడు రాజశేఖరానికి సెక్రెటరీగా వెడితే యింకేమయినా వుందా! వేటకుక్కల్లా వెంటబడి తరమరూ! జయంతికి భయంకంటె వాళ్ళేం చేస్తారో చూడాలనే ఆసక్తి యెక్కువైంది.

అయినా ఈ ఆలోచనలన్నీ తనకెందుకూ? ఇలాటి విమర్శలన్నీ వస్తాయని రాజశేఖరానికి తెలియదూ! తెలియకుండానే తన సెక్రటరీగా వుండమంటాడా! కారణం యేమిటో తెలియదుగాని వసంతవిహార్‌లో మసిలే ప్రతి వ్యక్తికి రాజశేఖరం అంటే ప్రత్యేకమైన అసక్తివుంది. అతని మాట అంటే విలువుంది. గౌరవాభిమానాలున్నాయి. వాళ్ళంతగా అభిమానించే వ్యక్తిదగ్గర తను ఒక్క నెలకాదు-ఒక్కరోజు-ఒక్కగంట కూడా అతని సెక్రటరీగా నిలబడటం వాళ్ళు సహించలేరన్న సంగతి జయంతికి స్పష్టంగా తెలుసు. తెలిసే కావాలనే తను రాజశేఖరానికి సెక్రటరీగా వెడుతోంది. వాళ్ళు ఒకవేపునుంచి అణచాలని ప్రయత్నంచేస్తే భగవంతుడు తనకి మరోవైపునుంచి మరింత బలంగా యెదురుతిరిగే అవకాశం కల్పిస్తున్నాడు వాళ్ళు కాదన్నా. వాళ్ళు ఉద్యోగంనుంచి తీసేసినాసరే. తను మర్యాదగా మరింత విలువగా బ్రతగ్గలనని వాళ్ళకి నిరూపించాలి.

ఒక్కనెల యెలాగో రాజశేఖరం దగ్గర అతని సెక్రెటరీగా గడిపేస్తే యీలోపల అతనిద్వారానే యింకో ఉద్యోగం చూసుకోవచ్చు. బామ్మకి తన ఉద్యోగం పోయినట్లుగాని రాజశేఖరందగ్గర జాయినయినట్లుగాని తెలిసే అవసరం గూడా వుండదు. చీకట్లో పడుకుని మెళ్ళోవున్న ఒంటిపొర గోవర్ధనపు గొలుసుని సరిదీసుకుంటూ పైకప్పుకేసి చూస్తూ ఆలోచిస్తున్న జయంతి తల ప్రక్కకు తిప్పి ప్రక్కగా పడుకున్న బామ్మగారివైపు చూసింది. ఆవిడ నిశ్చింతగా మంచి నిద్రలో వున్నట్టు స్థిరంగా వస్తున్న వుచ్ఛ్వాస నిశ్వాసాలే తెలుపుతున్నాయి.

జయంతి గుండెలోనుంచి నిట్టూర్పు వచ్చింది. తనీ ఉద్యోగంలో జేరినప్పటినుంచి ఒకవిధంగా ఆవిడకు నిశ్చింతగా వుంది. ఛీ! మనిషి మరీ భోగభాగ్యాలు పొందకపోతే మానె. కానీకనీసం వేళకి తింటానికి తిండిగూడా లేకపోతే? దానికోసం బాధపడటం యెంత భయంకరం? బైట తనెంతయినా కష్టపడుతుంది. ఎలాటి సమస్యలయినా ధైర్యంతో యెదుర్కుంటుంది. కాని యింట్లో బామ్మకి లభించిన ఈ కొద్ది మనశ్శాంతినిమటుకు తనతంతంలో వూపిరివుండగా చెదరనివ్వదు. జీవితంలో అడుగడుగునా. భర్తపోయి, కోడలుపోయి, కొడుకుపోయి ఆర్థికంగా సంసారం చితికిపోయి యెన్నివిధాలో బాధ అనుభవించిన బామ్మ కనీసం ఈ వార్ధక్యంలోనైనా కాస్త నిశ్చింతగా గడపాలి. గడిపితీరాలి. రాజశేఖరం వ్యక్తిగతంగా యెలాటివాడయినా

అవుగాక. అది తనకనవసరం. మనిషిని చూస్తే సభ్యత, సంస్కారం మూర్తీభవించినట్టున్నాడు. అదిచాలు తనకి. ఆలోచన్లతో పడి కొట్టుకుపోతున్న జయంతి పక్కింటి వాళ్ళ గడియారం మూడుకొట్టటంతో వులిక్కిపడి మంట పెడుతున్న కళ్ళని మూసుకుని నిద్రపోవటానికి ప్రయత్నం చేయసాగింది.

మర్నాడు లేచిందన్న మాటేగాని మనసు మనసులోలేదు. రాత్రి వచ్చిన దృఢనిశ్చయం, ఆలోచనలు చీకటితోపాటే వెళ్ళిపోయినట్టు అనిపించసాగింది. ఈ రోజు లేవటమే ఆలస్యం అయింది. లేచి ఆపని ఈపని చూస్తుండగానే నిన్న జరిగింది కలగాదు నిజం అన్నట్టు నిరూపిస్తూ కారు వచ్చి యింటిముందు ఆగింది.

ముందుగదిలో పడుకునివున్న బామ్మగారు మంచంమీదనుంచి తొంగిచూసి "అమ్మాయీ! కారువచ్చిందేమ్మా" అంది. ఫంక్షన్స్ జరిగినప్పుడు - పార్టీలు యిచ్చినప్పుడు చీటికి మాటికి వనితావిహార్ రాజశేఖరం కారు వాడుకోవటం అలవాటే. ఏదయినా దూరం వెళ్ళాల్సి వచ్చినప్పుడు తొందరపని వున్నప్పుడు జయంతికోసం యింటికి కారు వచ్చేది. రెండుమూడుసార్లు అలాటి సమయాల్లోనే జయంతి ఈకారులో యింటినుంచి వెళ్ళట, యింటికొచ్చి దిగటం చేసింది.

"ఇంటికి తిరిగి వచ్చేసరికి చాలా పొద్దు పోతుందా?"

కారు వచ్చినప్పుడు జయంతికి పనెక్కువుంటుందని యింటికి రావటం ఆలస్యం అవుతుందని బామ్మగారికి తెలుసు ఈరోజు గూడా అలాగే అనుకుంటూ అడిగింది. "లేదు త్వరగానే వచ్చేస్తాను" కారుచూసి బట్టలు వేసుకోటానికి సిద్ధం అవుతూ అంది జయంతి

"శ్యామలమ్మగారికి వెళ్ళి చెప్పి వచ్చాను బామ్మా. ఆవిడ వనైపోగానే వచ్చి నీదగ్గర కూర్చుంటానన్నారు మాటల్లోపడి మర్చిపోయేవ్. మందు వేసుకో." బట్టలువేసుకుని బైటకొచ్చేముందు బామ్మగారిదగ్గరగా వచ్చి చెప్పింది. ఆవిడ సరేనన్నట్టు తలూపింది.

కారు పదిహేనునిమిషాల్లో రాజశేఖరం యిల్లు చేరుకుంది. జయంతి వనితా విహార్ సెక్రేటరీగా జేరిన వెంటనే రాజశేఖరం బెంగుళూరు వెళ్ళిపోయాడు. ఒకవేళ ఒకసారి, రెండుసార్లు వూళ్ళోవున్నా అతనికివ్వాల్సిన కాగితాలు సుమిత్రాదేవిగాని, రేఖారాణిగాని తీసుకునేవాళ్ళు.

అందువల్ల జయంతికి రాజశేఖరాన్ని చూడటంగాని, యింటికి వెళ్ళే అవసరంగాని కలగలేదు.

కారు సూర్యకిరణాలున్న గేటులోంచి విశాలంగావున్న ఆవరణనిదాటి యెదురుగుండా కన్పిస్తున్న వరండాముందుకువచ్చి ఆగింది. ఇంటిముందున్న ఆవరణలో వరండా కిరుప్రక్కలనుంచి గేటువరకూ అన్నీ గులాబీచెట్లే, రకరకాలు. రంగు రంగులు. పొదలుగావున్న గులాబీచెట్లు. పొడుగ్గా చెట్లకి విరగబూసిన గులాబీలు. సన్నగావీస్తున్న గాలికి అందంగా తలలూపుతూ వయ్యారంగా వూగుతున్నాయి. ఇంటి ఆవరణలో అడుగుపెడుతూనే కంటికి ఆహ్లాదంగా కన్పించిన ఈ వాతావరణం జయంతి మనసులో వుక్కిరిబిక్కిరిగావున్న ఆలోచన్లని కొద్దిగా సడలించేలాచేసింది.

జయంతి వరండాదాటి లోపల అడుగు పెట్టింది. హాల్లో మధ్యగా ఖరీదైన సోఫా సెట్లు, వాటిమధ్య టీపాయివుంది. మూలలికి నాలుగుప్రక్కల నిలువెత్తు స్టాండ్‌లు వాటిమీద పెద్దపెద్ద పూలకుండీలున్నాయి. వాటివైపు చూడగానే వాటిలోవున్నవి కాగితపు పూలు కాదని, తాజాపూలని స్పష్టంగా తెలుస్తోంది. నేలమీద సహజంగా ఖరీదయిన కార్పెట్ వుండటానికి బదులు ఏంలేకుండా ఖాళీగావుంది. తెలుపు నలుపు కలసిన పాలరాళ్ళ డైమండ్ ఆకారంలో పేర్చబడి నీడలు తేలుతూ నిగనిగలాడుతున్నాయి.

రాజశేఖరం చాలా డబ్బుగలవాడని విన్న జయంతి యింటిని దేవలోకంలా వూహించుకుంది. అక్షరాలా అలా లేకపోయినా నిరాడంబరమైన అలంకరణతో యిల్లు మంచి హుందాగా, కంటికి ఆహ్లాదంగా వుంది.

హాలంతా పరిశీలిస్తూ క్షణంసేపు అలాగే నిలబడిపోయిన జయంతికి దారిచూపిస్తూ "యిలారండి" అన్నాడు డ్రైవర్ ఆగి. జయంతి ముందుకువచ్చింది. హాలుదాటి లోపలికివెడితే కారిడార్‌లావుంది. దానికి యెడంవైపు వరసగా గదులున్నాయి. వాటిలో సెక్రటరీ అన్న బోర్డున్న రెండో గదిని వేలుపెట్టి చూపిస్తూ "అటువెళ్ళండి. వారున్నారు" అనిచెప్పి మరోమాటకి అవకాశం యివ్వకుండా గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు. ఇంట్లో యెక్కడా యే శబ్దం విన్పించటంలేదు. ఆ నిశ్శబ్దం, ఒంటరితనం చూడగానే వెనక మిసెస్ వర్మ యింట్లో అనుభవం గుర్తొచ్చిన జయంతికి క్షణంసేపు భయంతో ఒళ్ళుఝల్లుమని "పొరపాటుచేశానా! ఇలారావటం తొందరపాటుకాదుగదా" అనిపించింది.

అడుపడ్డగళ్ళున్న కర్టెన్ తొలగించుకుని లోపలికి అడుగుపెట్టింది. విశాలమైన గది. గదిలో ఓ ప్రక్కగా టేబిల్, దాని కెదురుగుండా కుర్చీలువున్నాయి. టేబిల్ నిండా గుట్టగా పడివున్న కాగితాలు. టేబిల్ ప్రక్కగా చిన్న రాక్. దాన్నిండా యేవో కాగితాలు కట్టలుకట్టి వరసగా నీట్‌గా అమర్చబడివున్నాయి. టేబిల్ యెదురుగుండా కిటికీప్రక్కగా వాలుకుర్చీలో కుర్చీ చేతుల కడ్డంగా పాడ్ పెట్టుకుని రాజశేఖరం యేదో సీరియస్‌గా రాసుకుంటున్నాడు. కిటికీలోంచి వస్తున్నగాలికి పొడిపొడిగావున్న అతని జుట్టుతోపాటు మెళ్ళోవున్న వూదా రంగుపైగూడా సన్నగా కదులుతుంది. ఈ లోకమే మర్చిపోయి రాసుకుంటున్న రాజశేఖరం జయంతిని గమనించలేదు. బరబరా యెక్కడా ఆగకుండా రాసుకుపోతున్న అతన్ని ఆపి తను వచ్చినట్టు యెలా తెలియజెయ్యాలో జయంతికి తెలియలేదు. అలాగే నిలబడిపోయింది.

రాస్తూ రాస్తూ యెందుకో అరసెకను ఆగిన శేఖరం ఉలిక్కిపడ్డట్టు తలెత్తిచూసి కొంచెంగా కనుబొమలెత్తి "అరె మీరు వచ్చారా! రండి లోపలికి" అన్నాడు. జయంతి లోపలికి వచ్చింది. శేఖరం చేతిలో పెన్ను అలా పట్టుకునే టేబిల్ వైపుచూపిస్తూ "అవిగో చూడండి అగుట్టంతా ఉత్తరాలు

● *"మీ ఆవిడకీ నీకూ ఎప్పుడూ అభిప్రాయభేదం రాదా?"*

"ఎందుకురాదూ, వస్తుంది. కాని ఆ సంగతి మా ఆవిడకి తెలియనివ్వను."

రసీదులు. వాటిని విడదీయండి" అంటూ మళ్ళీ రాసుకోవటంలో మునిగిపోయాడు.

జయంతివచ్చి టేబిల్‌ముందు కూర్చుంది. దాదాపు అరగంట గడిచినతర్వాత రాయటం పూర్తిచేసేసిన శేఖరం పెన్, కాగితాలు తీసేసి ప్రక్కనున్న స్టూలుమీదపెట్టి లేచి గోడకున్న బటన్ ఒకసారి నొక్కి జయంతి టేబిల్ దగ్గరగావచ్చి "చూశారా! యెన్ని వుత్తరాలో. వాటిలో చాలాభాగం మీరు జవాబులు రాసెయ్యొచ్చు. రాసేస్తే నేను సంతకాలు పెట్టేస్తాను. కొద్దిమటుకు చాలా కొద్దిలెండి-టైప్ చెయ్యాల్సివస్తుంది. మీకు టైప్ చెయ్యటం వచ్చుననుకుంటాను."

జయంతి బుగ్గలోకి వెచ్చటి ఆవిరి వచ్చింది. మొదట సుమిత్రాదేవిగూడా యిలాగే అడిగింది. ఆరోజు తనకి, ఈరోజు తనకి యెంత భేదం! శేఖరం జయంతి మొహంవేపు పరిశీలనగా చూడకుండానే పాంట్ జేబులో చేతులు పెట్టుకుంటూ "అదుగో-అదంతా నా కొచ్చే పత్రికల లిస్టు వాటిల్లో యేయే పత్రికలకి నేను చందాలుకట్టాలో మీరు లిస్ట్ తయారుచేస్తే నేను డబ్బిస్తాను. మనియార్డరు చేసెయ్యొచ్చు." ఇంతలో యెవరో గదిలోకి రావటంతో జయంతి అటువైపుచూసింది.

శేఖరం వెనక్కి తిరిగి చూడకుండానే "నాయర్! కాఫీ, టిఫిన్‌పంపు యిద్దరికి" అన్నాడు. నాయర్ వెళ్ళిపోయాడు. శేఖరం వాచీ చూసుకుంటూ వెనక్కి తిరిగి తన చోటులోకి వచ్చేస్తూ "పదిన్నర అయింది. పదకొండు గంటలకి కంపెనీ మీటింగ్ వుంది. నేనువెళ్ళి మళ్ళీ ఒంటిగంటకి వచ్చేస్తాను." అన్నాడు తను రాసి ప్రక్కన పెట్టిన కాగితాలు మరోసారి పరీక్షచేస్తూ.

నాయర్ కాఫీ టిఫిన్ తీసుకొచ్చి స్టూలు మీద పెట్టి దానిదగ్గరగా రెండుకుర్చీలు లాగి వెళ్ళిపోయాడు.

"రండి. టిఫిన్ తీసుకుందురుగాని" శేఖరం పిలిచాడు. జయంతి క్షణంసేపు తటపటాయించింది. టిఫిన్‌ప్లేట్ తీసుకున్న అతను యేదో ఆలోచిస్తూనే తనకోసం ఆగడంచూసి వెంటనే లేచివచ్చింది. అతను చేసే ప్రతి పనిలోనూ ఓవిధమైన చురుకుదనం. ఒక్క నిమిషంగూడా వృధాచెయ్యని తొందర కన్పిస్తున్నాయి.


త్వరత్వరగా తినటం పూర్తిచేసిన రాజశేఖరం కాఫీ తను పోసుకుని మరో కప్పులోపోసి జయంతివైపు పెడుతూ "మీరు తొందరపడకండి. నాకింకా అవతల పనుంది" అన్నాడు నవ్వుతూ.

"థ్యాంక్స్" అంది జయంతి కప్పు తీసుకుంటూ. అతనితో వున్నప్పుడు తను తరుచు ఈమాట తప్పనిసరిగా వుపయోగించాల్సివస్తోంది తనా మాటచెప్పినప్పుడల్లా అతని పెదవులమీద చిత్రంగావున్న చిరునవ్వొకటి చిన్నగా కదులుతుంది. ఆ నవ్వుచూస్తుంటే జయంతికి అదోలా అన్పిస్తోంది.

జయంతి చేయవలసిన పనులుచెబుతూనే అతను వెళ్ళిపోయాడు. వెళ్ళబోయేముందు ఆగి "మీ కేదయినా కావాలంటే ఆ బెల్ నొక్కండి నాయర్‌గాని. వాసుగాని వస్తారు" అని చెప్పి వెళ్ళిపోయాడు.

గుమ్మంలో తను వచ్చి నిలబడ్డప్పుడు అతను చూడటంతో మొదలైనకాలం అతను వెళ్ళిపోవటంతో మళ్ళీ ఆగిపోయింది. ఆగిపోయినకాలంతో ఆలోచన్లు మళ్ళీ మొదలైనాయి.

జయంతికెందుకో తనీరోజు చూస్తున్న ఈ రాజశేఖరం పూర్తిగా వేరనిపించింది. బైటకన్పించే అతనికి యింట్లో యీ కన్పిస్తున్న యితనికి యింత తేడా యెందుకుంది! బయట రాజశేఖరాన్ని చూస్తే విలాసంగా,



కులాసాగా కాలం గడుపుతూ హాయిగా తిరిగే మనిషిలావుంటాడు. ఇప్పుడింట్లో కన్పిస్తున్న యితను గంభీరంగా, కొద్దిగా వయసుపెరిగినవాడిలా వున్నాడు.

ఏదయినా యిలాటి ఆలోచనలన్నీ తనకనవసరం. ఆరోజు వనితావిహార్‌కి సెక్రటరీగా వెళ్ళినప్పుడు వురకలు వేసినట్టు వణుకులు తీసినట్టుగా ఈరోజు అనిపించటం లేదు. తను ఉద్యోగంకోసం వచ్చింది. అంతే రాజశేఖరం యెలావుంటే తనకెందుకు! బైట ఒకమాదిరి. యింట్లో ఒక మాదిరికాదు — గంటకోమాదిరిగా వున్నా తనకు సంబంధంలేదు. ఈ ఉద్యోగం చాలా తాత్కాలికం. ఇంకోటి చూసుకునేవరకే. అంతే. అని గుర్తొచ్చిన జయంతికి ఆపైన ఆలోచించ బుద్ధికాలేదు.

ఉత్తరాలు చూస్తుండగానే, ప్రక్కనున్న పత్రికలు తిరగేస్తుండగానే టైమ్ యిట్టే గడిచిపోయింది. మధ్యలో నాయర్ వచ్చి కప్పులు ప్లేట్లు తీసుకెళ్ళాడు. వాసు జయంతి వైపుకళ్ళెత్తి గూడా చూడలేదు.

రాజశేఖరం తిరిగివచ్చాడు. వస్తూనే "చాలా ఆలస్యం అయినట్టుందికదూ!" అంటూ కోటువిప్పి ప్రక్కనున్న కుర్చీ మీద పడేశాడు. టై వూడదీసి కోటుమీద గిరాటేసి కుర్చీలో కూర్చుని వెనక్కివాలి కళ్ళమీద చేతులుంచుకుని 'అబ్బా!' అంటూ "ఆ బెల్ ఒకసారి నొక్కండి" అన్నాడు. జయంతి వెంటనే లేచివెళ్ళి బెల్‌నొక్కింది. తిరిగివచ్చిన రాజశేఖరంలో వుదయంవెళ్ళేటప్పుడున్న ఉత్సాహంలేదు. మొహం అలసటగావుంది. జుట్టుకొద్దిగా రేగివుంది. ఇంతలో నాయర్‌వచ్చాడు. అతను వస్తూ

వూరికేరాలేదు. చేతిలో బాత్‌రూమ్ స్లిప్పర్స్ వున్నాయి. వాటిని శేఖరం పాదాల ప్రక్కగా వుంచి, కాళ్ళకున్న బూటూ, మేజోళ్ళ తీసేశాడు.

"స్నానానికి నీళ్ళు సిద్ధంగావున్నాయా!"

"ఆ!"

"భోజనం "

"ఆ!"

జయంతి టేబిల్‌దగ్గర నిలబడిపోయి కళ్ళప్పగించుని బొమ్మలా చూడసాగింది.

"ఇప్పుడేవస్తాను." స్లిప్పర్స్ వేసుకున్న శేఖరం జయంతివైపు చూడకుండానే అనేసి బైటకి వెళ్ళిపోయాడు. అతనివెనకే నాయర్ కుర్చీమీద పడేసిన కోటు, టై తీసుకుని మరోచేత్తో బూటు మేజోళ్ళు తీసుకుని వెళ్ళాడు.

దాదాపు పదిహేను నిమిషాలు అయిపోయింతర్వాత నాయర్ తిరిగివచ్చి" అయ్యగారు కూర్చున్నారు. రమ్మంటున్నారు." అన్నాడు.

"ఎక్కడికి?" కూర్చుని పత్రిక తిరగేస్తున్న జయంతి కనుబొమలు ముడుస్తూ అంది.

"భోజనానికి" వెనక్కు తిరిగిచూడకుండానే అనేసి వెళ్ళిపోయాడు.

జయంతి కేంచెప్పాలో తోచలేదు. తను భోజనం చెయ్యనిమాట నిజమే కాని తనకలా అలవాటులేదే! ఇంకోళ్ళింట్లో భోజనంచెయ్యాలంటే జయంతి ప్రాణం మీదకు వచ్చినట్టు అన్పిస్తుంది. అయిదు నిమిషాలు ఆలస్యం అయేసరికి పద్దెనిమిదేళ్ళ కుఱ్ఱాడొకడు కర్టెను తొలగించి తలమటుకు లోపలికిపెట్టి "పిలుస్తున్నారు" అన్నాడు. చేసేదిలేక చూస్తున్న పత్రిక ప్రక్కన పడేసి జయంతి లేచివచ్చింది.

లోపలికి యిల్లు యింకా చాలావుంది. ఒంటరిగావుండే రాజశేఖరానికి యింతపెద్ద యిల్లెందుకో! పోనీ కొంతయిల్లు అద్దెకిచ్చు

కోగూడదూ? ఇంట్లో సందడయినా వుంటుంది. తన ఆలోచనలకి తనకే నవ్వొచ్చింది. ఇల్లు అద్దెకిచ్చుకోవాల్సిన ఖర్మ రాజశేఖరానికేం పట్టింది? మధ్యమధ్య గోడలకి అక్కడక్కడ తైలవర్ణ చిత్రాలు, పెద్దపెద్ద గుమ్మాలకి అటుయిటు ప్రతిగుమ్మం దగ్గిర పూలకుండీలు వాటినిండా పూలుతప్ప యింట్లో ఇంకేసామానూ కన్పించటంలేదు. ఇల్లు నిరాడంబరంగా కన్పిస్తూనే యింటి యజమాని అధిక్యతని, కళపట్ల అతనికున్న ఆసక్తిని నిరూపిస్తోంది.

జయంతివెళ్ళేసరికి శేఖరం డైనింగ్ టేబిల్‌దగ్గర కుర్చీలో వెనక్కువాలి కూర్చుని యేదో ఆలోచిస్తున్నాడు. జయంతిని చూస్తూనే సరీగ్గా కూర్చుంటూ "త్వరగా రావాలి. చాలా ఆకలేస్తోంది. మళ్ళీ నేను వెంటనే వెళ్ళిపోవాలి" అన్నాడు నవ్వుతూ. నవ్వినప్పుడు అతను అచ్చు మొదట కన్పించిన రాజశేఖరం మల్లేనే వుంటాడు.

"వాసూ! చేతులుకడుక్కుంటారు; టవల్ తెచ్చియిచ్చి బాత్‌రూమ్ చూపించు" అన్నాడు.

ఇందాక రెండోసారివచ్చి పిలిచిన కుఱ్ఱాడు జయంతికి బాత్‌రూమ్ చూపించాడు. బాత్‌రూమ్ గూడా ఖరీదయిన ఫ్లోరింగ్‌తో నీటుగా అందంగావుంది. వాష్ బేసిన్‌పైనవున్న అద్దంలో కన్పిస్తున్న తన ప్రతిబింబం జయంతికి కొత్తగాకన్పించింది.

భోజనం మధ్యలో అతనెక్కువ మాట్లాడలేదు. జయంతి తనే "సుమిత్రాదేవిని కలిశారా" అని అడిగింది. "లేదు. ఏమని అడగాలో తోచలేదు. పోనీండి. మీరక్కడ ఉద్యోగం వదిలేసిం తర్వాత వాళ్ళ అభిప్రాయాలతో పనేమిటి?" అన్నాడు.

జయంతి సమాధానం చెప్పలేదు. అతను సంభాషణ పెంచలేదు. ఏదో ఆలోచనలో పడిపోయిన అతన్ని మరోసారి కదపటం జయంతి కిష్టంలేకపోయింది. భోజనం పూర్తయిపోతుండగా "ఓ గంటలో నేను వెళ్ళిపోతాను. సాయంత్రం వరకూరాను. మీకు చేతనైనంతవరకూ చూసి యింటికెళ్ళిపోండి. డ్రైవర్ యింటిదగ్గర వుంటాడు. మీరెప్పుడు కావాలంటే అప్పుడు తీసుకెళ్ళి యింటిదగ్గర దించేస్తాడు!" అంటూ లేవబోతూ ఆగి "మీరు ఉదయం కొంచెం త్వరగా వచ్చేస్తే నాకు వీలుగా వుంటుంది. మళ్ళీ మీరు మూడు నాలుగ్గంటలకల్లా ఇంటికెళ్ళిపోవచ్చు." అన్నాడు.

జయంతి సరేనన్నట్టు తలూపింది.

వాసు అందిచ్చిన వక్కపొడి తీసుకుంటుండగా "మీబామ్మగారి కెలా వుంది?" అని అడిగాడు రాజశేఖరం.

"ఈరోజు కొంచెం ఫర్వాలేదు."

"ఏమిటి సుస్తీ?"

"గుండెదడ. అప్పుడప్పుడు నొప్పిగూడా వస్తుంటుంది."

"డాక్టర్‌కి చూపించలా?"

● *లేటుగా వచ్చిన గుమాస్తాతో మేనేజరు : "నువ్వు అరగంట ముందు వచ్చివుండాల్సింది."*

గుమాస్తా : "ఏంజరిగిందండి!"

"చూపించాను." జయంతి మొహం తిప్పేసుకుంది. డాక్టర్‌కి చూపించినమాట వాస్తవమే. కాని అయన రాసిచ్చినమందులు వాడలేదు.

మాట్లాడుతూ, మాట్లాడుతూ మొహం తిప్పేసిన జయంతివైపు ప్రశ్నార్థకంగా చూశాడు శేఖరం. అతని మొహంలో అదేమీ గమనించని జయంతి బైటకొచ్చేసింది.

జయంతి వెంట రాజశేఖరం రాలేదు. దాదాపు అరగంట అయిపోయిన తర్వాత వాకిట్లో కారు చప్పుడు వినిపించటంతో అతను వెళ్ళిపోయాడని జయంతికర్థమైంది.

● ● ●

మర్నాడు జయంతి వెళ్ళేసరికి శేఖరం లేడు. అప్పుడే ఏదో పనిమీద బైటవెళ్లాడని ఇప్పుడప్పుడేరానని చెప్పి వెళ్ళాడని నాను వచ్చి చెప్పాడు. జయంతివచ్చి సీటులో కూర్చుంటుండగా యెదురుగా టేబిల్‌మీద పేపర్‌వెయిట్‌కింద చిన్నకాగితం గాలికి రెపరెపలాడుతోంది. జయంతి దాన్ని తీసుకుని చూసింది. అందులో యిలా వుంది. "నేను పనిమీద వెళుతున్నాను. భోజనానికి రావటానికిగూడా బహుశా వీలుండదనుకుంటాను. నిన్న మీరుపుంచిన ఉత్తరాలన్నిటికీ జవాబులు రాసేశాను. టైప్ చేసివుంచితే వచ్చి సంతకాలు చేస్తాను. ఒంటిగంటకి భోజనం చెయ్యండి మీరు. నాయర్‌తో చెప్పివచ్చాను.

రాజశేఖరం."

దస్తూరినిబట్టి మనిషి వ్యక్తిత్వాన్నినిర్ణయించవచ్చని యెక్కడో చదివినట్టు జ్ఞాపకం. రాజశేఖరం అక్షరాలు త్వరత్వరగా రాసినట్టున్నా, పొంగ్గా కుదురుగా వున్నాయి. అయితే స్థిరమైన వ్యక్తిత్వంగల మనిషి అనుకోవచ్చా?

ఆరోజు రాజశేఖరం జయంతికి కన్పించనేలేదు. ఒంటిగంట అవుతుండగా నాయర్ వచ్చి పిలిచాడు.

"నేనొక్కదాన్నేనా?" జయంతి తటపటాయిస్తూ అంది.

"అయ్యగారు చెప్పి వెళ్ళారు." ముక్తసరిగా అనేసి వెళ్ళిపోయాడు అతను.

చేసేదిలేక జయంతి లేచి వెళ్ళింది. ఎదుట రాజశేఖరం వున్నంత శ్రద్ధగా వడ్డించాడు నాయర్.

ఆరోజు మూడుగంటలకల్లా పని ముగించేసుకుని యింటికి వచ్చేసింది.

ఆమర్నాడు గూడా జయంతి వెళ్ళేసరికి అతను లేడు. కాని ఒంటిగంటకల్లా వచ్చేశాడు.


భోజనం అయిన తర్వాత యిద్దరూ కూర్చున్నారు. జయంతి ఆరోజు వచ్చిన టపాతీసి ఉత్తరాలు విడదీస్తుండగా అతనేదో రాసుకుంటూ కూర్చున్నాడు

ఉత్తరాలు విడదీయటం పూర్తయిం తర్వాత తాను రాసిన కాగితాలు జయంతికిచ్చేసి "ఇది టైప్‌చేసి మీరు వెళ్ళిపోండి" అని ఆరోజు టపాలో వచ్చిన పత్రికలు తీసుకుని లోపలికి వెళ్ళిపోయాడు.

జయంతి టైప్ చేస్తూ కూర్చుండిపోయింది. అతను మంచి ఇంగ్లీషురాస్తాడు. అవన్నీ యేవో స్కీమ్స్. వాటిని గురించి కొన్ని సలహాలు, మిల్లుని గురించి, బ్రాంచీని గురించీను. నాలుగు దాటుతుండగా అతను "యింకా వున్నారా?" అంటూ వచ్చాడు.

"అయిపోవచ్చింది?" చివరలో మిగిలిన కొద్దిభాగాన్ని గబగబా టైప్ చేస్తూ అంది జయంతి.

నాయర్ కాఫీ, టిఫిన్ తెచ్చియిచ్చాడు. ఇద్దరూ కలిసి తీసుకున్నారు. తర్వాత జయంతి యింటికి వచ్చేసింది. శేఖరం



క్లబ్‌కి వెళ్ళిపోయాడు. భయపడుతూ, భయపడుతూ రాజశేఖరం సెక్రటరీగా చేరిన జయంతికి రోజులు యిట్టే గడిచిపోతున్నాయి. చూస్తుండగానే రోజులు వారాలుగా, తిరిగిపోతున్నాయి.

జయంతికి దాదాపు ఒకేరకం కార్యక్రమం. ఉదయం వెళ్ళటం - పనైపోగానే సరాసరి యింటికి వచ్చెయ్యటం. తను అతని సెక్రటరీగా చేరినట్టు వనితావిహార్‌వాళ్ళకి తెలిసిందో లేదో జయంతికి తెలియనేలేదు. రాజశేరఖం అసలు మళ్ళీ ఆ ప్రసంగమే యెత్తలేదు.

నెలకి ధాదాపు 15 రోజులు అతను వూళ్ళో వుండనే వుండడు. ఎప్పుడూ యే బొంబాయో, మద్రాసో, బెంగుళూరో వెడుతూనే వుంటాడు. ఊళ్ళో లేనప్పుడు వెళ్ళే ముందు జయంతికి ఏవేమి చెయ్యాలో చెప్పి వెడతాడు. ఒకవేళ అంతగా అవసరం అయితే ఉత్తరం రాస్తాడు. ఆ ఉత్తరాలు గూడా ఎక్కువ వ్యాపార సరళిలో వుంటాయి. చివరమటుకు మీరు కులాసాగా వున్నారని ఆశిస్తాను అనేవాక్యం మటుకు వుంటుంది. రోజులు గడుస్తున్నకొద్దీ భయంపోయి ఒకవిధంగా జయంతికి నిశ్చింతగా అనిపించసాగింది.

మొట్టమొదటిసారి జీతం యివ్వవలసినప్పుడు ఆరోజు రేపు ఫస్ట్ అనగా శేఖరం బెంగుళూరు వెళ్ళిపోతున్నాడు. వెళ్ళేముందు జయంతి చెయ్యవలసిన పనులన్నీ వివరంగా చెప్పి జేబులోంచి కవరు తీసియిస్తూ "ఇది మీజీతం. రేపు నేను ఊళ్ళోవుండనుగదా!" అన్నాడు. "ఎంత? అని జయంతి అడగలేదు. అతను చెప్పలేదు. ఇంటికి వచ్చిం

తర్వాత చూసుకుంటే మూడువందలు వున్నాయి. ఇదేమిటి? ఆశ్చర్యంతో జయంతి కళ్ళు పెద్దవయినాయి. వనితా విహార్ వాళ్ళు మూడువందలిస్తున్నట్టు సంతకం పెట్టించుకుని నూటయాభై యిచ్చేవారు. అదిగూడా ఫస్ట్‌కి కాదు. ఏ మొదటివారం అయిపోతుండగానో. ఈ లోపల ఒకటి రెండుసార్లు జయంతి గుర్తు చెయ్యాల్సి వచ్చేది.

అమర్నాడు బుట్టనిండా బత్తాయిలు, డాక్టరుగారు రాసిచ్చిన మందులు తెచ్చి ముందుపెట్టిన మనుమరాలిని కోపంగా చూస్తూ "రూపాయి - అర్ధా మిగిలితే దాచుకోక యిలా తగలెయ్యమని యెవరుచెప్పారు నీకు?" అన్నారు బామ్మగారు.

"నువ్వూరుకో బామ్మా! నేను మరీ అంత కష్టపడిపోవటం లేదులే ఇదుగో. ఈపళ్ళరసం తప్పకుండా తాగు. మందులు వేసుకో. అశ్రద్ధచెయ్యక. ఇప్పటికే ఆలస్యం అయింది" అంది. ఆ రాత్రి పడుకున్నప్పుడు కృతజ్ఞతతో మనసులో భగవంతుడికి నమస్కరిస్తోంటే జయంతి కళ్ళముందు రాజశేఖరం మొహంకదిలింది.

● ● ●

రాజశేఖరం పోస్ట్ అంతటిలోనూ జయంతి దృష్టిని ఆకర్షించేవి ఇన్విటేషన్లు. అవి రకరకాలు. రోజుకి కనీసం మూడు నాలుగైనా వుంటాయి. సంగీత సమ్మేళనాలు. సాహిత్య సభలు. డిన్నర్ పార్టీలు. టీ పార్టీలు. డాన్స్ ప్రోగ్రాములు. క్రికెట్ మాచ్‌లు - అన్ని రకాలు వుంటాయి. శేఖరం చాలావాటిని చూసి ప్రక్కన పడేస్తాడు. ఆ పడేసిన వాటిలో జయంతి తనకు కావలసిన వాటిని. ముఖ్యంగా డాన్సులవి. నాటకాలవీ తీసి ప్రక్కన పెట్టుకుని యింటికి తీసుకెళ్ళేది. అలా తీసుకెళ్ళిన వాటితో సునంద తను కలిసి వెళ్ళేవాళ్ళు.

"మీకొత్త ఆఫీసర్ చాలా పలుకుబడి గలవాడులా వుంది?"

అనేది సునంద.

"ఆఫీసరు అనకు అతన్ని" అనేది జయంతి.

"ఏం?"

"ఆఫీసర్లలో వుండే అధికారం. డాబూ దర్పం అతనిలో లేవు."

"ఓహో! అయితే ఏమనమంటావు మరి?" నవ్వుతూ అనేది సునంద.

"నాకు తెలియదు."

"పోనీ - నా థ్యాంక్స్ చెప్పు."

"మంచిదానివే. అసలు నేనీ ప్రోగ్రామ్స్‌కి వెడుతున్నట్టు ఆయనకి తెలియనే తెలియదు."

"ఏం తెలుస్తే ఒప్పుకోడా?"

"అదేం కాదు. ఏమీ అనడనుకుంటా. కానీ నాకిష్టంలేదు."

"ఎంత వయసుంటుంది ఆయనకి?" హఠాత్తుగా అడిగింది సునంద.

"ఏమో నాకు తెలియదు. ఎందుకు?"

"ఆయన పేరు చెప్పినప్పుడల్లా నీ మొహం అదోమాదిరిగా అయిపోతుందిలే. అందుకు."

"ఛీ - ఛీ" జయంతి మొహం యెర్రబడింది.

సునంద పకపకా నవ్వింది.

● ● ●

శేఖరం లేడు. బొంబాయివెళ్ళి దాదాపు పదిరోజులవుతోంది. జయంతి ఆరోజు మామూలుగా వచ్చి ఆఫీసుగదిలో కూర్చుని ఉత్తరాలు తెరిచింది. ఉత్తరాలన్నిటితో పాటు తన పేరుమీద ప్రత్యేకంగా ఒకకవరుంది. అవసరమైన పనులేమైనా వుంటే

వాటి కనుగుణంగా ఏయే చర్యలు తీసుకోవాలో సూచిస్తూ శేఖరం అప్పుడప్పుడు ఇలా రాయటం అలవాటే. జయంతి కవరు తెరిచి చూసింది. అందులో యిలా వుంది.

"జయంతీ!

ఎల్లుండో ఆవలెల్లుండో నీ పుట్టినరోజని. ఆరోజు సెలవు యిమ్మని నువ్వు అడిగినట్టు జ్ఞాపకం. ఇక్కడికి వచ్చిం తర్వాత స్నేహితులతోపాటు అలా సరదాగా షాపుకి వెడితే అక్కడ ఓమంచి చీరకన్పించింది. నాకది చూస్తూనే చాలా నచ్చింది. నీకు గూడా బాగుంటుందనే అనుకుంటూ ఆ చీరెని యీరోజు విమానంలో పార్సెల్‌ద్వారా పంపిస్తున్నాను. దాని రసీదు యీ కవర్లో పెట్టి పంపిస్తున్నాను. ఈ రసీదు తీసుకెళ్ళి బషీర్ బాగ్‌లో వున్న ఏర్‌లైన్స్ వాళ్ళకి చూపిస్తే నీకు చీరె యిస్తారు. నువ్వేవెళ్ళి తెచ్చుకో. పరిచయస్థులకి. బాగాతెలిసినవాళ్ళకి. దగ్గర స్నేహితులు అని భావించే వాళ్ళకి యిలాటి చిన్నచిన్న బహుమతులు యివ్వటం సహజంగా అందరికీ అలవాటే అయివుంటుంది. దీన్నిగురించి ఏవేవో వూహించక - పెద్దగా ఆలోచించక - పుట్టిన రోజుకి చీరకట్టుకుని సరదాగా కాలం గడుపు.

ఇట్లు.

రాజశేఖరం."

జయంతి తన కళ్ళని తనే నమ్మలేక వుత్తరాన్ని తిప్పితిప్పి నాలుగుసార్లు చదివింది. చదువుతుండగానే మొహం ఎర్రబడింది. బహుమతులివ్వటం అనేది అతనికి అలవాటువుండచ్చు. అది అతనికి సామాన్యంగావచ్చు. కాని అలా తీసుకోవటం తనకు అలవాటులేదే! ఈ సంగతి రాజశేఖరానికి యెలా తెలుస్తుంది? తెలిసేదేముంది. రసీదు ప్రక్కనపడేసి ఏర్‌లైన్స్‌కి వెళ్ళకుండావుంటే సరిపోతుంది. ఆ చీరె అక్కడే వుంటుంది. కానీ జయంతి కెందుకో ధైర్యం చాలలేదు. అతనంతగా వూపిరిసలపని పనుల్లోవుండికూడా ప్రత్యేకంగా గుర్తుపెట్టుకుని కావాలనిపంపాడుగదా. ఇలాటి ప్రత్యేకతకోసమేగా తను ప్రతీక్షణం బాధపడేది.

జయంతి మర్నాడువెళ్ళి చీరతెచ్చుకుంది. ఇంటికివస్తూనే శేఖరానికి అంతగా నచ్చిన చీర యేమిటబ్బా అనుకుంటూ ఆత్రంగా విప్పిచూసింది. చూస్తుండగానే. మడతవిప్పుతుండగానే ఆ చీర జయంతి మనసుని దోచేసుకుంది. లేతగులాబి రంగులో. అంచు దగ్గిరగా నాలుగువేళ్ళ వెడల్పున ఆకుపచ్చరంగులో సన్నటితీగెలు. ఆకులువున్న లేను సున్నితంగా చక్కటి పనివాడితనాన్ని చూపిస్తోంది. పల్చగా మెత్తగా గుప్పిట్లో యిమిడిపోయేలావున్న ఆ చీరెను కట్టుకోవటానికి యింకోరోజు ఆగాలంటే జయంతి మనసు ఆగలేదు. చీర విప్పి పరీక్షచేస్తుండగా దాని మడతల్లోంచి కార్డుఒకటి జారి జయంతి పాదాలదగ్గర పడింది. జయంతి వంగి దాన్ని తీసిచూసింది. పుట్టినరోజు శుభాకాంక్ష తెలిపే కార్డు. కార్డుమీద కన్పిస్తున్న అందమైన సరస్సులో. చక్కటి నావ. హంసాకారంగావున్న ఆ నావలో వెనక్కు జారగిలబడి రాజకుమార్తెలా ఠీవిగాకూర్చుని దూరంగా యెక్కడికో పరధ్యానంగా చూస్తున్న అందమైన అమ్మాయి. ఆ అమ్మాయికి యెదురుగుండా చుక్కాని దగ్గర ఒంపులుతిరిగి బలంగా వున్న శరీరంతో అమ్మాయివేపే పరీక్షగా చూస్తున్న అబ్బాయి. జయంతికెందుకో చీరకంటె ఈ కార్డు మరీనచ్చింది. కార్డు తిప్పిచూస్తే వెనక "పుట్టినరోజు శుభాకాంక్షలతో-రాజా!" అనివుంది. రాజా! జయంతి బుగ్గల్లోకి వెచ్చటి ఆవిరి వచ్చింది. ఒకసారి యెప్పుడో అప్తులు, దగ్గరవాళ్ళు రాజా అని.

పరిచయస్థులు, దూరంగా తెలిసినవాళ్లు శేఖరం అని పిలుస్తారని అతను చెప్పినట్టు జ్ఞాపకం. అయితే తను అప్పురాలా ?

పుట్టినరోజు రానేవచ్చింది. ఆ రోజు మామూలుకంటే హుషారుగాలేచిన జయంతి బామ్మ చెప్పిన ప్రకారం బుద్ధిమంతురాలిలా తలంటి పోసుకుని కొత్తచీరె కట్టుకుని దేవుడికి నమస్కారం చేసింది. ఆ తర్వాతవంగి బామ్మ పాదాలకి నమస్కారంచేసి లేవబోతుండగా టప్ మని తలమీద నీళ్ళు పడటంతో "బామ్మా" అంటూ ఖంగారుగా తలెత్తబోయిన మనమరాలిని అవిడ చప్పున దగ్గరగా లాక్కుని గుండెలకి అదుముకుంటూ "ఈ సంవత్సరం అయినా నువ్వో యింటిదానివైతే" అన్నారు. జయంతి మాట్లాడలేక పోయింది.

జయంతి ఆ రోజు సాయంత్రం అయిదు గంటలకల్లా సునంద యింటికివెళ్ళింది. సునందకి జయంతికి మధ్య వయసులో పదిసంవత్సరాలు తేడావుంది. ఒక్కొక్క పరిస్థితుల్లో స్నేహానికి, వయసుకి సంబంధం అక్కర్లేదు అన్పిస్తుంది. సునందావాళ్ళు కొద్ది రోజులు జయంతి యింటిప్రక్కనే వుండి వెళ్ళారు. ఇంటిప్రక్కనున్నప్పుడు కొద్దిగా కలిగిన పరిచయం సునందావాళ్ళ యిల్లు మార్చేసి దూరంగా వెళ్ళిపోయిం తర్వాత స్నేహంగా స్థిరపడిపోయింది. జయంతికి బామ్మతర్వాత ఈ ప్రపంచంలో యెవరైనా వున్నారనిపిస్తే అది సునంద ఒక్కత్తే.

సామాన్య కుటుంబంలోపుట్టిన సునంద అతి సామాన్యమైన చదువుతో ముగించేసుకుని సాధారణంగా పెళ్ళిచేసుకుని అత్తవారింటికి వచ్చేసింది. భర్తకి వచ్చే జీతంలో యిల్లు పొదుపుగా గడుస్తుంది. ఇద్దరు పిల్లలున్న సునందకి ఈ బరువు చాలదన్నట్టు రాయిలా తిరుగుతున్న అత్తగారికి పక్షవాతం వచ్చి మంచంమీదపడింది. ఇన్ని చికాకుల్లో బ్రతుకంటే యెటువైపునుంచి యే ఆకర్షణ లేకపోయినా, యింట్లో అడుగడుక్కీ సంసారంలో అన్నివిధాలా పరీక్షలెదురవుతున్నా సునంద మొహంమీద చిరునవ్వు చెదరదు. "మనం యెంతవరకు అర్హులమో అంతవరకే మనకు భగవంతుడు ప్రసాదిస్తాడు. అపైన దొరకాలనుకోవటం దురాశ. కావాలని కోరుకోవటం, భగవంతుడిని ప్రార్థించటం మూర్ఖత్వం," అంటుంది సునంద.

జీవితాన్ని గురించి సునంద చెప్పే సత్యాలెందుకో, జయంతికి చాలాబాగానచ్చుతాయి. ఒక్కొక్కసారి యిన్ని తెలిసిన మనిషి యిలా మామూలుగా వుండిపోయిందే అనిపిస్తుంది. సునందకి కూడా అప్పుడప్పుడు జయంతితో మాట్లాడుతుంటే తన కష్టాలు తీర్చుకోగల శక్తి తనకులభించినట్టు, కొంచెం మనశ్శాంతి దొరికినట్టు అన్పిస్తుంది. "ఎడారిలా వున్న యీ జీవితంలో నువ్వు నిజంగా నాకు ఒయాసిస్సువి జయంతీ" అంటుంది సునంద. ఛ - ఛ - నేనూ నీలాటిదాన్నే, అలా అనకు " ఎఱ్ఱబడిన మొహంతో అనేసేది జయంతి. తనకి దొరికినంతలో అవకాశం వున్నంతలో తనకు లభించిన సంతోషంలో సాధ్యమైనంతవరకు సునందకి పంచటానికి ప్రయత్నం చేస్తుంది జయంతి. జయంతి అలా చేసేవాటిల్లో సునందని తనవెంట సినిమాలకి తీసుకెళ్ళటం ఒకటి.

నాలుగురోజులక్రిందే పుట్టిన రోజున సాయంత్రం మీయింటికి వస్తానని, నువ్వు రెడీగా వుంటే ఇద్దరం కలిసి సినిమాకు వెడదామని జయంతి సునందతో చెప్పి వచ్చింది. సునంద సరేనని మూడుగంటలకల్లా పనంతా ముగించుకుని, సాయంత్రం

వంటగూడా అప్పుడే చేసేసి ఆ రోజు సాయంత్రానికి మటుకు కొంచెం పిల్లల్ని భర్తని చూసుకోమని చెబుతానని తప్పకుండా రమ్మనమని వాగ్దానం చేసింది సునంద.

అనుకున్న ప్రకారం, సరిగ్గా అయిదు గంటలయేసరికి కొత్త చీరతో, తలనిండా సన్నజాజిపూలతో - అదోవిధమైన అపూర్వ కాంతితో వెలిగిపోతున్న మొహంతో చాలా రోజుల తర్వాత మళ్ళీ మొట్టమొదటి జయంతిలా ఫీలవుతూ సునంద యింటికి వెళ్ళింది జయంతి.

జయంతి వెళ్ళేసరికి సునంద వంటయింట్లో మొహంనిండా కారుతున్న చెమటలతో చెరిగిపోయిన బొట్టుతో, జుట్టు రేగిపోయి క్షణం వూపిరి సలపనిదానిలావుంది. ఇంట్లో యెవరో చాలామంది వున్నారు. ఇల్లంతా సందడిగా వుంది.

ఇంటిని, యింట్లో గోలనిచూస్తూనే నీళ్లు కారిపోతున్న జయంతిని చూస్తూ, సునంద దగ్గరగావచ్చి వుసూరుమంటూ "యేం చెయ్యను. మధ్యాహ్నం రైలుకి దిగబడ్డారు మా పిన్నత్తగారు, ఆవిడ కూతుళ్ళూ, మా యింకో మరిది భార్యాను" అంది నీరసంగా. సునందవంక జాలిగా బాధగా చూడటంతప్ప జయంతి యింకేం చెయ్యగలదు !

దాదాపు గంట గంటన్నర అయిం తర్వాత సునంద యిచ్చిన కాఫీతాగి వాళ్ళ పిన్నత్తగారు వగైరావాళ్ళంతా యేకబిగిన వేసిన ప్రశ్నలకి బిక్కమొహంతో సమాధానంచెప్పి, ఈ చీరయెంత ? అంత తక్కువధరకి ఎక్కడదొరికిందబ్బా ! నువ్వు కొన్న ఆ షాపుకోనే డబ్బిస్తాం మాకుకూడా రెండు చీరెలు తెచ్చిపెట్టు అంటున్నవాళ్ళ మాటలకి భయపడి జయంతి దాదాపు బైటకు పారిపోయివచ్చింది.

ఉత్సాహం సగం చచ్చిపోయింది. అయినా యిప్పుడప్పుడే యింటికి వెళ్ళాలనిపించటంలేదు. ఈరోజు సునందతో కలిసి తనెంత సరదాగా గడపాలనుకుంది ! హాయిగా యేదయినా సినిమా చూసి అక్కడనుంచి ఏ హోటలుకైనా వెళ్ళి తొంచేసి యింటికివెళ్ళాలి అనుకున్నారు.

బైటకొచ్చేసి ఒంటరిగా అటుయిటు చూస్తున్న జయంతికి ఏం చెయ్యటానికి తోచక చివరకి ఒక్కత్తే సినిమాకు బయలుదేరింది. ఇంటికెళ్ళే దోవలోనే ఓ థియేటరు వుంది. అందులో ఏదో యింగ్లీషు సినిమా అడుతోంది. ఆ సినిమా వచ్చికూడా చాలా రోజులైంది. లైమయిపోయినా ఫర్వాలేదు. టిక్కెట్లు దొరుకుతాయి. జయంతి ఈ థియేటర్లోనే సగంరేట్లతో చూపించే మార్నింగ్‌షోస్ బోలెడన్ని చూసింది. జయంతికి మార్నింగ్‌షోస్ అంటే చాలా యిష్టం. సినిమా చూసినట్టువుంటుంది. తక్కువఖరీదు టిక్కెట్లతో పెద్ద క్లాసులో వెళ్ళి కూర్చోవచ్చు.

జయంతి వెళ్లేసరికే సినిమా మొదలు పెట్టేశారు. మార్నింగుషో కాదు కాబట్టి, రోజూ తనుమామూలుగా కూర్చునేచోటులో కూర్చోవాలంటే యెక్కువ ఖరీదు పెట్టాలి. పుట్టినరోజు. ఆమాత్రం ప్రత్యేకత లేకపోతే యెలా ! జయంతి తను మామూలుగా కూర్చునే క్లాసు టిక్కెట్టే యెక్కువ ధర యిచ్చేసి తీసుకుంది.

లోపల పిక్చర్ మొదలైపోయింది. బైట నుంచి థియేటర్ లోపలికివస్తే అసలే కళ్ళు కన్పించవు. అలాగే చీకట్లో తడుముకుంటూ తన కుర్చీవైపు వెళ్ళింది. పిక్చర్ వచ్చి చాలారోజులయింది కాబట్టి జనం అక్కడక్కడ తప్ప యెక్కువలేరు. తడుముకుంటూ, తడుముకుంటూ కుర్చీదగ్గరగా

వచ్చిన జయంతికి సరీగ్గా తను కూర్చునే కుర్చీలోనే యెవరో కూర్చొని వుండడంతో కోపంవచ్చింది. వెధవది ఆ సీటుకోసం కదా తను కావాలని రెండున్నర పెట్టి పైకి వచ్చింది. ఛీ - ఛీ - యీరోజు అన్నీ నిరాశలే. ఆ కుర్చీకి ముందువరసలో వున్న కుర్చీలో వెళ్ళి కూలబడింది.

పుట్టినరోజంటే తనకు సంవత్సరాదితో సమానం. ఈరోజు యెలాగడిస్తే మొత్తం సంవత్సరం అంతా అలాగే గడుస్తుందని పెద్ద నమ్మకం. అంటే దాన్నిబట్టి ఈ సంవత్సరం అంతా అడుగడుక్కీ ఆశించింది అందకుండా నిరాశలతో గడుస్తుందికాబోలు. జయంతి నిట్టూర్పువిడిచింది. చూస్తుండగానే యింటర్వెల్ అయిపోయింది. లైట్లు వెలిగాయి. తన సీటులో కూర్చుని అతనికి తెలియకుండానే నిరాశపరిచిన ఆ మహానుభావుడెవరబాబూ అనుకుంటూ జయంతి వెనక్కితిరిగి చూసింది. అతనుగూడా యిటే చూస్తున్నాడు.

"మీరా!" సంభ్రమాశ్చర్యాలతో అంది జయంతి.

"జయంతీ!" శేఖరం తెల్లబోయాడు.

"అయితే నా సీటులో కూర్చున్నది మీరన్నమాట" అనుకోకుండా ఆశ్చర్యపోయిన జయంతి ఆ మాట పైకి అనేసింది.

"అంటే?" అర్థంగానట్టు అడిగాడు శేఖరం.

జయంతి సంగతంతా చెప్పింది. శేఖరం పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. అంతా విన్నతర్వాత లేచి ప్రక్క కుర్చీలో కూర్చుంటూ "పోన్లే యింకా సినిమా పూర్తి కాలేదుగా." అన్నాడు.

"థ్యాంక్స్" జయంతి లేచివచ్చి శేఖరం ఖాళీచేసిన కుర్చీలో కూర్చుంది.

"ఒక్కదానివీ వచ్చావేం?" శేఖరం అడిగాడు. జయంతి సునంద సంగతి చెప్పటం మొదలుపెట్టింది. చెవులు జయంతి మాటలను ఆలకిస్తున్నా శేఖరం కళ్ళుమటుకు కొత్తచీరలో బొమ్మలా వుండి మెరిసిపోతున్న జయంతిని శ్రద్ధగా పరీక్షగా గమనిస్తున్నాయి. సునంద సంగతి చెబుతున్న జయంతి మధ్యలో యెందుకో ఆగినప్పుడు శేఖరం తన మాటలంతగా వినటంలేదని, తను కట్టుకున్న చీరవైపు గమనిస్తున్నాడని గ్రహించి ఆచీరె అతను పంపిందే అని గుర్తొచ్చేసరికి తల క్రిందకు వాలిపోయింది. భగవాన్! తనీ చీర కట్టుకునేప్పుడు ఇలా అతని కంటపడాల్సి వస్తుందని కల్లో గూడా అనుకోలేదు.

"జయంతీ! ఈ చీరెలో యెంత బాగున్నావని! నిజంగా నేను వూహించినదానికంటె చాలా బాగున్నావు. ఆ రోజు నా ఫ్రెండ్స్‌తో కలిసి వెళ్ళినప్పుడు షాపువాడు ఈ చీరతీసి ముందుపడెయ్యగానే నువ్వు గుర్తు వచ్చావు—"

ఇంతలో మళ్ళీ సినిమా మొదలుపెట్టటానికి సూచనగా లైట్లుపోయినాయి.

"బ్రతికాను" అనుకుంది జయంతి. లేకపోతే తన మొహంలోకలిగే భావాల్ని అతను పుస్తకంలా చదివేసేవాడు.

"మీరు వూరునుంచి యెప్పుడువచ్చారు" ప్రసంగం మార్చెయ్యటంకోసం అడిగింది జయంతి.

"ఇందాకే. మూడుగంటలకి వచ్చాను."

"అప్పుడు ప్లేన్ యెక్కడుంది?"

"ప్లేన్‌లో కాదు. బొంబాయినుంచి కారు వస్తోంటే అందులో వచ్చేశాను. వచ్చేసిం తర్వాత ఏమీ తోచలేదు క్లబ్‌కి వెళ్ళబుద్ధి కాలేదు. మీ ఇంటికి వచ్చి నిన్ను చూసి పుట్టినరోజు అభినందనలు చెప్పా అనుకున్నాను. కాని మధ్యలో విరమించుకుని వెనక్కు వచ్చేశాను. ఏం చెయ్యాలో తోచక, యింటికి వెళ్ళబుద్ధిగాక, ఇక్కడికొచ్చాను. వచ్చి కూర్చున్నానన్నమాటేగాని, నిన్నుగురించే ఆలోచనలు. ఏం చేస్తున్నావో, నేనుపంపినచీర కట్టుకున్నావోలేదో, అది నీకునచ్చిందో లేదో-" చాలా తగ్గుస్థాయిలో మాట్లాడుతున్న శేఖరం మాటలు, అమాట్లాడే తీరు జయంతికి చాలా కొత్తగా అనిపించాయి. అతనికంతం దేని కోసమో వెతికి వెతికి దొరకదని నిరాశపడి అలిసిపోయినపుడు చివరకు హఠాత్తుగా దొరికితే యెలావుంటుందో అలావుంది. జయంతి బొమ్మలా వింటూ కూర్చుండిపోయింది.

పిక్చర్ అయిపోవటంతో యిద్దరూ బైటకొచ్చేశారు. మెట్లుదిగి క్రిందకు వస్తుండగా యెదురుగుండా గోడలకి బిగించివున్న అద్దాల్లో ఒకరిప్రక్కగా ఒకరు నడుస్తున్న ప్రతిబింబాల్ని ఇద్దరూ గమనించుకున్ని అనుకోకుండా మొహాలు చూసుకున్నారు.

క్రిందికి వచ్చేసింతర్వాత శేఖరం జయంతి చేతిని అంటీ అంటనట్టు తాకుతూ "ఒక్కక్షణం యిక్కడే నిలబడు. నేనువెళ్ళి కారుతీసుకువస్తాను" అని కారుకోసం వెళ్ళబోతున్న అతను ఇంతలో దూరంనుంచి "హల్లో! శేఖరం" అని వినిపించటంతో వెనక్కుతిరిగాడు.

"శేఖరం! మైగాడ్! యెప్పుడొచ్చావు వూరునుంచి?" దగ్గరగా వచ్చిన మిసెస్ రేఖారాణి ఆత్రంగా అంది. తెల్లటి పల్చటి వుల్లిపొరకంటె సన్నంగావున్న చీరెలో-ట్యూబ్‌లైట్ కాంతితో పోటీపడుతున్నంటి తెలుపులో గుండెల్లోకి దిగిపోయిన కట్‌తో వున్న భుజాలులేని జాకెట్‌తో, తలకి కుడివైపుగా మెడమీదనుంచి ముందుకు పడుతున్న పెద్దపెద్ద మల్లెపూలమాలతో శేఖరం కన్పించటంలోగల ఆనందం అంతా మొహంలో, కళ్ళలో తెలియజేస్తూ నిలబడింది మిసెస్ రేఖారాణి.

జయంతి వూపిరి బిగబట్టింది. శేఖరం కనుబొమలు కొద్దిగా ముడుచుకున్నాయి.

"ఎప్పుడొచ్చావు వూరునుంచి?" యింకోసారి అడిగింది మిసెస్ రేఖారాణి.

"ఈరోజే పిక్చర్ మొదలవుతోందిలా వుంది, వెళ్ళు."

కారుకోసం వెళ్ళబోతూ అన్నాడు శేఖరం.

"ఓ! పిక్చరుచూడటంఅయిపోయిందా!" అప్పుడు పడ్డాయి ఆవిడ కళ్ళు జయంతి మీద. జయంతి చేతుల్లో చెమటపట్టింది.

"ఇద్దరూ కలిసివచ్చారా?" ఆవిడ డైరెక్టుగా జయంతినే అడిగింది. "ఏమని చెప్పను?" అన్నట్టు జయంతి శేఖరంవైపు చూసింది.

"అవును. వస్తాం. పొద్దుపోయింది. రా! జయంతీ-" శేఖరం తనే సమాధానంచెప్పి జయంతిని పిలిచి వెళ్ళిపోయాడు. ముందుకు వచ్చేస్తున్న జయంతి ఒకసారి వెనక్కు తిరిగి చూడకుండా వుండలేకపోయింది. మిసెస్ రేఖారాణి కళ్ళు పెద్దవిచేసుకుని కనుబొమలు ముడుచుకుని స్థాణువులా యింకా అక్కడే నిలబడి యిటువైపు చూస్తోంది.

కారులో కూర్చుని బైటకొచ్చేస్తుండగా జయంతి "ఇద్దరం కలిసివచ్చాం అనుకున్నదిలా ఉంది" అంది.

"అనుకోనీ." విసుగ్గా అన్నాడు శేఖరం. జయంతి ఊరుకుంది. కొద్దిసేపయింతర్వాత శేఖరం "ఈరోజు నీపుట్టినరోజు. నీకు

పార్టీ ఇవ్వాలి. నీ కభ్యంతరం లేకపోతే ఏదైనా హోటల్‌కు పెడదాం" అన్నాడు.

జయంతి సమాధానం చెప్పలేదు; ఇబ్బందిగా పెట్టిన మొహం అతనుగమనించలేదు.

"చాలా ఆలస్యం అవుతుందేమో" అంది జయంతి.

"కాదు" శేఖరం కారుని హోటల్ వైపు తిప్పాడు.

అది హైదరాబాద్‌లో వున్న మంచి హోటల్స్‌లో ఒకటి. దూరంనుంచి చూస్తే. ఆకర్షణీయంగా ఉన్న డిజైన్‌తో, ముందు విశాలంగా ఉన్న ఆవరణలో పెద్దగార్డెన్‌లో మధ్యగా వున్న అందమైన ఫౌంటెన్‌తో రంగురంగుల లైట్లతో, యెత్తుగా నాలుగంతస్థులతో, కిటకిటలాడుతున్న జనంతో, హోటల్‌కి కుడివైపునున్న ఆవరణనిండా నిగనిగలాడుతూ ఖరీదయిన కార్లతో, డబ్బుంటే జీవితం ఎలా ఉంటుందో కంటికి చూపించే నిర్వచనంలా ఉంటుంది.

జయంతి దూరంనుంచి ఈ హోటల్ని చూడటం, వాళ్ళు వీళ్ళు చెబితే వినటంతప్ప యెప్పుడు లోపలికిరాలేదు.

శేఖరం కారు హారన్ వింటూనే ముగ్గురు నలుగురు పనివాళ్ళు పరుగెత్తుకొచ్చారు. ఏదో పనిమీద బయటికొస్తున్న హెడ్‌వెయిటర్ శేఖరంకారు చూస్తూనే గబగబా వచ్చి శాల్యూట్ చేసి వినయంగా వంగి కారుడోర్ తెరిచాడు. ఈ లోపలే మానేజర్‌గూడా గబగబా వచ్చాడు.

"రూఫ్ గార్డెన్ ఖాళీగావుందా? ఎవరైనా వున్నారా?"

"ఖాళీగానే వుందిసార్." మేనేజర్ జవాబుచెప్పాడు.

శేఖరం వాళ్ళ కేం సమాధానం చెప్పకుండా జయంతిని రమ్మనమని పైకి వచ్చేశాడు. వాళ్ళంతా వెనకే నిశ్శబ్దంగావస్తున్నారు.

"ఏం కావాలి తింటానికి? నీకేది ఇష్టం?" పైకి వచ్చేసింతర్వాత అడిగాడు శేఖరం.

"నాకు తెలియదు." అస్పష్టంగా అంది జయంతి.

ఇంతలో హెడ్‌వెయిటర్ కుర్చీలు తెచ్చి అక్కడ వేశాడు.

శేఖరం అతనికి తీసుకురావలసినవి చెప్పి ఇంకా అక్కడే అరచేతులు రాచుకుంటూ నిలబడిన మేనేజర్‌ని "మీరు వెళ్ళండి. నేను ఓ అరగంటవుండి వెళ్ళిపోతాను" అన్నాడు.

"చిత్తం." అతను మరోసారి శేఖరానికి నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

రూఫ్‌గార్డెన్ విశాలంగా, తీగెలతో పూలతో, మధ్యమధ్య వెన్నెలలా వెలుగునిస్తున్నలైట్లతో ఆహ్లాదంగా ఉంది. పిట్టగోడవారకి వచ్చి నిలబడింది జయంతి. అక్కడనుంచి చూస్తే క్రింద చిన్నచిన్నగా కనిపించే మనుష్యులతో, బొమ్మల్లావున్నకారులతో మిలమిలా మెరుస్తున్న రంగురంగుల లైట్లతోవిరగబడి మెరుస్తోంది నగరం. జయంతికి క్షణంసేపు తనున్నది ఈలోకం కాదనిపించింది. రెండు మూడు గంటలక్రితం విసుగ్గా, విరాళగా కనిపించిన ప్రపంచం ఇప్పుడింత అందంగా ఆకర్షణీయంగా కనిపిస్తోందెందుకు? శేఖరం చేతిలో ఏదయినా మంత్రదండంవుందా! జయంతికి నవ్వు వచ్చింది.



"ఏమిటి నవ్వుతున్నావు." ఈ లోకమే మర్చిపోయినట్టు నిలబడిన జయంతి వులిక్కిపడి వెనక్కు తిరిగింది. వెనకగా దగ్గరగా శేఖరం కళ్ళుదించి జయంతివేపే చూస్తున్నాడు. అతని కళ్ళల్లోకి కొత్తకాంతి వచ్చింది. ఆ కొత్తకాంతితో మెరుస్తున్న కళ్ళు జయంతి విగ్రహంలోని ప్రతి వంపుని నిస్సంకోచంగా స్పష్టంగా పరిశీలిస్తున్నాయి. అతని చూపులతో చూపులు కలవగానే కంగారుపడిన జయంతి కళ్ళు దించేసుకుని "యేమీలేదు" అంటూ వెనక్కుతిరిగివచ్చి కుర్చీలో పొందిగ్గా కూర్చుంది.

జయంతివెంటే శేఖరం వెనక్కుతిరిగి రాలేదు. చాలాసేపు అలాగే అక్కడే నిలబడిపోయి జయంతివైపు వీపుపెట్టిపాంట్ జేబుల్లో చేతులు పెట్టుకుని క్రిందకుచూస్తూ నిలబడిపోయాడు. ఆ తర్వాతగూడా అతనెక్కువగా మాట్లాడలేదు. హఠాత్తుగా అతనెందుకు మౌనంగా, గంభీరంగా మారిపోయాడో జయంతి కర్థంగాలేదు. కంటికి ఆహ్లాదంగా, మనసుకి అద్భుతంగావున్న ఆ వాతావరణంలో ఇంటికివెళ్ళటం ఆలస్యం అయినాసరే యింకొంచెంసేపు కూర్చోవాలనిపించింది. కాని పొద్దుపోతోంది. త్వరగా రమ్మనమని శేఖరం తొందరచేశాడు. పైకి వెళ్ళేటప్పుడు కావాలని మెట్లమీదనుంచి తీసుకెళ్ళిన శేఖరం క్రిందకు దిగివచ్చేటప్పుడు ఆలస్యం భరించలేనట్టు లిఫ్ట్‌లో వెళ్ళిపోదాం అన్నాడు. జయంతి నిశ్శబ్దంగా వుండిపోయింది.

ఇంటిదగ్గరకి తీసుకొచ్చి దించెయ్యగానే కారులోంచి దిగుతూ "థ్యాంక్స్" అంది జయంతి.

"ఎందుకు ?" అన్నాడు శేఖరం పరధ్యానంగా.

జయంతికేం చెప్పాలో తోచలేదు. బొమ్మలా అతనివైపు చూస్తూ నిలబడిపోయింది.

కారు స్టార్ట్ చెయ్యబోతున్న అతను హఠాత్తుగా ఆగి "ఒకమాట చెప్పటం మర్చిపోయాను. నువ్వు నాకంటే చాలా చిన్నదానివి. నిన్ను కావాలని మర్యాదకోసం మీరు అనాలని అన్పించినా మధ్యమధ్యలో మర్చిపోతున్నాను. దానికేం అనుకోవుగదూ" అన్నాడు.

"నేనేమనుకోను థ్యాంక్స్" అంది.

"వస్తా. గుడ్‌నైట్." జయంతిచూస్తుండగానే కారు వెళ్ళిపోయింది. జయంతికి ఇంటికి వచ్చి పడుకున్న తర్వాత అంతా బాగానేవున్నట్టు అన్పించినా మళ్ళీ ఎక్కడో అసంతృప్తిగా అన్పించసాగింది. సినిమాలో అంత ఆప్యాయంగా, సునందంతగాదగ్గరగా మాట్లాడిన శేఖరం హఠాత్తుగా అలా ఎందుకయాడు ? ముఖ్యంగా హోటల్‌లో రూఫ్‌గార్డెన్ మీద తనవైపు వీపుపెట్టి అసలు జయంతి అనే ఉనికినిగూడా మర్చిపోయి అంత నిశ్శబ్దంగా నిలబడిపోయాడెందుకు ? జయంతికి హఠాత్తుగా గుర్తువచ్చింది. రేఖారాణి కన్పించిన తర్వాతనే అతనిలో ఆ మార్పు వచ్చిందని.

(సశేషం)

● ఒక తాగుబోతు : "టైమెంతయిందో చెప్పగలరా ?"

రెం. తా. : "చెప్పగలను"

మొ. తా. : "థాంక్స్."

అందాలూ అసూయలూ

*

'అరవింద'

డ్రెస్సింగ్ టేబిల్ దగ్గర నిలబడి జడఅల్లుకుంటోంది విజయ. ప్రసాద్ ఎలక్ట్రిక్ షేవర్‌తో గడ్డం చేసుకుంటున్నాడు. శ్రీమతి మిశ్రా మెట్లెక్కివస్తూండటం అతడికి కిటికీలోనుంచి కనపడింది. విజయవైపు తిరిగి "ఆవిడ వస్తోంది" అన్నాడు. తలయెత్తకుండానే వేసుకున్న రెండు జడలనీ సర్దుకుంటూ

"ఆవిడంటే ఎవరు ?" అంది విజయ.

"ఆవిడ, మిశ్రాభార్య" అన్నాడు ప్రసాద్ భార్యముఖంలోకి చూస్తూ.

ముఖం చిట్లించుకుంది విజయ.

"ఆవిడవస్తే ఇతడికెందుకో అంత గాబరా. ఆవిడేమన్నా, మహారాణీనా, మినిష్టరా ?" అనుకుంటుండగానే ఆవిడ లోపలికి వచ్చింది.

విజయ కొంచెం నవ్వుతెచ్చుకుని కూర్చోమని కుర్చీ చూపించింది.

ఆవిడ వస్తే కూర్చోదు. గదిలో తిరుగుతూ అన్ని సామాన్లూ చూస్తూఉంటుంది.

"ఈ దుప్పటి చాలా బాగుంది. ప్రసాద్ కొన్నాడా. మీ ఆయనకి మంచి టేస్టుఉంది." అంటుంది. తన యెదుట అతను ఉండగానే పొగుడుతుంది. తనకి గర్వపడాలో ఆవిడ

గడుసుతనాన్ని మెచ్చుకోవాలో అర్థంకాదు. ప్రసాద్ మాత్రం చిరునవ్వులు ఒలక బోస్తాడు.

"నీకు తెలియదు కానీ విజయా, శ్రీమతి మిశ్రా ఇల్లు ఎంత చక్కగా పెడుతుందని. వంటలు ఎంతరుచిగా చేస్తుందని!" అని అతడు బదులు మెచ్చుకుంటాడు. తనకి తెలియదు.

నిజమే ఆవిడ తనని రమ్మనదు. తను వెళ్ళదు. ఆవిడ చేస్తు ప్రసాద్ కొక్కడికే తెలుసు. తనకు తెలియదు. "అసలు ఈవిడ నాకు స్నేహితురాలేమిటీ అతడి స్నేహితురాలు" అనుకుంటుంది విజయ.

"ఎందుకట్లా ఇల్లంతా తిరుగుతుంది. ఒకచోట కూర్చోక ?" అని తెలుగులో వినుగ్గా అడుగుతుంది విజయ ప్రసాద్‌ని.

"ఏం తప్పా ?" అని అడుగుతాడు ప్రసాద్.

"తప్పయితేనే మనం చెయ్యమా ? తప్పులు మనం చెయ్యకుండా ఉన్నామా ?" అనుకుని ఒళ్ళు మండుతుంది విజయకి.

"మీరు వాళ్ళింటికి వెళ్ళి-అట్లాగే తిరుగుతారుకాబోలు. అందుకే ఈవిడా ఇట్లాగ తిరుగుతుంది. కొత్త, పాతలేదు. అటువంటి చనువంటే నా కసహ్యం" అంటుంది.

"నీకు సరదాగా ఉండటం. సిటీలైఫ్ అంటే ఏమిటో తెలుస్తేకదూ" అంటాడు.

మనసులో ముప్పిరిగొనే ఆలోచనలు, కోపం, అసహ్యం విజయని ఇంక మాట్లాడకుండా చేస్తాయి.

ఆతడి కది అర్థంకాని విషయం. అతడితో వాదించి లాభంలేదు. తనలో మాత్రం క్రోధం. అసహ్యం రోజురోజుకీ పెరిగిపోతున్నాయి.

ఆవిడ ప్రసాద్‌తో మాట్లాడుతోంది. పంచదార తను ఒక మణుగు నిలవచేసిందిట. తన టీకి. స్వీట్స్‌కి ఏమీ ఇబ్బంది లేదుట. ప్రసాద్ అంటున్నాడు "మాకు కూడా దొరికేట్లు చూడమని" ఆవిడగర్వం, ఇతడి యాచన చూస్తుంటే మనసులో రగులుకుంటున్న అగ్ని మండటానికి సిద్ధపడుతోంది విజయలో.

ఆ సమయంలో ప్రసాద్ భార్యవైపు తిరిగి "కాస్త కాఫీ చెయ్యి" అన్నాడు.

"ఇప్పుడే కదా తాగాము. మళ్ళీ నేను చెయ్యలేను" అంది విజయ.

"ఆవిడకోసం" అన్నాడతడు.

"ఆవిడకోసం, ఇప్పుడు చెయ్యనవసరం లేదు" అంది మళ్ళీ.

"ప్లీజ్" అన్నాడతడు.

"కావలిస్తే మీరు చెయ్యండి. ఇద్దరూ తాగండి."

అని వరండాలో వాష్ బేసిన్‌లో చెయ్యి కడుక్కుంటోంది. టవల్ భుజంమీద వేసుకుని ముఖంకడుక్కోటానికి విజయ వెనకాల అతడూ వెళ్ళాడు. ఆవిడకూడా వచ్చి గుమ్మంలో నుంచుంది.

"నీ కెందుకంత !జెలసీ ." తెలుగులో సంభాషణ సాగుతోంది.

"ఆవిడకి మీదగ్గరనుంచి ఏం కావాలి ? మీకు ఆవిడ దగ్గరనుంచి ఏం కావాలి ? ఊరికే అట్లా ఒకరిచుట్టూ ఒకరెందుకు తిరుగుతుంటారు."

"పాపం, ఆవిడ సరదాగా ఉంటుంది అంతే. దానికి నువ్వు అనవసరంగా కోపం తెచ్చుకుంటున్నావు. అంతే. ఏమీలేదు."



"ఇంతకంటే ఏమైనా వుంటే నయం. అర్థంకోసం తలపగలకొట్టుకోనవసరంలేదు. ఏమీ లేకపోతే యెందుకా తినేసేటట్లు చూడటం ! తెల్లగా ఉంటుంది. స్లీవ్‌లెస్ వేసుకుంటుంది. ఇంక ఆ భుజాలనుంచి చూపులుతిప్పుకోలేరు. ఇంకా ఏమీ ఉండాలి. ఈసిగులేనితనం చాలదూ....ఛీ...."

చరచర మెట్లు దిగి వెళ్ళిపోయింది విజయ. గ్రౌండ్ ఫ్లోర్‌లో కూడా తెలుగు వాళ్ళే ఉంటున్నారు.

ఆవిడను పిన్ని అంటుంది విజయ. వెళ్ళి ఒక కుర్చీలో కూర్చుంది విజయ.

"మిశ్రా పెళ్ళాం వచ్చినట్లుంది" అంది సావిత్రి-పిన్నిగారి పెద్దకూతురు.

"ఆ వచ్చింది" అంది విజయ.

"కొంతమంది మనుష్యుల్ని సహించటం చాలా కష్టం. ఈ మిశ్రా ఉందే...." అని సావిత్రి అంటుంటే మెట్లమీద ప్రసాద్ దిగివస్తూ కనిపించాడు. అతడి వెనకాలే ఆవిడ వస్తోంది.

"ఆవిడ దేం తప్పులేదు. ఎవరిని ఎంత దూరంలో ఉంచాలో, మర్యాదలకి, స్నేహాలకి హద్దులెక్కడో తెలియకపోవటంలోనే ఉంది చేతకానితనం. అయినా ఏమనిషిని ఎట్లాచూడాలో తెలియని మనిషికి ఎన్ని చెప్పి ఏం లాభం. బాధపడి ఏమి ప్రయోజనం." అంది విజయ గట్టిగా.

"మా ఆవిడకి తలనొప్పిగా ఉందిట. మందు తెప్పించుకోటానికి క్రిందికిదిగింది" అని చెప్తున్నాడు ప్రసాద్, శ్రీమతి మిశ్రాతో.

విజయ అతనికేసి కోపంగాచూసి .

"తలనొప్పికాదు. వొళ్ళుమంట" అంది గట్టిగా.

"అట్లావచ్చేశావు. ఆవిడ ఏమనుకుంటుంది?" అన్నాడు ప్రసాద్.

"ఆవిడ ఏమీ అనుకునే మనిషి కాదు. మీరు స షిస్తారు. కొంచెంసేపు ఏకాంతంగా ఆవిడ అందం కన్నులతో త్రాగి ఆనందిస్తారు."

"నువ్వేమి మట్లాడుతున్నావో...."

"దయచేసి నాకు చెప్పనవసరంలేదు. అవును. ఒకళ్ళు వింటారని అభిమానపడే పరిస్థితి నన్ను దాటిపోయింది. రోడ్డునపోయే ప్రతి ఆడదాన్ని విలాసంగా చూడటం తప్పితే భార్య అనేది ఒకత్తె ఉంటుందని, దాని అభిమానించాలని ఎప్పుడైనా ఆలోచించారా అసలు? ఒకడికి పెళ్ళాం అవడం కంటే—పెళ్ళాంకూడా నలుగురితోపాటు ఒక ఆడది—అన్నీ అమర్చిపెట్టవలసిన జీవితాంత సేవకురాలు—అంతే. ఛీ"


విజయ లేచి దూకుడుగా మేడమీదికి వెళ్ళిపోయింది మళ్ళీ.

శ్రీమతి మిశ్రా అక్కడ బల్లమీదఉన్న వీక్లీలు తిరగవేస్తోంది.

"ఎందుకొచ్చిన గొడవ. దీన్ని వదలించుకో ప్రసాద్" అంది సావిత్రి. విమెన్స్ వీక్లీ ఒకటి తీసుకుని శ్రీమతి మిశ్రా వెళ్ళిపోయింది.

"ఇంటికివస్తే ఇట్లాగేనా చెయ్యటం? ఏదో సరదాకి వస్తారు. ఇంకెందుకువస్తారు మనింటికి? ఛీఛీ. మర్యాద. స్నేహం తెలియవు....ఉత్త జెలసీ."

"తెలియక కాదులే. మన పద్ధతులువేరు చూడు. మన పద్ధతుల్లో పెరిగినవాళ్ళకి ఇవన్నీ సహించటం కష్టం. తప్పుందని ఎవరన్నారు. అయినా పెళ్ళికానివాటికి చెల్లుతుందికానీ. పెళ్ళయ్యాక ఎవరిహద్దుల్లో వాళ్ళుండాల్సిందే. పెళ్ళానికి జెలసీ అనుకోతపోతే సంతోష పెట్టకూడదూ. మన మగవాళ్ళదగ్గర ఉన్నలోటే అది. బయటివాళ్ళని మెచ్చుకుని పెళ్ళాన్ని తీసిపారేస్తారు. గట్టిగా పెళ్ళాన్ని ప్రేమించడానికి కూడా భయమే. ఎవరో ఏదో అంటారని. వాళ్ళు అట్లాగకాదు. భార్యసంతోషంగా ఉండటం వాళ్ళకి ముఖ్యం ఇంటి విషయాలలో భార్యదే పెత్తనం. అందుకే వాళ్ళ ఆడవాళ్ళు నవ్వు మొగాలతో బ్రతుకుతారు. మనవాళ్ళు ఆ ఆడవాళ్ళవేపు చూడటం, మెచ్చుకోవటమే కానీ పెళ్లాన్ని యేలా చూసుకోవాలో తెలియదు వాళ్ళ ఆడవాళ్ళు రాణీల మన్నంత ధీమాగా ఉంటే మన వాళ్ళు కానిస బ్రతుకని కృంగిపోతుంటారు.



నీ సంగతే చూడు - నువ్వు మిశ్రా ఇంటికి వెళ్ళినట్లు ఆ మిశ్రాగాడు వచ్చి నీ ఇంట్లో తిష్టవేస్తుంటే...." మెత్తమెత్తగా చివాట్లు పెట్టడం సావిత్రికి బాగా చేతనవును. ఆవిడ ప్రసాద్‌కంటె పెద్దది కూడాను.

"ఐనా మన ఆడవాళ్ళకి అసూయ లెక్కువ."

"దానికి కారణం మగవాళ్లే. పెళ్ళాన్ని అణిచిపారేస్తుంటారు. మిశ్రా పెళ్లానికి లేదనా? ఆవిడ కథలునన్నడుగు. చెప్తాను ఇంకామనవాళ్ళు అణుచుకుంటారు. మొగుడి దగ్గరేఏడుస్తారు. వాళ్ళ ఆడవాళ్ళు ఆడవాళ్ళు దెబ్బలాడుకోవటం నా చెవులతో విన్నాను. అది అనేవాళ్ళకి. వినేవాళ్ళకికూడా అసహ్యమే" అంది సావిత్రి.

● ● ●

విజయ పెళ్ళిఅయిన నాటికి ప్రసాద్ కలకత్తాలో ఉద్యోగంచేస్తున్నాడు. ఒక ఫ్లాట్‌లో అద్దెకు ఉంటున్నాడు. ప్రసాద్ గ్రౌండ్ ఫ్లోర్‌లో తెలుగువాళ్ళే ఉండేవారు. వాళ్ళకి ముగ్గురు అమ్మాయిలు. ఒక అబ్బాయి. సావిత్రి స్కూల్లో టీచరు. నళిని బి. ఎ. చదువుతోంది. తరవాత బాబి. పావ.

వాళ్ళతో ఇంట్లోమనిషిలా అలవాటు పడిపోయింది విజయ. సగంరోజు క్రింద వాళ్ళతోనే గడుపుతుండేది.

విజయవచ్చిన కొత్తల్లోనే. ఎదురింటిలో క్రింద భాగంలోకి మిశ్రాదంపతులువచ్చారు. మిశ్రా, ప్రసాద్ ఆఫీసులోనే పనిచేస్తుండటంవలన ఇద్దరికీ స్నేహంఉంది. వాళ్ళకి ఒక కొడుకున్నాడు. ఆ మరునాడు పొద్దున్న—వీధివైపు వరండాలో కూర్చుని కాఫీ త్రాగుతున్నారు ప్రసాద్, విజయ.

ఎదురింటిలో మిశ్రా, అతని భార్యా మార్కెట్‌కి బయలుదేరారు, ఇద్దరూరోడ్డుమీదికివచ్చారు.

"ఆవిడ బాగుంటుందికదూ" అన్నాడు ప్రసాద్.

కొంచెంసేపు అటువైపే చూసి.

"అదికూడా అందమేనా!" అంది.

ప్రసాద్ నవ్వి.

"ఓహో, ఐదడుగుల మూడంగుళాలు పొడవు - కొంచెం నొక్కులుగా ఉన్న జుట్టుతో రెండుజడలు - నలుపు కాకుండా, మరీ తెలుపు కాకుండా, సన్నమూ కాక, మరీ లావుగానూ ఉండక మోచేతులదాకా అంచు ఉన్న చోళీతో —

అతిశయం ప్రకటించే ముక్కు —

మాట్లాడే కళ్ళు —

ఇదేకదూ అందమంటే! ఈ ప్రపంచంలో ఇంకేదీ అందంకాదు. అవునా!"

విజయకి కొంచెం నవ్వు వచ్చింది. అది విజయని గూర్చిన వర్ణనే.

"లేకపోతే తెల్లగా ఉంది. స్లీవ్ లెస్ వేసుకోగానే అందం వచ్చేస్తుందేమిటి!"

"లోకంలో అందాలు రకరకాలుగా ఉంటాయి అందానికి నిర్వచన మేమిటనలు, ఆకర్షణే అందం" అతడన్నాడు. ఎప్పుడూ అట్లాగే అంటాడు.

విజయ ఒప్పుకోలేదు.

"అందమనేది ముఖంలోనూ, కదలికల్లోనూ ఉంటుంది. ఎంత సౌష్ఠవంగా ఉన్న శరీరమైనా ముఖం బాగుండకపోతే, ఆకర్షణ అనిపించుకుంటుంది కానీ, అందమనిపించుకోదు."

● ● ●

ఆసాయంత్రం మిశ్రా, అతని భార్య వచ్చారు. ప్రసాద్ వాళ్ళని కాఫీకి రమ్మని పిలిచానని చెప్పాడు. కొత్త స్నేహితులు దొరుకుతారని విజయ చాలాసంతోషించింది. వాళ్ళకి స్వీట్స్, కాఫీ యిచ్చింది. కొంచెంసేపు దక్షిణాదివాళ్ళ ఆహారాలమీద మాటలు జరిగాయి. వాళ్లావిడకి ఇడ్లీ, దోసెలుచేయటం నేర్పమని అడిగాడు మిశ్రా. మిశ్రా భార్య అంత అందగత్తె ఏమీ కాదు. తెలుపు వర్ణం, పొడుగు, పొడుగుకు తగ్గలావు. స్లీవ్ లెస్ బ్లౌజ్ వేసుకుని, పైకి చుట్టినచుట్టు, రింగులుతో ఆకర్షణీయంగా ఉంటుంది. ఆవిడ కొత్తవాళ్ళతో బాగా మాట్లాడుతుంది.

వాళ్ళు వెళ్ళిపోయారు. తమ ఇద్దరినీ వాళ్ళింటికి రమ్మంటారనుకుంది విజయ. కానీ మిశ్రా భార్య ఏమీ అనలేదు. మరునాడు పొద్దున్న—కాఫీ త్రాగాక వరండాలో అక్కడే కూర్చుని పేపర్ మొదలయినవి చూస్తూ కొంచెంసేపు కబుర్లుచెప్పుకోవటం అలవాటు ఇద్దరికీ. తరవాత అవసరమైతే మార్కెట్‌కి వెళ్ళేవాడు ప్రసాద్. విజయ వంట ప్రారంభించేది. మరునాడు పొద్దున్న కాఫీత్రాగగానే మిశ్రా ఇంటికి వెళ్లాడు ప్రసాద్. అక్కడనుంచి వాళ్ళతోకలిసి మార్కెట్‌కి వెళ్ళివచ్చాడు.

ఉన్నవి తెచ్చాడు, లేనివి లేవు.

విజయకి అతడిని ఏమనాలో, ఏమనకూడదో తెలియలేదు.

"దిన చర్యలో ఎందుకురావాలి మార్పు! వాళ్ళు కొత్తకదా, వాళ్లు తమ ఇంటికి రమ్మనైనా పిలవలేదు. ఏమిటి ఇతని ప్రవర్తన!" ఆలోచించటం మొదలుపెట్టింది.

శ్రీమతి మిశ్రా తరచూ వస్తూనే ఉంటుంది. కాఫీత్రాగి కబుర్లుచెప్పిపోతూనే ఉంటుంది. కానీ విజయని ఎప్పుడూ రమ్మనలేదు.

ప్రసాద్‌కూడా రోజుకి ఒకసారైనా వాళ్ళింటికి వెళ్ళివస్తుంటాడు. పోనీ అతడైనా వాళ్ళింటికి రమ్మని తనను ఒక్కసారైనా అడగలేదు అని విజయ బాధపడుతుండేది.

ఆఖరికి తనే ఒకసారి అభిమానం, సంకోచం తొలిగించుకుని ప్రసాద్‌తో వెళ్ళింది.

మిశ్రాభార్యకి తన రాక ఆనందం కలిగించనట్లు, ఆవిడ ఒక నిర్లక్ష్యంతో ప్రవర్తించినట్లు విజయకి అనుమానంవేసింది. వాళ్ళింటికి వెళ్ళటమంటే అసహ్యంవేసింది.

ప్రసాద్‌తో అంటే విని విననట్లుగా నవ్వి ఊరుకున్నాడు. అతడిమీద కోపం వచ్చింది విజయకి.

"భార్యని ఇంకొకళ్ళు అవమానకరంగా ట్రీట్‌చేస్తుంటే ఇతడికేమీ అనిపించదా, అభిమానంలేదా!" అనుకుంది ఆవేశంతో.

● ● ●

తరవాత-నెల గడిచాక పుట్టినింటికి పండగకి వెళ్ళి ఒకనెల ఉండివచ్చింది విజయ. సాయంత్రం పిన్నిగారి హాలులో కూర్చుని, వాళ్ళ కబుర్లు వింటోంది విజయ. ప్రసాద్ ఇంకా ఆఫీసునుంచి రాలేదు

"ఈ నెల్లాళ్ళూ మీ ఆయనకేమీ లోటు రాలేదు. అమ్మ ఒకపక్కనుంచి అన్నీ చేసిస్తూనే ఉంది. హోటళ్ళు యెందుకు! ఇంకొకపక్కనుంచి మిశ్రా పెళ్లాం పంపించేది. ఒకరోజున మాటల్లో ప్రసాదు తనకి ఐర్పి ఇష్టమన్నాడు. ఆవిడ వెంటనే ఇంటికి వెళ్ళి చేసి పంపించింది. సాయంత్రంపూట టీ, ఫలహారం అక్కడే. ఇంటికివచ్చి ఆవిడని మెచ్చుకోవటం వింటున్నారే ఉత్తరదేశపు ఆడవాళ్ళు - మొగుణ్ణి మొగుడిలా చూడరు. వాడొక నౌకరు.. డబ్బుతేవాలి కష్టపడి. అది తెచ్చి చేతుల్లో పొయ్యాలి, వాడికే అవసరం వచ్చినా, నయాపైస మొదలు వందదాకా దీని నడగాలి. అదీ ఆశ్చర్యమే. వాడు బాధపడడు. పైగా భార్యనడిగి తీసుకోవటంలో ఆనందం అనుభవిస్తాడు. మనసంగతి దానికి ఉల్టా. ఆడదానికి కంట్లో నీళ్ళవస్తే కాని, కట్టుడుచీరకూడా రాదు. సరే....ఇక ఇంటి పనుల్లో సాయంచెయ్యాలి. పిల్లల్ని ఆడించాలి. మార్కెట్‌కి వెంట రావాలి. బరువు సామాను వాడు మొయ్యాలి. దానిది ఆడింది ఆట, మళ్ళీ పరాయి మగవాడిని ఆకర్షించాలని ఎంత తాపత్రయపడతారో!"

"అభిమానం ఉండదు కాబోలు."

"మొగుడిని .దేవుడిలా ఆరాధించటానికి వాళ్ళు ఆంధ్రులు కారమ్మా. అయినా వాళ్ళకి సంప్రదాయం, సంస్కారం ఎక్కడ ఏడ్చింది. అంతాసంకరమే. చెక్కుచెదరకుండా వచ్చింది మన సంప్రదాయం. అన్నాళ్ళూ పల్లెటూరు బ్రతుకులు, బ్రిటిష్ వాళ్ళు వచ్చాక మేమ్ సాహెబాలు, ఇప్పుడు అమెరికన్ స్టయిల్. ఏమయితేనేం సుఖపడుతున్నారు. సంస్కారం వదులుకోలేక, అభిమానాలు చంపుకోలేక బాధపడుతున్నది మనమే. కాలం మారుతోందని తెలిసినా,

---

● *మొదటిసారిగా మద్రాసువెడుతున్న ఒకాయన తోటి ప్రయాణికుణ్ణి ప్రశ్నలతో వేధించేస్తున్నాడు. చివరికి "ఈ రైలు సెంట్రల్ స్టేషన్‌లో ఆగుతుందని మీకు ఘట్టిగా తెలుసా?" అని అడిగాడు.*

రెండో ఆసామీ పళ్ళు, గుప్పిళ్ళు బిగపట్టి "అయ్యా! ఆక్కపోతే ఈ రైలూ, సెంట్రల్ స్టేషనూకూడా ధ్వంసమైపోతాయి. నా మాట నమ్మండి." అన్నాడు.

ఎదురీదుతూనే ముందుకు పోతుంటాము, మారకా తప్పదు. మనోవ్యధాతప్పదు" సావిత్రి అట్లా మాట్లాడుతూనే ఉంది' గేటులోనుంచి మిశ్రా భార్య వచ్చింది. కుర్చీలో కూర్చుంటే విజయ చూపులు ఆవిడ వేసుకున్న పవరం మీదికి పోయాయి. విజయ పుట్టింటిలో ఉండగా ప్రసాద్ ఉత్తరం రాశాడు. తన స్నేహితుడి భార్యకు పవరం కావాలని, తెచ్చిపెట్టమని. విజయ తన అక్కయ్య ద్వారా మద్రానునుంచి ఆ పవరం తెప్పించి తీసుకువచ్చింది. ఇదంతా ఈవిడకోసం అన్నమాట. ఈవిడ కని తెలిసివుంటే ...పొడుగుగా నొక్కులుగా క్రింద కుచ్చుగా వ్రేలాడే ఆ జడ చూస్తుంటే తనను పాము చుట్టుకుంటున్నట్లనిపిస్తోంది విజయకి.

"ఇదేమి స్నేహం! పోనీ తనకుచెప్పి తనను ఇమ్మంటే బాగుండదూ. పొద్దున్న ఇచ్చాడన్నమాట. ఇప్పుడు ఈవిడ ధరించుకు వచ్చింది. ఆవిడ అడిగే ఉంటుంది. ఏమిటి ఇతని తాపత్రయం! ఒక నెలలోనే ఇంత చనువైపోగలరా మనుష్యులు. పరాయి స్త్రీతో ఏమిటి ఇంత చనువు! ఏమిటీ మనిషి స్వభావం! ఆవిడచేత మంచివాడు. సరదా అయినవాడననిపించుకోవాలనా! దాని? వలన ఇతడికి ఏమివస్తుంది? ఏమి ఆశించి ఊరికేనా అంత అర్థంలేని ప్రవర్తన.

"ప్రసాద్ ఇంకా రాలేదా?" అడిగింది శ్రీమతి మిశ్రా.

"ఏం ఈ కొత్తవేషం చూపించాలనా!" సావిత్రి తెలుగులో అని నవ్వుతోంది. సావిత్రి ఎప్పుడూ హిందూస్థానీల్ని, పంజాబీలని ఒక సంస్కృతి, సంప్రదాయంలేని వాళ్ళని హేళనచేస్తుంటుంది.

"ఆ పవరం ఎక్కడ సంపాదించిందో. నిముషంలోపట్టేస్తుంది ఫేషన్" అంది నళిని.

"ఏ మెడ్రాస్‌వాడినో అడిగిఉంటుంది. ఎవరినీ వదిలిపెట్టదుగా" అంది సావిత్రి.

"అందరూ అట్లా ఉండరే అక్కా. మళ్ళీ ఆ పక్క ఇంట్లో రాయ్‌లేడూ, అతనూ అందరితో సరదాగా మాట్లాడతాడు. ఎంతో హుందాగా, ఆకర్షిస్తూఉంటాడు. ఈ మిశ్రా పెళ్లానికూడా అతడంటే దూరమే. వీళ్ళందరిలోకి దప్పుగా ఉండని భర్త అతడొకడే."

"ఐనా పైకి సోషల్‌గా, సరదాగా కనిపిస్తారు. కానీలోపల వాళ్ళలో అన్నీ జెలసీలే పెళ్లాన్ని వెనకేసుకుని మగవాళ్ళుకూడా దెబ్బలాటలకి సిద్ధమవుతుంటారు నాతోటి టీచర్స్ మాటలు వింటుంటే వీళ్ళ నాగరికత బయటపడుతుంది" అంది సావిత్రి.

ఆ మాటలు సగం సగమే వినిపిస్తున్నాయి. మిశ్రాభార్య ఎప్పుడువెళ్ళిందో. ప్రసాద్ ఎప్పుడువచ్చాడో. ఆలోచిస్తున్న విజయకు తెలియకుండానే జరిగాయి.

ఫలహారం, కాఫీ ఇస్తుంటే

"ఏమైనా స్వీట్ చెయ్యకపోయావా?" అన్నాడు అతను

"మిశ్రా ఇంటికి వెళ్ళండి. ఆవిడ పెడుతుంది" అంది.


"నీవు చేసిపెడితే, అక్కడికి వెళ్ళటం యెందుకూ" అన్నాడు

ఎన్నో ప్రశ్నలు గుండెలోంచి సూదుల్లా పొడుచుకుని వస్తుంటే క్రింది పెదవిని పంటితో నొక్కిపట్టింది. మౌనంలో కొంత సర్దుకున్నాక

"అయితే ఆ పవరం మిశ్రా పెళ్ళానికా తెమ్మన్నారు?" అని అడిగింది మెల్లగా.

"ఊ. ఏం పెట్టుకుందా?"

"ఆ, మీకు రహస్యమేమో కానీ, ఆవిడకి గొప్ప. ప్రసాద్ తనకోసం మెడ్రాస్ నుంచి తెప్పించాడని."



"రహస్యమేముంది! ఎవరికైతేనేమిటి - ఇంకొకరికి యిచ్చేది"

"ఈవిడ నాకు తెలియనిది కాదుగా. మనింటికి వస్తూనే ఉంటుంది. మీరే తీసుకువెళ్ళి ఇవ్వాలా."

"ఎవరిస్తే ఏమిటి? ఇందులో తేడా ఏముంది?

"తేడాఏముంది, మీరు ఆవిడచుట్టూ తిరగటంతప్పితే. ఎందుకు ఆవిడచేత మంచి అనిపించుకోవాలని అంత తాపత్రయపడతారు! చెయ్యదలుచుకుంటే అంతకంటె మంచిపనులు లక్ష ఉన్నాయి ఈ భూమిమీద" అంది.

● ● ●

"నాకు నిజంగా జెలసీఉందా? నేను బాధపడటంలో న్యాయంలేదా?" ఒంటరిగా గదిలో కిటికీ దగ్గర కూర్చుని ఆలోచించుకుంటోంది విజయ.

"అందమంటే తెలియనట్లు, భార్య అనాకారి అయినట్లు పరాయి ఆడదానితో ఆ కబుర్లు, ఆ భార్యాభర్తల వెనకాలపడి మార్కెట్‌కి వెళ్ళటం, ఆవిడను వంటలు అడిగి చేయించుకుతినటం ఇదంతా ఏమిటి. సిగ్గులేనితనంకాక - భార్య అంటే అభిమానం లేకపోవటంకాక!

పోనీ ఆవిడేమైనా చుట్టమా, అక్కగారా, మేనత్తా—

ఏపనైనాచేస్తే అర్థంఉండాలా?

కలకత్తాలో ఉంటే ఇట్లా ఉండాలనుకుంటారా? పోనీ ఈ సంస్కారం అలవరచుకున్నారంటే నా విషయం వచ్చేటప్పటికి-భార్య సంగతి వచ్చేటప్పటికి—

అతని యిష్టమైన వ్యక్తులని ఏరి పరిచయం చేస్తాడు.

ఎప్పుడైనా సినిమాకి తీసుకు వెడతాడు ఎవరితో జోక్యం లేకుండా.

స్నేహితుల ఇళ్ళకి తను ఒక్కడే వెళ్ళి వస్తాడు. మార్కెట్‌కి మిశ్రాల వెంట. పోతాడు కానీ తనను పిలవడు. భార్యాభర్తలు

ఇద్దరూ పోతున్నప్పుడు ఇతనెందుకువెంట? పోనీ సరదా ఉంటే తననెందుకు పిలవ కూడదు? తనేమి చదువుకోనిదా, నలుగురు పిల్లలు కలదా! తనని అతడు నిర్లక్ష్యం చేస్తున్నట్లే కదా. అతడికి సరదాలు కావాలి. భార్య మర్యాదగా ఉండాలి. అతడికి ఒక పద్ధతి. భార్యకి ఇంకొక పద్ధతి.

ఒకసారి తనుకూడా మార్కెట్‌కి వస్తానంది. చీర మార్చుకుని వచ్చే పది నిమిషాలలో అతడు అన్నమాటలు:

"ఇంకా యెంతసేపు! మీ ఆడవాళ్ళ అలంకరణ యెన్నిగంటలైనా తెమలదు. అందుకే ఆడవాళ్ళతో యెక్కడికైనా బయలుదేరాలంటే ..."

ఇంక ఆతరవాత విజయ వినదలుచుకోలేదు. కోపంతో తలంతా వేడెక్కిపోయింది అప్పటికే.

మిశ్రాలతో మార్కెట్‌కి వెళ్ళడానికి అరగంటసేపు వాళ్ళ ఇంట్లో పడి కాపులు కాసే మనిషేనా ఇట్లా అనటం; ఆవిడ కోసం వెయిట్ చెయ్యటం కష్టం అనిపించదు కాబోలు. కట్టుకున్న చీర విప్పిపారేసి, ముందర కట్టుకున్న చీరనే అవకతవకగా కట్టుకుని వచ్చి కుర్చీలో కూర్చుంది.

"మీరు వెళ్ళండి. నేను రావటంలేదు."

"ఇంతలోకి ఏమొచ్చింది!"

"రోగం" అనుకుంది మనసులో.

"అవన్నీ నేను చెప్పలేను. మీరు వెళ్ళండి" అంది. తనకి సరదా కలిగితే సావిత్రితో కలిసి వెళ్ళేది కానీ మళ్ళీ అతడిని యెప్పుడూ అడగలేదు విజయ.

"ఇతడిని నేనుమార్చలేను" అనుకుంది.

ఒకరోజు-రోజూ ప్రసాద్ ఇంటికివచ్చే వేళదాటిపోయింది. వరండాలో లైటుఆర్పి కుర్చీలో కూర్చుని రోడ్డుమీదకి చూస్తా ఉంది. రాత్రి ఎనిమిది అయింది. తొమ్మిది కూడా దాటింది. అతడు రాలేదు. విజయ అట్లాగే కూర్చుంది. పదికావస్తుంటే రోడ్డు చివర కనిపించారు ముగ్గురూ - మిశ్రా అతని భార్యా, ప్రసాద్. ప్రసాద్ పైకి వచ్చి వరండాలో లైటువేశాడు.

"ఇంకా పడుకోలేదా. చీకట్లోకూర్చున్నావు" అన్నాడు. అని లోపలికివెళ్ళి దుస్తులుమార్చుకుంటూ

"సాయంత్రం అటు వెడుతుంటే లైట్ హౌస్‌దగ్గర కనిపించారు మిశ్రావాళ్ళు. మంచిపిక్చర్ నన్నుకూడా రమ్మన్నారు. సందేహించాను కానీ, రానంటే బాగుండదని..." అని చెప్పుకుపోతున్నాడు.

విజయ తలమీద చేయివేసుకుని అనుకుంది.

"నాకు తెలుసు. ఇంటిదగ్గర భార్య నాకోసం ఎదురుచూస్తుందని చెప్పలేరుమీరు. అట్లా చెప్పడానికి భయం, ఆవిడ ముందర సిగ్గు."

"కావాలనే కలిసివెడితేమాత్రం మిమ్మల్ని అనేదేముంది" అంది. అతడికి అన్నంపెట్టడానికి లేస్తూ.

ఒకరోజు మార్కెట్‌నుంచి వచ్చాక ఒక పాకెట్ ఇచ్చి.

"బాగుందా చూడు" అన్నాడు. విప్పి చూస్తోంది విజయ. అది ఒక జాకెట్ పీస్. బాగానే ఉంది.

"మిశ్రా పెళ్ళాం జాకెట్ గుడ్డచూసింది. ఇది చాలా బాగుంది అంది. అందుకని నీ కోసం కొన్నాను."

తనకోసం భర్త ఒక వస్తువు తెచ్చాడని సంతోష పడబోతున్న విజయ మనసు ముడుచుకు పోయింది.

"అదా సంగతి. ఆవిడ మెప్పుకోసం అన్నమాట, నాకోసం కాదు" అనుకుంది.

"ఆవిడకి కొనిపెట్టకపోయారా?" అంది

"ఆవిడకి నే నెందుకు కొనిపెడతానూ" అన్నాడు.

"తప్పేముంది" అంది విజయ.

తనకి జాకెట్‌గుడ్డ సెలక్టు చెయ్యటానికి శ్రీమతి మిశ్రా పక్కన ఉండాలి. తనకి టేస్టు లేదూ. తను ఏమైపోయినట్లు, తను ఎవరిని తృప్తిపరచటానికి అది ధరించాలి? దాన్ని ఉండగా చుట్టి చాకలి బట్టల పెట్టె అడుగున పారేసింది విజయ "హు! నాకు అసూయ!" అనుకుంది.

"నేను మీకు తృప్తికలిగించటం లేదు కదూ. పోనీ నేనుకూడా శ్రీమతి మిశ్రాలాగ ఉండనా. ఆవిడలాగ మిడి. స్లీవ్‌లెస్...." అడిగింది విజయ.

"తృప్తి కలిగించలేదని నే నెప్పుడూ అనలేదే. నీవంటే నాకెంతో తృప్తి."

"అంతఃపురంలో పెట్టడానికా!"

"నీకు తెలియదు. అందమైన ఆడవాళ్ళని యెక్కువగా తిప్పితే దిష్టి తగులుతుంది. ఇప్పుడే ఇట్లాగుంటావు మిశ్రా పెళ్ళాంలాగ వేషం వేస్తే....నీకుతెలియదు. వెనకాల మగవాళ్ళు యెట్లాటి మాటలు అంటారో - ఎన్నికథలు అల్లుతారో!"

"మరి మీరెందుకు ఆవిడచుట్టూ తిరుగుతారు!"

ఈప్రశ్న గొంతుకలో కొట్టుకులాడింది. హు, అతడిదంతా సరదా, స్నేహం.

తనకి ఏమీ తెలియవు; పట్టి అసూయ. తనపట్ల అతడి ప్రవర్తనకి అర్థం ఏమిటో? సరదా, స్నేహం ఇవేనా!

తన అందాన్ని, గుణాన్ని అందరూ పొగిడిన వారే. కానీ, తన అదృష్టమే బాగుండలేదు. తనలో ప్రసాద్‌కి అసూయ తప్ప, కోరికలూ, వాంఛలూ కనిపించవు. తన అందంకానీ, సంస్కారం కానీ అతడికి తృప్తికలిగించలేదు.

స్వంతంకానివి - రకరకాలు - అర్థంలేని ఆకర్షణలకు మిఠాయికొట్టు దగ్గర నిలబడి గుటకలువేసే పిల్లవాడి మనస్తత్వంతో-పరాయి ఆడవాళ్ళనుంచి చూపులు తిప్పుకోలేక అవస్థపడే ఈ భర్తని ఎట్లా సహించాలి!

మగవాళ్ళు భార్య ఒకతెను ప్రేమించి తృప్తిపడలేరా?

లేక ప్రతిస్త్రీ కూడా చూసి ఆనందించ తగిన ఒక వస్తువా? మరి నేను అట్లాగ ఉండటానికి అతడు ఒప్పుకోడేం?

అన్నిదేశాల ఉత్తమగ్రంథాలూ కూడా భార్యాభర్తలఅన్యోన్యానురాగాన్ని,ఆరాధనను అత్యుత్తమంగా చూపిస్తాయి.

నా అందానికి అతడు ముగ్ధుడుకావాలని, నన్ను అతడు సర్వాతీతంగా అభిమానించాలని అనుకోవటంలో, కోరుకోవటంలో అక్రమమేమీలేదు. తప్పులేదు. నా బాధకి అర్థంఉంది. చదువూ సంస్కారం

● *సంపాదకుడు : ఈ కథ అశ్లీలంగావుంది. మధ్యలో ఒకచోట ఆమె నగ్నంగావుందని రాశారు. ఇల్లాంటివి మేము వేసుకోము.''*

కథకుడు : ఆ తరవాత వాక్యం చూడండి. ఆమె సిగ్గుతో ముడుచుకుపోయిందని రాశాను.''

ఉన్న భార్యని ఇంట్లో వదలి పరాయి స్త్రీతో చనువుగా, సరదాగా ఉండటం భార్యని అవమానించటమే అవుతుంది. ఈ అవమానాన్ని నేనేమీ సహించ నవసరం లేదు. అనుకుంది విజయ.

అనుకుని క్రిందికి వెళ్ళింది. సావిత్రి. నళినికూడా ముందర హాలులోనే కూర్చుని ఉన్నారు. పిన్నిగారు ఉప్మా చేసింది. అందరూ తింటూ ఉన్నారు. సావిత్రి చెప్తోంది.

"మిశ్రా ఇంటి పై ఫ్లోరులో ఉంటున్నాడు సతీష్. ఆతనికి జ్వరం వచ్చిందట. మిశ్రాని మందు తెచ్చిపెట్టమని అడిగాడుట. మిశ్రా పెళ్ళాం అనుమతికోసం వెళ్ళాడట ఆవిడ ఏమందో తెలుసా.

నువ్వేం. వాళ్ళ నౌకరువా? అందిట. మిశ్రా భార్యకి ఏదో చెప్పి మందు తెచ్చాడనుకో. ఇదంతా బాబి చెప్పాడు. అక్కడ పిల్లలు కారెమ్స్ ఆడుకుంటున్నారట అప్పుడు."

అప్పుడు గేటు చప్పుడయింది. ప్రసాద్ రావటం విజయ చూసింది. తింటున్న ప్లేటు వదిలేసి "మార్కెట్‌కి వెళ్ళానని చెప్పు" అని సావిత్రితో వెనుకవైపు గుమ్మంలోంచి హడావిడిగా వెళ్ళిపోయింది.

"వెర్రిపిల్ల" అంది పిన్నిగారు.

"ప్రసాద్ ఏం చేశాడని! ఒక ఆడదానితో మాట్లాడాడని. ఆవిడవైపు చూశాడని ఈవిడ యింత ఇదయిపోవాలా. అసహ్యంగా పెళ్ళయినంత మాత్రాన ఎవరినీ చూడకూడదా, మాట్లాడకూడదా, సరదాగా ఉండకూడదా?" అంది నళిని మొహం చిట్లించి.

"నీకు తెలియదే. పెళ్ళయితేతెలుస్తుంది.

"అయినా ఏమిటా వేషాలు. ఆ సరదా ఏమిటో భార్యతోనే చెయ్యొచ్చుగా!"

"భర్తతో సరదాగా తిరగాలని, కాలం గడపాలని ఈ అమ్మాయికి ఉండదేమిటి?" సావిత్రి అంది.

"నీకు మహా అనుభవం ఉన్నట్లు." అంది నళిని.

"అది ఆలోచించే పద్ధతిలో ఉంటుంది. అనుభవం అక్కరలేదు."

"అనుభవమూ దగ్గర్లోనే ఉందిలే."అంది నళిని నవ్వుతూ.

చెల్లిపోరుమీద సావిత్రికి ఏవో సంబంధాలు చూస్తున్నారు.

ప్రసాద్ వచ్చాడు-పైకి వెళ్ళవచ్చాడు.

"విజయ షాపింగ్‌కి వెళ్ళింది" సావిత్రి చెప్పింది.

"ఇప్పుడేమిటి? ఇప్పుడు ఇక్కడ చూశాను. ఒక్కతే వెళ్ళిందా?"

"ఆ నిన్ను చూశాకే వెళ్ళింద" అంది సావిత్రి తమాషాగా నవ్వుతూ.

"మార్కెట్‌కి వెళ్ళావా?" విజయ వచ్చిన తరవాత ప్రసాద్ అడిగాడు.

"ఊ. వెళ్ళాను." ఎటో చూస్తోంది విజయ. అతడి చూపులు తప్పించుకుని.


"నేనూ వచ్చేవాడినిగా."

"మీకు తొందరఏముంది రేపొద్దున్న శ్రీమతి మిశ్రా వెనకాల వెళుదురుగాని."

"ఛా - అదా నీ కోపం. నీకు వెళ్ళాలని ఉంటే తీసుకువెళ్ళనా నేను. నీ వెప్పుడూ అడగందే!"

కోపం, అసహ్యం కంఠంలో వ్యక్తమవుతుంటే-

"నే నడగాలి-ఇంత సరదా నవీనత కలిగిన మీకు భార్య సంగతి తెలియదు. మీకు ఆవిడవెంట తిరగటం సరదా. నాకు మీతో సరదాగా తిరగాలని ఉండదా?



మీకు లేదని తెలుస్తూనే ఉంది. ఇక మిమ్మల్ని బాధపెట్టడం ఎందుకు? అందుకే నేను అడగను. మిమ్మల్ని అడగలేను. మీరంటే చనువు ఉంది కనుక మిశ్రా పెళ్ళాం మిమ్మల్ని అడుగుతుంది. మీరు ఆవిడ నడుగుతారు. నేను మిమ్మల్ని అడగలేను. నాకు అభిమానం ఉంది. నా స్వంత వ్యక్తి. నన్ను అభిమానించేవాడయితేనే నేను నా అభిమానం వదులుకోగలను. మిమ్మల్ని నేను ఏమీ అడగలేను. మీరు నాకు ఏమీ కారు. మీకూ నాకు సంబంధం లేదు" కోపం, రోషంతో కన్నీళ్ళు కారుతున్నాయి. అయినా ఆ కళ్ళల్లో ఒక కఠినత్వం ముద్రవేసుకుంది.

"ఛీ, ఛీ ఏమిటిదంతా విజయా? ఇదంతా ఆ మిశ్రా పెళ్ళాంమీద జెలసీయే!" ప్రసాద్ భార్య కంటిలో నీటిని తుడవబోయాడు.

"జెలసీ అని అనటానికి మీకు అభిమానంలేదు. ఆవిడను చూసి జెలసీ పడాల్సిన అవస్థ మీ భార్యకి ఎందుకు రానివ్వాలి? నాలో ఒకవేళ ఆ హీన గుణం కలిగినా. అందుకు బాధ్యులు మీరు, మీ ప్రవర్తన. అందుకే మీరంటే నాకు అసహ్యం. నాకేం తక్కువయిందని నన్నిట్లాగ అవమానం చేస్తారు ఆవిడ చుట్టూ తిరిగి. మీకు నేనంటే అభిమానంలేదు. మీకూ నాకూ సంబంధంలేదు." అంది అతడినుంచి దూరంగా తొలగిపోతూ.

"పెళ్ళంటే ఆనందంగా ఉంటామనుకున్నాను కానీ ఈఅపార్థాలేమిటి విజయా!"

"ఔను. పెళ్ళి అంటే నేనూ మనసులో మనసు కలిపే స్నేహితుడువస్తాడని, నన్నే తన సర్వంగా చూసుకుంటాడనీ అనుకున్నా. మీ సౌకర్యాలు అమర్చడానికి వచ్చిన అడ

దానిలాగ కాక ఒక స్నేహితురాలిగా, ఆత్మీయురాలిగా చేసుకోటానికి యెప్పుడైనా ప్రయత్నించారా ? రోడ్డుమీద పోయేయువతుల విలాసాలేకాని. భార్యలో ఉన్న అందచందాలు అర్థంచేసుకో చూశారా ? ఇట్లా నన్ను బాధించి తేలిక ఆకర్షణలు వెతుక్కుంటారని నేనూ అనుకోలేదు.

కేవలం తన ఆనందం. అనుభవాలే కావలసిన వాళ్ళకి పెళ్ళి యెందుకు ?

నిజమే. ఇదేంపెళ్ళి. అసలు నాకు పెళ్ళి అయినట్లే లేదు. భర్తని పొందినట్లే లేదు.

మీదారి మీది. నా బాధ నాది. నేను ఊహించుకున్న భర్తవేరు. తేలిక ఆకర్షణలకు చిత్తాన్ని రంజింపజేసుకునేటంత అల్పుడు కాడు. ఇప్పటికే నేను ఊహించలేని స్థితికి దిగి మాట్లాడుతున్నా-దీనికి కారణం మీరే. మిమ్మల్ని నేను సహించలేను మీకూ నాకూ సంబంధంలేదు. నేను త్వరలోనే వెళ్ళిపోతాను. దయచేసి అంతవరకూ నాజోలికి రాకండి" అని గబగబా మెట్లుదిగి వెళ్ళిపోయింది విజయ.

"పెళ్ళిలోఉన్నది సంకుచితత్వమా - స్వార్థరాహిత్యమా ?" అని ఆలోచిస్తున్న ప్రసాద్‌కి ఏమీపాలుపోలేదు.

"నాకు వంట్లో బాగుండలేదు. జ్వరం వచ్చినట్లుంది పిన్నీ. అన్నం తినను. ఇక్కడే పడుకుంటా"నని క్రిందికివెళ్ళిన విజయ సావిత్రిపక్కలో పడుకుని నిద్రపోయింది. పైకి వెళ్ళలేదు.

"కథ శృతిమించినట్లేఉంచే" అంది ఆవిడ సావిత్రితో.

"ఎవరి తప్పూ లేకపోయినా, పద్ధతులు కలవకపోతే వచ్చే బాధలే ఇవి" అంది సావిత్రి.

"ఇతనుమాత్రం-ఇక్కడ ఈ సరదాలే తప్ప. స్వంతచెల్లెళ్ళనైనా ఎప్పుడైనాసినిమాకైనా తీసుకువెడతాడో లేదో" పిన్నిగారు అంది.

"ఈ అమ్మాయి అట్లాంటిదికాదు. అసూయపడే మనిషికాదు. మనమేమవుతామని మనతో ఇట్లా కలిసిపోయింది? ప్రసాద్‌తో అంతచనువుగా ఉంటాము, ఏమీ అనుకోదు. మిశ్రా పెళ్లాం విషయమే ఈ అమ్మాయికి పడదు."

● ● ●

ఆ మరునాడుకూడా పైకి వెళ్ళలేదు విజయ. ప్రసాద్ క్రిందికివచ్చి పలకరిస్తే పెడసరంగా జవాబులిచ్చింది. అతడు ఒక నిట్టూర్పువిడిచి పైకివెళ్లాడు.

అతడు వెళ్ళిన్నాపదినిముషాలకి శ్రీమతి మిశ్రావచ్చింది. విజయని పలకరించి అక్కడే కూర్చుంది.

కూర్చున్నాక - "ప్రసాద్ ఇంట్లో ఉన్నాడా ?" అంది.

విజయ ఆవిడముఖంలోకే చూస్తూ,

"ఆ. పైనఉన్నాడు వెళ్ళండి" అంది.

"నీ కేమైనా పిచ్చిఎత్తిందా ?" అని విజయని గదిమి సావిత్రి మెట్లదగ్గరకువెళ్ళి,

"నీ కోసం మిశ్రా పెళ్ళాం వచ్చింది. రావయ్యా" అని ప్రసాద్‌ని పిలిచింది.

"ఇవేళ మా బంధువులు వచ్చారు. మేమంతా గార్డెన్స్‌కి వెడుతున్నాము. ఇంక మార్కెట్‌కి పోవడానికి టైమ్ ఉండదు. ఒక డజన్ సంత్రాలు. బ్రెడ్. ఒక బాటిల్ ఆరంజ్ స్క్వాష్ ప్రసాద్ తెచ్చిపెడతాడని."

"తప్పకుండా తెచ్చిపెడతాడు." అంది విజయ వస్తున్న భర్తని చూసి మాట్లాడే స్థాయి పెంచి. మళ్ళీ ఆ సంగతి అతడితో సావిత్రి చెప్పింది. ఆవిడ కూడా చెప్పింది.

ప్రసాద్ నవ్వుతూ,

"ఇవేళ మేముకూడా ఫోటోలు తీసుకోవాలని బయలుదేరుతున్నాము. ఎక్కడెక్కడ తిరిగి ఎప్పటికి వస్తామో. దయచేసి నామీద ఆధారపడకండి" అన్నాడు. ఆవిడ వెళ్ళిపోయింది.

"మీరు తప్పకుండా తెస్తారని చెప్పాను" అంది విజయ.

"ఒకమాటు పైకి రా. విజయా" అతనన్నాడు.

"ఏదైనా సరే ఇక్కడ మాట్లాడవచ్చు" విజయ అంది.

"అట్లాగ ఎందుకు చెప్పావు ? నాయిష్టం. తెస్తేతెస్తాను. లేకపోతే లేదు."

"మీ ఇష్టం నాకుతెలుసు. ఆవిడ అడగకుండా ఉండదు. మీరు తేకుండా ఉండలేరు. ఆవిడకి పరాయివాళ్ళని చుట్టూ తిప్పకోడానికి అభిమానంలేదు. తిరగడానికిమీకూలేదు. ఆవిడకి మొగుడు ఒక నౌకరు. అతడివెనక మీరూ."

ప్రసాద్‌కి అంత సహనం ఉందనుకోలేదు సావిత్రి. అతడు సూటిగా విజయ ముఖంలోకిచూస్తూ

"ఇప్పుడు చెప్పు. సరే. నేను నలుగురితో సరదాగా ఉండటం. ఎవరికీ సాయం చెయ్యటం నీ కిష్టంలేదు. నువ్వు చెప్పినట్లే చేస్తాను. ఇప్పుడు ఆ సామాన్లు తెచ్చి ఇవ్వమంటావా వద్దా ?" అని అడిగాడు.

విజయకూడా అతడినేచూస్తూ

"వద్దుఅంటే నా స్వార్థం. అసూయ. మీ పరోపకారబుద్ధి ఇంకొకమాటు ప్రదర్శితమవుతాయి. అంతేకదూ" అని గంభీరంగా "నేనూ నా మొగుడిని నౌకరులాగ చూసుకోలేను. ఇంకొకళ్ళు ఆ చులకన తీసుకుంటే నేను సహించలేను. ఇంతకూ అవి రోజు గడవని అత్యవసర వస్తువులేం కాదు - ఆవిడకు మీ మీద ఉన్న చనువు ప్రదర్శించటమేకాని. కాని, నేను నిర్ణయం చేయాల్సింది ఏమీ లేదు. తెచ్చినా మానుకున్నా మీ యిష్టం. మీకూ నాకూ సంబంధంలేదు." అని గబగబా పైకి వెళ్ళి గది తలుపులు వేసుకుంది. విజయతో ఏకాంతం దొరికి మూడు రోజులయింది. తను మేడమీద ఉంటే విజయ క్రింద. తను క్రిందఉంటే విజయ మేడమీద.

"వాళ్ళమ్మకి ఉత్తరం రాసినట్లుంది విజయ" అంది సావిత్రి.

"ఏమని రాసిందీ" పేలవంగా నవ్వుతూ అడిగాడు ప్రసాద్.

"వంట్లో బాగుండలేదని. వచ్చి తీసుకెళ్ళమనీ రాసిందిట" అంది సావిత్రి.

ఆ రోజు సాయంత్రం సినిమాకి వెళ్ళి వచ్చారు. విజయ, సావిత్రి. వచ్చేటప్పటికి వొళ్ళు బాగా వేడిగా ఉంది. భోజనం చెయ్యకుండానే సావిత్రి పక్కన పడుకుని నిద్రపోయింది విజయ.

● హోటల్ సర్వర్‌తో ఒకడు: "ఒక పెసరట్టు. ఉల్లిపాయ ముక్కలు వెయ్యకుండా."

సర్వరు పరధ్యానంగా లోపలికెళ్ళి తిరిగొచ్చి: "ఉల్లిపాయ లయిపోయాయిసార్. అల్లం ముక్కలు వెయ్యకుండా తీసుకురమ్మంటారా ?"

మరునాడంతా ఉంది జ్వరం రాత్రి సావిత్రిని పిలుచుకుని తన గదిలోకి వెళ్ళి పడుకుంది విజయ. నిద్రపోయింది. ప్రసాద్ వచ్చి మెల్లిగా పిలిచాడు. సావిత్రికి మెలకువ గానే ఉంది. బెడ్ లైట్ వెలుగుతోంది గదిలో. అతడువస్తే తలుపు తియ్యవద్దని చెప్పి పడుకుంది విజయ. కాపీ అతడు విజయకి భర్త. మెల్లగా తలుపుతీసి" నిద్ర పోతోంది. నువ్వువస్తే తలుపుతీయవద్దంది." అంది సన్నగా నవ్వుతూ.

ప్రసాద్ యెక్కువ చప్పుడు చెయ్యకుండా వెళ్ళి మంచం దగ్గరగా కుర్చీలో కూర్చున్నాడు.

తను గమనించలేదు ఇన్నాళ్ళూ. ఎంత చిక్కిపోయింది విజయ ! ఆ సుకుమారంగా అందంగా ఉన్న ముఖంలో ఏదో బాధ. బరువూ ఉన్నాయి. మూసుకున్న కను రెప్పలమీద దట్టమైన కనుబొమలు దిద్దినట్లు అందంగా ఉన్నాయి. పొడుగ్గా, నాజూకుగా ఉండే ఆముక్కుక్రింద సన్నగా గులాబి పెదవులూ - ఎందుకింత అందంగా కని పిస్తోంది విజయ.

ఆ పడుకున్న తీరుకూడా కోపగించి తనను దగ్గరకు రావద్దు అంటున్నట్టే ఉంది. విజయకి ఎందుకింత కోపం ? నిజంగా అంత బాధ పడుతోందా ?

ఈ జ్వరం అంతా మనోవ్యాధేనా ? విజయ బాధపడటానికి కారణం నాలో ఉందా !

''రెండు రోజులు జ్వరం. డాక్టరికి చూపించాలి" అన్నాడు ప్రసాద్.

''ఈ పిల్ల మనసులో చాలా బాధపడుతున్నట్లుందోయ్" అంది సావిత్రి.

''నా తప్పుఉందా ?'' అన్నాడు ప్రసాద్.

''తప్పు అనటానికేముంది. కొంతమంది ఎట్లాగపడితే అట్లా సర్దుకుపోతారు. కొంత మంది బాధపడుతూ మారతారు. కొంతమంది చచ్చినా మారలేరు. పల్లెటూరి వాళ్ళు సినిమా స్టార్లలాగ నిముషాలమీద వేషాలు మారుస్తుంటారు. చదువు సంస్కారంఉన్న వాళ్ళు సాధారణంగా సింపుల్‌గా, సంప్రదాయంమీద అభిమానంగా ఉంటారు. విజయ చదువుకోనిదా, ప్రపంచం తెలియనిదా ? నువ్వే కాస్త మారాలయ్యా....

మాటలకి విజయకి మెలకువ వచ్చింది.

''మీరెందుకు వచ్చారూ ?'' అంది సన్నగా.

మళ్ళీ నవ్వింది.

''మీకూ నాకూ సంబంధంలేదు. స్నేహితురాలిలాగ చూడటానికి వచ్చారా?" అంది.

''మాట్లాడక పడుకో" అని కసిరింది సావిత్రి.

''మరి నువ్వెందుకు రానిచ్చావూ. ఇతడు నా కేమీకాడు. నా గదిలోకి ఎందుకు రానిచ్చావూ. నా కెంత కోపంవస్తుందో తెలుసా. నన్ను ముట్టుకుంటాడని, ప్రేమ ఒలకబోస్తాడనీ గుర్తువస్తే గోదావరిలో దూకాలనిపిస్తోంది" అని సావిత్రిఒడిలో తలపెట్టుకుని, నవ్వుతూ,

"భలే పిక్చర్ చూశాంలే. పడవవాడిని ప్రేమించింది. అది అభిమానం అనుకుంటే బాగానేఉంది. కానీ అది ప్రేమగా పరిణమించింది. మనసులో మూగగాఉంది. ఎట్లా ప్రేమించిందో ! ప్రేమ ఉంది కనుక దంపతుల్ని చెయ్యాలి. ఈ జన్మలో వాడిని పెళ్ళిచేసుకోటానికి అంతస్తు అడ్డు. అందు కని ఈ జన్మలో కలపకుండా చంపేసి. వచ్చేజన్మలో ఇద్దరినీ సమానంగా పుట్టించి పెళ్ళిచేసేశాడు. ఏం బ్రహ్మాండంగావుంది. రాసినవాడి బ్రెయిన్ సామాన్యమయింది కాదు. ప్రేమ, దాంపత్యం, జన్మజన్మగత మయిన అనుబంధం ఈ మూడింటికీ ముడి ఎక్కడ !

పాపం - ఈ జన్మలో వాడిని, సాటి వాణ్ణి మనసారా ప్రేమించిన పిల్లకి రెండో జన్మకూడా లేదు. దానిప్రేమ, దాని దుఃఖం అన్నీ కూడా దానితోటే పూర్తి అయ్యాయి. నేనుకూడా గొరినే" అని ప్రసాద్‌నేపు కళ్ళతిప్పి.

"నీ అమ్మాయిగోరు ఇంకా ఈజన్మలో నీకు దొరకలేదు. పాపం వెళ్లు. కలకత్తా రోడ్లమీద స్లీవ్‌లెస్ బ్లౌజ్ వేసుకుని, లిప్ స్టిక్ పూసుకుని, నెత్తిమీద చుట్టయెత్తుకుని నీకోసం ఎతుకుతూ ఉంటుంది. ఎక్కడుందో ఎల్లి సూసుకో. ఎతుక్కో" అంది.

సావిత్రికి నవ్వు వచ్చేసింది. ఆపుకుంటూ

"ఏమిటా అల్లరి విజయా ?" అంది.

"అల్లరా? నీకు అల్లరిలాగ కనిపిస్తోందా? నాకు అల్లరిచెయ్యటం, ఎవరినీ ఆడించటం చాతకాదు. దయచేసి అతడిని ఇంక అవతలికి వెళ్ళమని చెప్పు. నాలుగురోజులు మాత్రమే నేనీ గదిలో ఉండేది" అంది విజయ.

ఆ మరునాడు విజయ తల్లీ, తండ్రీ వచ్చారు. తల్లి సలహాపైన సావిత్రి కబురు చెయ్యగా, లేడీడాక్టరు వచ్చింది.

''అమ్మాయికి రెండు నెలలు నిండాయి" అంది.

సావిత్రి, విజయ తల్లీ నవ్వుతున్నారు.

''ఎంత అడిగినా చెప్పింది కాదు. నేను అప్పుడే అనుకున్నా'' అంది విజయ తల్లి.

''నువ్వు తండ్రివి కాబోతున్నావయ్యా. ఏం హడావిడి చేసిందీ'' అంది పిన్నిగారు ఆశ్చర్యం, సంతోషం కలిపి ప్రసాద్‌తో.

''తల్లి కాబోతుంటే ఇంత హడావిడి చేస్తారా ?'' అన్నాడు ప్రసాద్.

తల్లీ, తండ్రి వచ్చాక చాలా ప్రశాంతంగా ఉంది విజయకి. డాక్టర్ వెళ్ళగానే మిశ్రా భార్య వచ్చింది. దగ్గరగా ఉన్న కుర్చీలో కూర్చుని.

''ఎట్లా ఉంది మీ ఆవిడకి ?'' అంది.

ఆవిడ చేతులమీద, మెడమీద చూపుల్ని సంక్రమింప జేయటానికి బదులు, స్థిరంగా ఆవిడ ముఖంలోకి చూస్తూ.

''విజయకి రెస్టుకావాలని చెప్పింది డాక్టర్. తల్లికాబోతున్నది" అని చెప్పాడు ప్రసాద్.

● *ఇరవయ్యేళ్ళ యువకవితో పత్రికా సంపాదకుడు :*

''ఈ పద్యాలు మీరు రాసినవేనా ?"

''అవునండి. అవిపూర్తిగా నేనురాసినవేనండి.''

"నమస్కారం రాయప్రోలు సుబ్బారావుగారూ ! మీకు డభ్భయ్యేళ్లు దాటాయని ఎవరో అబద్ధంచెప్పారు నాతో.''

శ్రీమతి మిత్రా కంగ్రాచ్యులేట్ చేసి ఎక్కువ సేపు కూర్చోకుండానే వెళ్ళిపోయింది. విజయకి ఆశ్చర్యంగా ఉంది ప్రసాద్ ప్రవర్తన. భర్తమీద, ఆవిడమీద కూడా జాలిపుట్టుకువచ్చింది.

"ఆవిడని అట్లా పంపించేశావు ఏమీ అనుకోదూ" అంది.

"ఆవిడ అనుకోవటంకంటే, నాకు నువ్వు ఏమనుకునేదే ముఖ్యం విజయా" అన్నాడు ప్రసాద్.

విజయ అంతరాంతరాల్లో ఒక స్పందనం కలిగి సన్నని ఆనందపుకెరటం వీచింది.

"నువ్వు ఇప్పుడే వెళ్ళిపోతావా? అన్నాళ్లు ఉండగలవా?" అని అడిగాడు.

విజయ గంభీరంగా

"మీరు నావారు-నా సర్వస్వం అనుకుంటే ఈ మమకారాలు-అసూయలూ కానీ మీరు నాకేమీ కారనుకుంటే బాధ ఏముందీ; నాకు అసలు పెళ్ళేకాలేదనుకుంటాను" అంది.

"నువ్వు అనుకోగలవేమో కానీ నేననుకోలేను. ప్రేమ అంటావు ఇదేనా?"

"ప్రేమకాదు. భార్యని అభిమానించటం నేర్చుకోండి. హెన్‌పెక్‌డ్ అంటారేమోనని భయపడాల్సినంత మూర్ఖురాలిని-స్వార్థపరురాలిని మాత్రం నేనుకాదు." అంది విజయ.

• • •

విజయకి కూతురు పుట్టినప్పుడే ప్రసాద్‌కి ఆంధ్రాకి ట్రాన్స్‌ఫరయింది. విజయ మళ్ళీ కలకత్తా వెళ్ళలేదు.

పిల్లకిప్పుడు రెండేళ్ళు. ఆ ఊళ్ళో ప్రసాద్‌కి మంచిపేరు, పలుకుబడిఉన్నాయి. ఇప్పుడు విజయ పేరు, పలుకుబడి వున్న వ్యక్తి అందరిలోకీ అందగత్తె, మంచి సరదాలున్న మనిషి.

కానీ ప్రసాద్ చాలా మారిపోయాడు.

"ఇవేళ నా స్నేహితురాలు విమల ఊరినుంచి వచ్చింది. భోజనానికి పిలిచాను. ఇంకో ఇద్దరు ఫ్రెండ్స్‌ని భోజనానికి పిలిచాను. మీరు కూడా ఇంట్లో ఉండండి" అంటుంది విజయ,

"మీ ఆడవాళ్ళు సరదాగా కాలక్షేపం చేసుకోండి. నేను రావాలంటే వాళ్ళందరినీ పెళ్ళిచేసుకుని శ్రీయుతులతో సహా రమ్మను. అయినా నాకు కాలక్షేపానికి ఏం తక్కువ? ఆఫీసు, సాయంత్రం క్లబ్. చల్లని ఏకాంత వేళల్లో నీవు-ఉండగా నాకింకేం కావాలి!" అంటాడు.

విజయ మనసు సంతృప్తితో నిండిపోతుంది. గర్వంతో ఆమె ముఖం యింకా అందాల్ని చేకూర్చుకుంటుంది.

ప్రసాద్ ఎందుకిట్లా మారిపోయాడు! కారణం ఏమిటి? అనుకుంటుంది

తనమూలంగా మారాడా? స్థలం మార్పు వలన మారాడా? కలకత్తా జీవితంగుర్తువస్తే

"అట్లాగ పిచ్చియెత్తిపోయిన విజయని నేనేనా?"

అని ప్రశ్నించుకుంటుంది.

అతడు ఎందుకట్లాగ ప్రవర్తించేవాడు? చిన్నతనమేమో! ఒక వ్యక్తిమీద అభిమానం కుదిరేదాకా అంతా అట్లాగే ప్రవర్తిస్తారేమో! అనుకుంటుంది. ఈ సమస్య గురించి ఆలోచిస్తూనే ఉంటుంది. సమాధానం రాదుకానీ, ఇప్పటి ప్రసాద్‌ని తలుచుకుంటేమాత్రం విజయ మనసునిండా తృప్తే. □□□



జంట స్వరాలు

ఆమధ్యనే ఒక అమాయక చక్రవర్తి నన్నడిగిన ప్రశ్నారాజమేమంటే, "సాహిత్య సమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారికి, సంగీత సమ్రాట్ శ్రీ విశ్వనాథ రామ్మూర్తి ఏమౌతాడూ?" అని. తెలియనివారు "విశ్వనాథ రామ్మూర్తి" అన్న పేరు వినగానే విశ్వనాథ అనేది యింటి పేరనీ, రామ్మూర్తి వ్యక్తిపేరనీ అనుకోవడం నూటికి నూరుపాళ్ళు సంభవం. సరిబు, ఈ ఒకేపేరులో ఇద్దరు విశిష్టవ్యక్తులు ఇమిడివున్నారని తెలియగానే, ఆ తెలియని వారు తెల్లపోవటంకూడా సహజం. ఇలాటి సంగీతపు జంటలు ఉత్తరాదిని "శంకర్-జైకిషన్ల"తో ప్రారంభమయ్యాయి. దక్షిణాదిని "విశ్రామ్" - విశ్వనాథం రామ్మూర్తి గారలతో ప్రారంభమయ్యాయి. కవకనే వీరిరువురినీ, రసికులు దక్షిణాది శంకర్ జైకిషన్లని అనడం పరిపాటిఐపోయింది. అనతికాలంలోనే శంకర్-జైకిషన్లకు "ఉత్తరాది విశ్వనాథన్ రామ్మూర్తు"లనిరసికులు పేరిడినా మనం ఆశ్చర్యపోనవసరం లేదు. అంతటి ప్రతిభావంతులీ దక్షిణభారత సంగీతపు కవలలు.

వీరి సంగీతంలో పాలపొంగులా పొంగే నవయౌవనం ఉరకలేస్తూ వుంటుంది. బాణీలలో నిత్య నూతనమైన దోరణులూ, సరళ తరళ సరసులూ ధ్వనిస్తూవుంటాయి. వాద్య ప్రయోగాలలో వీరికి వీరే సాటి. ముఖ్యంగా, గిటార్, వయొలిన్స్, అకార్డియన్, బోంగోస్ వగైరా పాశ్చాత్య వాద్యాలను అచ్చంగా అప్రాచ్యసంప్రదాయంలో, అర్వాచీన పద్ధతిలో అత్యంతాకర్షణీయంగా అమర్చగలిగే వైదగ్ధ్యం, అపూర్వాధిక్యం గల అనంతశక్తి సంపన్నులు. వీరు కుదిర్చే ఈ బ్యాక్‌గ్రౌండు బిట్సు ఎంతమజాగా వుంటాయంటే రసజ్ఞులేకాక రసాజ్ఞులు సైతం కూనరాగం తీసేటప్పుడు గూడా తరుచూ, పాటలతోపాటు ఈ పీసెస్‌కూడా అనుకోనిదే "పీస్" (శాంతి) పొందలేరు.

ఒకపాట రికార్డుచేసేలోపున వీరుపడే తాపత్రయం ఇంతా అంతాకాదు. ఒకేపల్లవిని అనేకరాగాలలో రకరకాలుగా రూపొందించి, వాటన్నిటినీ వడియగట్టి, ఒక్కచక్కనిమట్టు సెలెక్టు చేసుకుంటారు. దానికి చిలవలూ పలవలూ చేర్చి, అనుపల్లవి, అమర్చి, చరణాలనే ఆభరణాలను కూర్చి

పి. బి. శ్రీనివాస్

అలంకరించి, సర్వాంగ సుందరి అనదగిన గీతికారత్నాన్ని సృష్టిస్తారు.

పాట రికార్డింగు ముగిసే పర్యంతం "ఇలా చేద్దామా? అలా మారుద్దామా? ఇంకా ఏ తొడుగులు తొడుగుదాం, ఏం మెరుగులు దిద్దుదాం" అనే ఆలోచనలతో అలసట పడుతూనే వుంటారు. వీరి ఈ ఏకాగ్రత, విశ్రామ మెరుగని పరిశ్రమ, అనుక్షణం మారే ప్రజాసామాన్యపుటభిరుచుల అంతరాల అధ్యయనం, ప్రత్యేకంగా గ్రహించవలసిన విషయాలు, అభినందించవలసిన అంశాలు.

బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్కి, రీ రికార్డింగుకి వీరు వాయిద్యాలని పెద్ద సంఖ్యలో ఉపయోగిస్తారు. డెప్తుకోసమనీ, వెయిట్ కోసమనీ, వయొలిన్స్ కూడా చాలా ప్రయోగిస్తారు. నిజమేమరి!

ప్రొడ్యూసర్‌గారు ఇన్‌స్ట్రుమెంట్సు తగ్గించి, అయిదారు వాయులీనాలతోనే, సర్దుకొమ్మని చెప్పి, మ్యూజిక్ డైరెక్టర్లని "సింఫొనీ" ఎఫెక్టు తెప్పించమని కోరితే యెలా వుంటుంది? బ్యాక్‌గ్రౌండ్లు యెక్కడో నూతిలోంచో గోతిలోంచో వస్తున్నట్లు వినిపిస్తాయి. కావుననే, వీరు అవసరమని తోచినప్పుడు అరవై వాయిద్యాలయినా సరే వాడడానికి వెనుదీయరు. సన్నివేశానికి యెక్కువ వాద్యాలు అనవసరమనిపిస్తే, అయిదింటితోనే అందమైన ఫలితం తెచ్చుకుంటారు. ఏమైనా అనుకున్న ఎఫెక్టు వచ్చేవరకూ విశ్రమించరు. నిద్రపోనీయరు.

రికార్డింగు సమయాన పెద్దచిన్నలన్న విషయమే పట్టించుకోరు. ఓరోజున శ్రీ విశ్వనాథన్ పియానో వాయిస్తూ రీరికార్డింగు బిట్టొకటి కంపోజ్ చేస్తున్నారు. తటాలున తటిత్తులా మెరిసిందొక భవ్యమైన భావన. ఆ సంతోషంతో లీనులై పియానో మెట్లపై అంగుళులను నర్తింపజేస్తూనే, కొన్నిగజాల దూరంలో సోఫామీద ఆసీనులై వున్న నిర్మాత నుద్దేశించి, కళ్ళు చికిలించి, పసిపిల్లాడిని, తాయిలం పెడతానని ఆశచూపి రమ్మని పిలిచేపోజులో, చూపుడు వేలు వూపుతూ ఆ నైస్‌పీస్ వినమని ఆహ్వానించారు. అయినా ఆ ఘన నిర్మాత తప్పుగా యెంచలేదు. వీరి కార్యతత్పరత గురుతెరిగిన వారగుటచేత. పనిలో నిమగ్నులయిన సమయాన, పాటపై మాత్రమే వీరి ధ్యానం సర్వం కేంద్రీకృతమైవుంటుంది. ఆ తరుణంలో వీరిని పలకరించి ప్రత్యుత్తర మందజాలక, వీరి పరధ్యానాన్ని మరో ప్రకారంగా అర్థంచేసుకుని, అవమానింపబడినంతగా బాధపడిన వారనేకులున్నారు. కాని, వీరి తత్త్వమెరిగిన వారెవరూ, వీరినట్టితరిని పలకరించరు. పలకరించినా, జవాబునెదురుచూడరు.

మరోనాడు మరో రిహార్సలు సందర్భంలో వీరు శ్రీ వాలి (ఆర్టుడైరెక్టరు కాదు–అరవ కవి) వ్రాసిన గీతానికొకదానికి వరస కుదర్చడానికి కూర్చున్నారు. ప్రథమంలోనే వీరి కెదురైన పజిలు– పాట కే తాళం వేద్దామా అన్నది. ఇంతలో ఆనాడు శ్రీరాముడికి సాగర సేతుబంధనం సందర్భంలో స్వశక్త్యానుసారం సహాయంచేసిన ఉడతే–నేడు వీరికి తాళమార్గం చూపింది. పక్కింటి గోడమీంచి తొంగిచూస్తున్న వేప వృక్షం శాఖమీంచి, వీరు రిహార్సలు చేస్తున్న పైఅంతస్తులోని కొళాయి తాలూకు పిట్ట గోడపైకురికి! గంతులేస్తూ, తాళబద్ధంగా, కిచకిచలాడసాగింది. ఆ కిచకిచలు చతురశ్రగతిలో సాగుతూండడం గమనించి, వీరదే తాళంలో వరస సమకూర్చడంతో, ఆ గీతాన్ని మరేతాళంలో చేసినా, చతుర



జంట స్వరకర్తలతో కంఠస్వరకర్త.

శ్రంలో కుదిరినంత బాగా కుదరడం కుదరదన్నంత బాగా కుదిరింది. ఈసంభవం అసంభవం, ఊహాకల్పితం, అనిపించిన వారికి చెప్పుకోగలిగింది – నేను "నేత్రకర్ణ సాక్షి" నన్న విషయం మాత్రమే. ఈ విధంగా, ప్రకృతిలోని ప్రతిధ్వని "ప్రతిధ్వనీ" విని, ఉత్తేజితులై, ఉత్సాహంతో ఉపయోగకరమని తోచిన వాటినన్నిటినీ ఉపయోగించుకుంటారు. ఈ విచిత్రధ్వనుల ననుకరించడంలో ప్రవీణుడైన "సదన్" అనబడే కేరళ యువకుడు, వీరికి చేదోడు వాదోడుగా సహాయపడుతూవుంటాడు. "ప్రాయశ్చిత్తం" చిత్రంలో "పోతేపోనీ పోరా" వంటిగీతాల్లో మనకు వినిపించిన పక్షుల కిలకిలలూ, కప్పల బెకబెకలూ, నక్క అరుపులూ, కుక్క కూతలూ గుడ్లగూబల గుబగుబలూ–ఆజాతుల ఖగమృగాల తాలూకువి కావు. ఈ వెంట్రిలోక్విస్టు వాయిస్ వెలువరించిన వెరైటీలే. కొత్త కొత్త రిథింస్ ప్రయోగించడాని కుపయోగపడే మరో లయబ్రహ్మ "మురుగేశ్." వెదురుబొంగుల్లోంచీ, కొబ్బరిచిప్పల్లోంచీ వండ్రఫుల్ సౌండ్సు ప్రొడ్యూస్ చేయగలిగే ఈ మేధావి ముక్కు సొన్నాయి వాయించడంలో మొనగాడు. కాని, ఎవరిలో ఎంత స్తోమతవుంటే నేమిఫలం?

ఆర్టిస్టులనుండీ, ఆర్కెస్ట్రానుండీ పిండి తనితీసుకోగలిగిన శక్తి సంగీత దర్శకుడి కున్నప్పుడే ప్రయోజనం! అట్టి అరుదైన శక్తి బడసిన గట్టిదిట్టలౌటచేతనే వీరి కంపోజిషన్లకింతటి హైపొజిషన్!

తమ పాటలలో ఏ పాట ఎవరిచేత పాడించాలో ముందుగా నిర్ణయించుకునే మట్టుకడతారు. ఆ పాట ఆ పాటకులు పాడితేనే తృప్తిపడతారు. "కాచుకున్నన్నులు" అనే తమిళచిత్రంలో "తుళ్ళిత్తిరింద పెణ్ణొన్ను" అనే పాటకి నా చేత బాగా రిహార్సుచేయించారు. రెండుసార్లు రికార్డింగు కెళ్ళాం. రెండుసార్లూ పరిస్థితులు కలిసిరాక తిరిగొచ్చేశాం. ఇంతలో నాకు మోడరన్ థియేటర్సునుంచి పిలుపువచ్చేసరికి. నేను సేలం వెళ్లాను. ఈలోపున ఈ తమిళచిత్ర నిర్మాతలకు వివిధ కేంద్రాలనుండి వొత్తిడి వచ్చిపడింది. వారు వీరితో మరో ఆర్టిస్టుచేత ఆ పాట పాడించమని కోరారు. అలస్యాత్ అమృతం విషంఅని. కాని. వీరు వారితో_ "ఈ పాటకి, మనం నిర్ణయించుకున్న గాయకుడు పాడితేనే. పూర్తి న్యాయం చేకూరుతుంది. మీకు మరీ అవసరమైతే మరొకరిచే పాడించడానికి మా కభ్యంతరంలేదు_కాని. ఆ మరొకరి గాత్ర ధర్మాని కనువుగా 'ఇదే గీతానికి వేరే వరసకట్టవలసిందే" అని మృదువుగా వాదించారు. అయితే-నిర్మాతల కా ట్యూను బాగా పట్టేసింది. కనక "కాచుకున్న కన్నుల" నిర్మాతలు నేను పూరినుంచి వచ్చేవరకూ కాచుకూచున్నారు. శ్రీ "విశ్వం" విశదీకరించిన విధాననే నిర్మాతలకు పూర్తి సంతృప్తి లభించింది. నావల్ల ఇలా చాలాసార్లుఇబ్బందిపడ్డా ఎంతో అభిమానంచూపే ఈ జంటకు నా జోహార్లు! ప్రోగ్రాములకని పైవూళ్ళకు వెళ్ళవలసిన సందర్భాలలో తాము నాకొరకు పడే యిడుములను తలుచుకుని. మిత్రులతో వీరు తరుచూ అంటూవుంటారు_ "శీనుఅన్న"తో పూరిప్రయాణం పెట్టుకుంటే బలేతంటా. చంటిపిల్లాడన్నా నయం మన శీను అన్న కన్న" అని. "శీను అన్న" అంటే నా అన్న అనుకునేరు. నన్నే వీరు "శీనుఅన్న" అని సరదాగా సంబోధిస్తారు.

1928 ప్రాంతంలో పాల్‌ఘాట్ జిల్లాలోని "ఎలపుళ్ళి" గ్రామంలో శ్రీ విశ్వనాథ అవతరించారీ విశ్వంలో.

వీరి జనకులు శ్రీ సుబ్రహ్మణ్యం నాయర్. చిన్నతనంలోనే తండ్రి చనిపోయారు. అప్పటికి విశ్వం వయస్సు రెండున్నర సంవత్సరాలు. విద్యాభ్యాసం అయిదవ తరగతివరకూ, ఆరేళ్ళ ప్రాయం వరకూ మాత్రమే సాగింది. చాలా బీద కుటుంబం కావడంవల్ల, సంగీతం యింట లేకున్నా వీరికి వంటబట్టింది. సౌత్ మలబారులోని కన్ననూరులో శ్రీ నీలకంఠ భాగవతార్‌గారి సంగీత పాఠశాలలో నౌకరు కుర్రాడుగా కుదిరారు. జీతం రెండు రూపాయలు. అయినా. అప్పటి రెండురూకలిప్పటి రెండువందలకు సమానమైన కొనుగోలు విలువకలవిగనక, వాటితోనే పొదుపుగా కాలంగడిపేవారు. ఈ సంగీత కళాశాలలో వుంటూనే. నీలకంఠంగారికి ఏకలవ్య శిష్యరికం జరిపారు విశ్వనాధన్. ఒక ఏడాదిపాటు. గురువుగారికి తెలియకుండానే. వారు విద్యార్థులకు పాఠాలు చెబుతున్నప్పుడు విన్నదంతా క్షుణ్ణంగా మనములోనే మననం చేసుకుని, రోజూ తెలవారక మునుపే లేచి స్నానపానాదులు కావించి. విభూతి పిండి కట్లు దాలిచి. మూర్తీభవించిన శివకుమారుడిలా ముద్దుగా హార్మోనియం ముందుకూర్చుని. నాలుగున్నరనుండి ఏడు గంటలదాకా శ్రద్ధతో సాధకం చేసేవారు. ఇలా సాధకంచేస్తూ ఓ రోజున గురువుగారి కంటపడ్డారు తలవని తలంపుగా. నీలకంఠు లీ గానచౌర్యాన్ని మొదట నిరసించినా. పిదప బాలుడి ఆసక్తినీ సామర్థ్యాన్ని

గుర్తించి. జాలిగొని విశ్వం తల్లితో, తనే ఈ చిన్నవాడికి స్వయంగా. జీతం భత్యం లేకుండా సంగీతం నేర్పుతానని చెప్పి. తన వద్దే వుంచుకుని కన్నబిడ్డగా. గారాబంగా పెంచారు మూడేళ్ళ పర్యంతం. ఇంతలో వారు జైలుగాలిపీల్చవలసివచ్చింది. అక్కడవారు వేయించేడ్రామాలలో, లోహితాస్యుడు వగైరా పాత్రలు ధరించేవారు విశ్వం. ఈ నాటకానుభవం వీరిలో సినీమాలలో కూడా నటించాలనే ఆశను రేకెత్తించింది. పదకొండేళ్ల ప్రాయంలోనే 1939 ప్రాంతంలో చెన్నపురి చేరారు. పాటకిగాని. నటనకిగాని అవకాశంకోసం కంపెనీనుంచి కంపెనీకి గంపెడాసతో తిరిగారు. కాని ఫలితం శూన్యం. ఏ అవకాశమూ ;లభించలేదు. నిరాశానిర్జితులై. క్రౌన్‌టాకీస్‌వద్ద టీషాప్‌లో చేరారు. అప్పుడా థియేటరులో "చింతామణి" ఆడుతూంది. మొదటిసారి చూడగానే పాటలన్నీ నచ్చిపోయాయి. కనక, రోజూ ఆ పిక్చరు చూస్తూ పాటలు విని నేర్చుకోవడానికని థియేటరు లోపల గారెలూ, బూరెలూ, బజ్జీలూ, వడలూ తట్టలోపెట్టుకుని అమ్మే బుల్లిఉద్యోగం సంపాదించి సాగించారు కొన్నాళ్ళు.

ఇలాఉంటూవుండగా. వీరి మేనమామగారు తన మేనల్లుణ్ణి తిరుప్పూరులో ఒక స్నేహితుడి వివాహానికి తీసుకెళ్లారు. అక్కడ జూపిటర్ సోముగారికి వీరు వప్పజెప్పబడ్డారు. సోముతో తిరిగి మద్రాసు వచ్చారు. జూపిటర్‌వారి "కణ్ణకి" చిత్రంలో. బాలసుబ్రహ్మణ్యేశ్వరుని అవతారం దాల్చారు. పిదప శ్రీ ఎస్. వి. వెంకట్రామన్‌గారి పార్టీలో హెల్పర్ బాయ్‌గానూ, కోరస్ సింగర్‌గానూ, బాల నటునిగానూ వ్యవహరిస్తూ, కుబేర కుచేల. మహామాయ, జెమినీ హరిశ్చంద్ర. మంగమ్మ శపథం వంటి చిత్రాల్లో అనామకపాత్రలు ధరించి. తన నటనకు సదవకాశం అచట దొరకదని తలచి. తిరుచ్చివెళ్ళి శ్రీ టి. ఎస్. బాలయ్యగారి డ్రామాకంపెనీలో కుదిరి. మనోహర, అభిమన్యు నాటకాలలో నాయకునిపాత్ర ధరించి నటించారు.

పదిహేనోయేట గొంతు బొంగురు పోయేసరికి. అదే కంపెనీలో సంగీత దర్శకుడయ్యారు. శ్రీ తంజై రామయ్యాదాస్ వీరికి గీతాలు రాసి యిచ్చేవారు. ఆ కంపెనీ డిజాల్వుకాగానే తన మొదటి యజమాని అయిన శ్రీ సోమసుందరం వద్ద తిరిగి చేరారు కోయంబత్తూరులో. వాల్మీకి. రాజకుమారి. మోహిని. కన్నియిన్ కాదలి. మొదలైన చిత్రాలు శ్రీ సోము సెంట్రల్ స్టూడియో లీజు తీసుకుని తీసినవి. వాటికి శ్రీ ఎస్. ఎం సుబ్బయ్య నాయుడు సంగీత దర్శకులు. శ్రీ నాయుడికి ఎసిస్టెంటుగా కుదిరారు విశ్వం. ఆ సమయంలోనే శ్రీ సి. ఆర్. సుబ్బరామన్ వేలైక్కారి చిత్రానికి సెంట్రల్ స్టూడియోలో బుక్కయ్యారు. తిరిగివారికి సహాయకులుగా నియుక్తులయ్యారు విశ్వం. అప్పుడే వీరి భావి భాగస్థులైన శ్రీరామ్మూర్తి వయొలిన్ వాయించడానికి వచ్చారా పిక్చర్‌కి. ఇద్దరిమధ్యా మైత్రి పల్లవించి. పుష్పించి. చివరికి ఫలించింది క్రమంగా. ఇరువురూ శ్రీ సుబ్బరామన్ వద్ద పనిచేశారు చాలాకాలం ధర్మదేవత, ప్రేమ. మర్మయోగి (పాతది). రాణి. లక్ష్మమ్మ కథ. స్త్రీ సాహసం. శాంతి. దేవదాస్ వగైరా అనేక చిత్రాలకు. "దేవదాస్"లోని "జగమేమాయా" వీరి కంపోజిషనే. "చండీరాణీ" (భరణీ వారిది)లో సుబ్బరామన్ ఒకే ఒక పాట చేశారట. మిగతా అన్నీ వీరే చేశారుట. శ్రీ సుబ్బరామన్ నిర్యాణం అనంతరం. సగం మిగిలిన చిత్రాలు వీరే పూర్తి చేశారు.

వీరిని స్వయంగా సంగీత దర్శకత్వం చేయడానికి పురికొలిపి ప్రోత్సహించిన మహాశయులు శ్రీ ఎస్. ఎం. రాజా అనే మిత్రులు. ఆయనే వీరిని "చంద్ర"పిక్చర్సు వారికి రికమెండ్ చేసి "జినోవా" చిత్రానికి సంగీత సారథ్యం యిప్పించారు. ఆ చిత్రమే వీరి తదుపరి ఘన విజయాలకి నాంది.

● ● ●

శ్రీ రామ్మూర్తి వయొలిన్ వాద్యవిద్యలో పారంగతులైన విద్వాంసులు. "వీరి ఒక్క వయొలిన్ పది వయొలిన్లపెట్టు" అని వీరికి అనేకమంది "ట్రిబ్యూట్" యిచ్చారు. ఆర్కెస్ట్రాలో వీరు వాయించేప్పుడు, వీరి ఫిడేలునాదం, మిగిలినవాటి నాదాన్ని మింగే సేటంత ప్రత్యేకంగా వినిపిస్తుంది. మంచి స్వరజ్ఞానం సాంకేతిక పరిజ్ఞానంకల విజ్ఞులు. శ్రీ విశ్వనాథం చేస్తూన్న వరసని హార్మోనీ మీద వాయిస్తూ పాడుతూవున్నదల్లా చకచకా స్వరపరచి, వీరు పేపురికార్డరులా రికార్డు చేసేస్తారు. అంతే ! అది యిహ శిలాక్షరమే. ఎవరు మరిచిపోయినా పరవాలేదు. అడిగిన వెంటనే రిప్రొడ్యూస్ చేసెయ్యగలరు అర సెకండయినా ఆలోచింకుండా, అలస్యం చేయకుండా. పాశ్చాత్య బాణీలనవలీలగా వాయించగలరు, ఎంతటి విషమ స్వరాలతో స్కేల్ ఛేంజిలతో కూడినవయినా. ఈ పాశ్చాత్య సంగీతాధ్యయనంలోకూడా యిరువురూ ఘటికులే. ఊపిరిపీల్చుకోడాని క్కూడా వీలుదొరకని కార్యక్రమంతో ఉక్కిరిబిక్కిరవుతున్నా, కొంతైనా సమయాన్ని దొంగిలించి, సందుదొరికినపుడల్లా సంగీతాధ్యయనం సాధనాచేస్తూనే వుంటారీ కవలలు. ఇదే వీరి సంతత విజయపరంపరలకు హేతువు. ఆటంకాల నన్నింటినీ దాటించే సేతువు, సత్తువ కలగజేసే ధాతువు.

శ్రీ రామ్మూర్తి తనపనేమిటో - తన సాధకం ఏమిటో, ఇతర గొడవలేవీ పట్టించుకోరు. ఎవరితోనైనా, ఏవైనా చిన్న చిన్న గొడవలు పొరపాటున వచ్చినా, సర్దుకుపోగలిగే శాంత స్వభావులు, సహన సంపన్నులు. కొన్ని గుణగణాలలో వీరిరువురూ ఉత్తర దక్షిణధ్రువాలు ఇద్దరికీ సామాన్యంగాగలశక్తి దైవభక్తి ఒకరు ఒకదేవుడికి తల నీలాలు సమర్పించుకుంటే మరొకరు మరో దేవుడి మొక్కుకని దాడీ దృఢంగా పెంచుతారు. కలియుగ ప్రత్యక్ష దైవాలనబడే శ్రీ తిరుమల శ్రీనివాస, పళనివాసు లిరువురికీ ఈ ఇరువురూ దాసులు.

శ్రీ టి. కె. ఆర్. తిరుచ్చిలో 1922 లో మే 18 వ తేదీన శ్రీ కృష్ణస్వామిగారి పుత్రులై జన్మించారు. తండ్రి పేరుపొందిన వయొలిన్ విద్వాంసులయి వుండడం చేత వీరు మరో గురువువద్ద నేర్చుకోవలసిన ఆగత్యం ఏర్పడలేదు. చదువు 8వ తరగతితో సమాప్తి.

1939 లో వీరి జనకులు తన తనయుని తోడ్కొని చెన్నపురి చేరారు. జనకుడూ తనయుడూ ప్రథమంగా ఫిలింఫీల్డులో వాయుతీనం వాయించినది "కృష్ణన్‌తూతు" అనే పౌరాణిక చిత్రంలో "ఉలగ మెలాం ఉనదరుళాలే" అనే గీతానికి. ఆనాటి ఈపాట పాడినవారెవరంటే - ఇటీవలే స్వర్గస్థురాలైన శ్రీమతి పసుపులేటి కన్నాంబ.

ఇలా కొన్నాళ్ళు, ఫిలిం గీతాలకు వయొలిన్ వాయించి, శ్రీ రామ్మూర్తి 1939 సంవత్సరాంతంలో హెచ్. ఎం వి. గ్రామఫోను కంపెనీలో వయొలినిస్టుగా కుదిరారు. అప్పటికే శ్రీ సి. ఆర్. సుబ్బరామన్ అక్కడ హార్మోనిస్టు. ఒక సంవత్సరం

అనంతరం, ఒక సంవత్సరం పర్యంతం రామ్మూర్తి, హెచ్. ఎం. వి. ని వదిలి "కొలంబియా"లో పనిచేసి, తిరిగి హెచ్. ఎం. వి. లో 1943 లో చేరారు. 1946 లో శ్రీ సుబ్బరామన్ వదలివవిదపగూడా మరి రెండేళ్ళు రామ్మూర్తి అక్కడే పనిచేశారు. 1948 లో దానికి ఇతిశ్రీ చెప్పి, 1949 లో సుబ్బరామన్ పార్టీలో చేరారు.

నేడు విశ్వ విఖ్యాతులైన శ్రీ విశ్వనాథన్ రామ్మూర్తులను, ఆదిలో ఆదరించి, నాడు నీడ నొసగిన కల్పద్రుమమీ సుబ్బరామన్ గారే. గురువును మించిన శిష్యులై, వీరిరువురూ వారి పేరు నిలబెట్టారు.

శ్రీ "విశ్రామ్" "ప్రథమంగా" స్వతంత్రంగా కలిసిపనిచేసిన చిత్రం శ్రీ ఎన్. ఎస్. కృష్ణన్ నిర్మించిన తమిళ "పణం" (డబ్బు) పణంతో ప్రారంభిస్తే ఏపని మాత్రం నిర్విఘ్నంగా కొనసాగదు ? పిమ్మట పలు భాషలలో పెక్కు చిత్రాలకు లెక్కలేనన్ని పాట లందించిందీ జంట. తమిళంలో వీరికి కవికుల తిలకమనదగిన శ్రీ కణ్ణదాసన్‌గారి కమనీయమైన కవిత్వం కూడా తోడై నిలిచే సరికిక చెప్పేదేముంది ? పార్థసారథిని రథసారథిగా గొన్న విజయునివలె విజయాలు సాధిస్తూ విజృంభించసాగారు తెలుగులో డబ్బింగుల్ని మినహాయించి, సుమారు డజను చిత్రాలకు సంగీతం అందించారు. సంతోషం, మాగోపి, భక్త మార్కండేయ, కుటుంబగౌరవం, పెళ్ళితాంబూలం, ఇంటికి దీపం ఇల్లాలే, తెనాలి రామకృష్ణ, ఆశాజీవులు, మంచీ"చెడూ, రాజా మలయసింహ మున్నగునవి వీరి సంగీత సుగంధయుత కుసుమాలు.

"విశ్రాం" సంగీతాన్ని తెనుగువారి కధికంగా వినిపింపజేసిన ఘనత నిర్మాత శ్రీ బి. ఎస్. రంగాగారికే చెందుతుంది. వీరికం ప్రొడక్షన్సు నిర్మించిన సప్త చిత్రాలకు, "విశ్రాం" సంగీతం సమకూర్చి ఆంధ్రప్రజల ఆదరాభిమానాల్ని చూరగొన్నారు.

"మాగోపి" చిత్రంలో "ఓ ముద్దు గోపా నాముద్దు గోపీ" అని ముద్దుముద్దుగా పాడి శ్రీమతి ఆర్. బాలసరస్వతీదేవి శ్రోతల్ని ఆనందాల హద్దులదాకా తీసుకుపోయారు

కళ్యాణిరాగంలో కర్నాటకబాణీలో చిట్టిపొట్టి చిట్టస్వరాలు గట్టిపట్టుతో మస్తుగా మజాగావేస్తూ శ్రీ రేలంగికి శ్రీ పిఠాపురం ఆలపించిన "లేదయ్యో ముక్తిలేదయ్యో" అన్న హాస్యమయ గేయం విననిదే హాస్యప్రియులకు ముక్తిలేనేలేదు.

"కుటుంబగౌరవం"లో రాముడూ-భీముడూ (చిత్రం కాదు) అనే జోడెడ్లని హుషారుగా తోలుతూ శ్రీ నయనతారా రామారావుగారు పాడిన పాట "పదరా పదపద రాముడూ - పరుగుతీయరా భీముడూ" పాడిన శ్రీ ఘంటసాల ఘంటాకంఠంతో శృతి గలిపిన రామ భీముల మెడల మువ్వలమ్రోత భలేమోత.

"చల్లని సంసారం అనురాగ సుధాసారం" అని సంతోషానికి తీరమైన హాయైన కాపురాన్ని తలుచుకుంటూ, - 'సంసారం' చిత్రంలో ప్రాముఖ్యంలేని పాత్రతో ప్రారంభించి, ప్రతీ చిత్రంలోనూ ప్రతిభావంతంగా వినూత్న విధానంలో నటించి, సంసారం (హిందీ లోలోకం) నిండా నిండుగా నిండిన విశ్వరూపంతో బ్రహ్మాండ నాయికయై వెలుగొందుతున్న నటనా శిరోమణి శ్రీమతి సావిత్రి గణేశన్‌కి శ్రీమతి లీల ఆలపించిన గీతం స్వరకాసారం. సాహిత్య సంగీతసారం. "పోదామురావోయి బావా" "రామయ్యామామయ్యా ఈసంతోషం ఈ సంగీతం నీదయ్యా" అని శ్రీమతి

ఇ వి. సరోజకు గాయని జానకిగారు పాడిన గీతద్వయం అమరానందానికి ఆప్యాయమయ ఆహ్వానం.

పెళ్ళితాంబూలం "చిత్రంలో పాటలన్నీ తేనెతేటలు. ఊహల ఊటలు. "ఓహో జీవితమే ఆనందం. నవయౌవనమే అద్భుతం" అని కుర్రకారు షోకిల్లా స్టూడెంట్సు కారుపై హుషారుగా పయనిస్తూ పాడే సన్నివేశంలో శ్రీ రమణమూర్తికి శ్రీనివాస్ కోరస్ లీడ్ చేస్తూ పాడినపాట- పరువం అనే వారువం పరుగులుతొక్కుతూ పరుగిడేతీరు సొగసు తెలియజేస్తుంది. 'అందముచిందే అప్సరసలమై ఆడేమా" అని శ్రీమతి జమునకు సుశీలగారు కోరస్ లీడ్ చేస్తూ ఖులాసాగా పాడిన పాట కిన్నెర గానం. రమణారెడ్డి రాజశ్రీలకు శ్రీ పిఠాపురం. రాజేశ్వరిపాడిన కామెడీ డ్యూయెట్ "అమ్మాయీ నేనొకటీ యిస్తాను" వింటే నవ్వలేక పక్కలు పట్టుకోక తప్పదు. పగిలిన పొట్టలు కుట్టుకోక తప్పదు. నవ వధూవరుల ప్రథమ సమాగమ సమయాన, లజ్జారంజిత చంద్రవదనయైన శ్రీమతి జమున నుద్దేశించి పాడిన శ్రీ రమణమూర్తికి, నేను పాడిన "చక్కని ఓజాబిల్లీ పలుకవేలనే" పలుకని చెలిని పలకరించి అలరించి పులకింపజేసి పలికిస్తుంది. సుశీలగారి "ప్రేమనిండిన యిల్లే" స్వరస్వర్గంగా ప్రవాహంగా పరిఢవిల్లె.

"రాజామలయసింహ"లోని సంగీతం ఆ చిత్రంలాగే విచిత్రమైనపోకడలు పోయింది. శ్రీమతి సుశీలగారి "సంగీత సాహిత్యలీల" సింధుభైరవి భీంప్లాస్ రాగాల గొలుసులతో సమ్మోహడోలయై జగాలనూపింది. రంజన్ రాజసులోచనలకు శ్రీనివాస్సుశీలల "ఆశే విరిసె - మనసే కలిసె" అని తెలిపిన మధుర ప్రణయమయగేయం హృద్యం. ప్రేమకు ప్రేమికులొసగే నైవేద్యం. "ఓరన్నా మోసపుకాలం" అన్న కవ్వాలీలో నాతోపాటు సంగీత దర్శకులైన శ్రీ జి. కె. వెంకటేష్ పాల్గొన్నారు. కలికాలం మహిమను తెలిపే ఈ కవ్వాలి కంతటికీ శ్రీ వెంకటేష్ వెకిలినవ్వే వెలుగిచ్చేదివ్వె

"ఆశాజీవులు" చిత్రంలో శ్రీయుతుల రేలంగి, రమణారెడ్డిగారలకు మాధవపెద్ది నాగేశ్వరరావులు పాడిన "రవికుల సోమా రాఘవరాం" భక్తిహాస్యాల అపురూప మేళనం. శ్రీమతి రాజశ్రీకి, నేడు ఎల్లారీశ్వరి అనబడే నాటి డి. ఎల్. రాజేశ్వరి పాడిన "వేళ చూడవెన్నెలాయె" గీతంలో పల్లెపదాల పసిడిపాయలు పరిమళించాయి

"చందురుని చలువలతో.... సురసుందరిని మేనకనోయ్" అని జానకిగారు చందనపు తావులతో రంగరించిన శృంగారంతో నింపిన గీతికాసుమాన్నాస్వాదించడానికి, నాటి రాజర్షి విశ్వామిత్రుడు కలికాలంలో మరో అవతారమెత్తడానికి, ఘోర తపంబాచరించి వుండి వుంటాడు. "రారానాయింటికి, ఒంటిగ నిదురరాదు నాకంటికి "అని, "ఏపుట్టలోనా ఏపాముందో" అని ఈశ్వరీ సత్యం పాడిన పాటలు అలాటివాటికి మకుటాయమానాలు. "ఇంటి దీపమై వెలసినతల్లీ - ఇంత అలుక నీకేలనె తల్లీ" అని రాజశ్రీగారికి శ్రీమతి సుశీలగారి గంధర్వగానం అనంతానందానికి సోపానం. అమృతానికి అనుపానం.

ప్రభుత్వ పారితోషికం పొందిన "తెనాలి రామకృష్ణ"లో శ్రీమతి జమునకు శ్రీమతి లీల ప్రవత్తితో పాడిన పూజాగీతం "జగములాదయనేలేజననీ" సింధు భైరవిలో సంగీత బంధువులందరికీ విందు చేసింది. "హరిరిహ ముగ్ధవధూనికరే" అన్న అష్టపదిని జగన్మోహనంగా మోహనరాగంలో

ఆలపించిన శ్రీమతి సుశీలగానం విని స్వర్గంలోని జయదేవుడు సయితం ముగ్ధుడైవుంటాడు.

శ్రీమతి భానుమతిగారి గీతాలు సరేసరి. "ఈ వాలుకన్నులూ ఈ వెన్నెలచిన్నెలూ." "నీవెగా రారాజువెగా", తీరని నాకోరికలే తీరెను ఈరోజూ" అన్న మూడుగీతులూ, సంగీత భారతికి శ్రీమతి భానుమతి ఎత్తిన ముత్యాల హారతులు మాధుర్యం మూర్తీభవించిన మంగళమూరుతులు.

జూపిటర్‌వారి "సంతోషం" చిత్రంలో బేహాగ్ రాగచ్ఛాయలలో భక్తుడొకడి నోట వెలువడిన "నిలుపరా మదిలోనహరిని నిరామయుని, దయాపరుని" అన్న 'ని' కారాలంకారంతో నిండిన గేయాన్ని శ్రీ పిఠాపురం నాగేశ్వరరావుగారిచేత భావయుక్తంగా పాడించి, జనుల రసనలపై నృత్యమాడించారు మన విశ్రాం. "యమునా వాటికి నీటికి చన ఏమేమోనను చేసెనేచెలీ" అనే శ్రీమతి రాగిణి గోపికా నృత్యగీతం సంగీత సాహిత్య శృంగార రసభరితం. గోపీకృష్ణుని లీలావినోదాల చరితం —

ఆర్. ఆర్. పిక్చర్సువారి "ఇంటికిదీపం ఇల్లాలే" చిత్రంలోని సంగీతం సరికొత్త సరళులలో సాగింది. శ్రీమతి ఇ. వి. సరోజకు శ్రీమతి సుశీల పాడిన శ్రీ శ్రీ గేయం "వినుముచెలీ తెలిపెదనే" అని యెవరూ తెలియరాని మధుర రహస్యాన్ని ఎల్లరకూ తేటతెల్లంగా తెలియజేసింది - నటభైరవిలో భీంప్లాస్‌లో "నీవే నీవే కావలసినది. నిన్నే నిన్నే నే వలచినది" అని సుశీలా శ్రీనివాసుల సరసరాగయుత సరాగం పరాగచర్చిత స్వరసుమరాగం.

ఆర్. ఆర్. పిక్చర్సువారి "మంచీ - చెడూ" చిత్రంలోని సంగీతంకూడా విశ్రాం నిర్విరామ పరిశ్రమా పరిమాణమే శ్రీరామారావుగారికి ఘంటసాల ఆలపించిన "పుడమి పుట్టెను నాకోసం పూలుపూచెను నాకోసం" అనే గీతకుసుమం వికసించినది మనకోసం. "తోడునీడ ఎవరులేని ఒంటరి." "పూచిన పువ్వేవాడినది" అని శ్రీమతి సుశీల సరోజాదేవికి పాడిన రెండుగీతాలూ, స్వరాల రజత జలపాతాలు. నవభావోపేతాలు. రామారావు సరోజాదేవిలకు ఘంటసాల సుశీలల "దొర దొరవయసిచ్చాడు." రేపంటి రూపంకంటి" అనే యుగళగీత ద్వయం అపురూప సౌందర్య స్వరూపం.

శ్రీ విశ్రాం ప్రస్తుతం పనిచేస్తున్న భారీయెత్తున నిర్మించబడుతున్న చిత్రాలలో ఒకటిగా చెప్పుకోక తప్పనిది జెమినీవారి "జిందగీ" బాపతు తెలుగువెర్షన్.

ఇదిగాక, వీరెన్నో తమిళచిత్రాలకు పనిజేస్తూ ఊపిరాడక ఉక్కిరిబిక్కిరౌతూ వుంటారు. ఇంత పరిపక్వత పొందిన పిదప గూడా, కొత్తపద్ధతులూ ఫణతులూ" స్టడీ చేయడానికి బొత్తిగా టైం దొరకడంలేదని అంటుంటారు ఈ నిగర్విచూడామణులు.

000

● *"ఏమోయ్, అప్పుడే జుట్టంతా నెరిసిపోతోంది నీకు?"*

"బెంగమూలంగా."

"బెంగ దేనికి?"

"జుట్టు నెరుస్తుందేమోనని."

చిత్రరథుని

చైత్రయాత్ర

నవలలనుంచి మంచి చిత్రాలు

అచ్చయిన రచనలను ముచ్చటగా రెండవసారి వెండితెర కెక్కించిన అన్నపూర్ణ పిక్చర్స్ అధినేత శ్రీ దుక్కిపాటి మధుసూదనరావు "జ్యోతి" మద్రాసు ప్రతినిధితో జూన్ మూడవవారంలో జరిపిన ప్రత్యేకగోష్ఠిలో తెలుగు రచనలకు తెర యోగ మివ్వడంలోని కష్టసుఖాలు. ఆనంద విషాదాల గురించి ప్రస్తావించారు..

తెలుగు నిర్మాతలు తెలుగు ప్రచురణలను ప్రోత్సహించాలని ప్రచారంచేసే ఉద్దేశం కాని. సందేశమివ్వాలనే ఆధిక్య దృక్పథం కాని శ్రీ దుక్కిపాటికి లేక పోయినా "చదువుకొన్న అమ్మాయిలు" వలె, వీలయితే అంతకంటె హెచ్చుగా, "డాక్టర్ చక్రవర్తి" తెలుగు ప్రేక్షకుల ఆదరాభిమానాలు పొందితే తమవలె ఇంకెందరో నిర్మాతలు పత్రికలు ప్రచురించిన కథలు, పబ్లిషింగ్ సంస్థలు వేసిన నవలలు మొదలైనవి చలనచిత్రాలుగా రూపొందించే "రన్నింగ్‌రేస్" జరపగలరని కలలు కంటున్నారు.

తాబేలు-కుందేలు


"అలా అయితే సాలుకు ఓ పాతిక 'పుస్తక చిత్రాలు' రావచ్చు. రాగలవు అనేనా మీ ఆశాభావం ?" అని ప్రశ్నించగా నూటికి, వెయ్యికి ఒక్క నవల సినిమా యోగ్యమైవుంటుందన్నారు. అన్నేసి రావటం సంభవం కాదన్నారు.

సాధారణంగా నవలలో వర్ణనలు జాస్తి అని, పాత్ర స్థిరరూప ప్రదర్శనకు (క్యారక్టర్ ఎస్టాబ్లిష్‌మెంట్) చాలాపేజీలు తీసుకొంటారని, వడిగా కథ నడవదని అన్నారు. 20 పేజీల వర్ణన ఒక్క షాట్‌లో నింపెయ్యవచ్చు. 20 సంఘటనలతో నిరూపించే పాత్ర స్వభావం తెరపై ఒక్క స్వల్ప సంఘటనతో రుజువుపరచవచ్చు. తాబేలు నడక కథను కుందేలు పరుగుతీయించే హంగామా చూసుకోవాలి. నవలను "స్క్రీన్" కెక్కించాలి అంటే ఆ కుదింపులలో, మదింపులలో ఎంతో పనితనం చూపాలి" అని అన్నారు.

అందుచేతనే చాలా నవలలు సినిమా యోగ్యమైనవి కాదన్నారు.

నవలాకారునితో దాదాపు సమమైన ఊహాపటిమ, భావనా బలంకలవారే నవలకు తెరపై న్యాయం చెయ్యకలుగుతారన్నారు.

హాలీవుడ్ చిత్రాలలో దాదాపు అన్నీ నవలలనో, "స్టేజిప్లేస్"నో ఆధారంగా చేసుకొని తీయబడినట్టివని, తెలుగులోకూడా వచ్చేసారిఅయినా, నాటకాన్ని తెరకెక్కించరాదా ? అని మా ప్రతినిధి ప్రశ్నించారు.



అన్నపూర్ణావారి "డాక్టర్ చక్రవర్తి"లో
డాక్టర్ చక్రవర్తి, నిర్మల, మాధవి, రవీంద్ర.

హాలీవుడ్‌లో నవలలకంటే బ్రాడ్వే మొదలైన నాటకరంగస్థలాలలో విజయవంతమైనవాటికే వెండితెర ప్రాప్తి లభిస్తున్నదని శ్రీ మధుసూధనరావు అన్నారు.

తెలుగులో నాటకరంగం అవసరమైనంతగా అభివృద్ధి చెంది వుండని కారణంగా పరిమితంగానే నాటకాలు వస్తున్నవని. సినిమా పరిభాషలో వాటిలో "నావెల్టీ" తక్కువని. సాంఘిక నాటకాల సంఖ్య మరీ మరీ తక్కువని అందుచేత "హాలీవుడ్ పులివాతలు" ఇంతలో ఆశించజాలమన్నారు. అక్కడంతగా ఇక్కడా జనాదరణపొందే

సాంఘిక నాటకాలు వస్తే సెల్యులాయిడ్‌లో దాన్ని శాశ్వతం చేసేందుకు తప్పక ఆలోచించగలమని నాటకరంగంనుంచి సినిమా రంగానికి వెళ్ళిన దుక్కిపాటి సూచించారు.

గేయం - సినిమా

స్వీడన్‌లో ఓ జానపద గేయం ఆధారం చేసుకొని "వర్జిన్ స్ప్రింగ్" అనే అద్భుత చిత్రాన్ని ఇన్‌గ్మార్ బెర్గ్‌మన్ తీశారు. అమెరికాలోకూడా ఇటువంటి ప్రయత్నాలు జరిగినవి. తెలుగులోకూడా అలనాడు శ్రీ పుల్లయ్యగారు ఓ జానపద గేయం ఆధారంచేసుకొని చల్ మోహనరంగా తీశారు. 20 పేజీల నవల వర్ణనను ఒక్క-షాట్‌లో కుదించగలిగిన తెలుగు నిర్మాతలు 20 పాదాల గేయాన్ని దాదాపు 20 రీళ్ళ చిత్రంగా నిర్మించ యత్నించరాదా? అని ప్రశ్నించగా ఆయన మన ప్రేక్షకుల అభిరుచులకు ఒకచెంప జోహార్లు అర్పిస్తూ వేరొక చెంప కాశీమజిలీ కథలువంటి వాటికి అలవాటుపడినవారికి చాలదన్ని పాత్రలు, కథకు చాలెడంత "కాన్వాసు" కావాలని. కుదిస్తే కథ బలం పెరిగినట్లు పొడిగిస్తే పెరగదని అన్నారు. జానపద గేయాలను ఇంకో దశాబ్దానికైనా చలనచిత్రంగా పెంచ వచ్చుకాని భావగీతికలను గగుర్పాటు కలిగించే చిత్రంగా రూపొందించడంమటుకు బహుశా ఈ తరంలో సాధ్యం కాకపోవచ్చునని సూచించారు.

ఎక్స్‌పెరిమెంట్‌లు

"పోనీ మీ రెండుకు ఇప్పుడే ఎక్స్‌పెరిమెంట్ చెయ్యకూడదు?" అన్న ప్రశ్న వెంటనే వచ్చింది.

ఇటువంటి ఎక్స్‌పెరిమెంట్ చెయ్యడల చకపోయినా "పరిశోధనలు" "ప్రయోగాలు" అంటే తాము భయపడేవారము కామన్నారు మధుసూధనరావు. ఉదాహరణలు పేర్కొంటూ యిలా అన్నారు:


"నిజానికి ఇద్దరు మిత్రులు ఒక ఎక్స్‌పెరిమెంట్. అందులో మన తెలుగు రంగానికి అవసరమైనంత బలమైన - ఎక్స్‌ట్రాస్ట్రాంగ్ - కథలేదు. ఉన్నకథ పలచనిది, అంటే సున్నితమైనది. ఇద్దరువ్యక్తుల స్థానాలు మార్చుకొన్నారు అన్నది ఒకటే అంశం. తారాగణమూ అంటే నాగేశ్వరరావు తప్పవిస్తే బలంలేదు. రాజసులోచన, ఇ.వి. సరోజలను హీరోయిన్‌లుగా పెట్టుకొనా సినిమా, తీసేది అని నన్ను మొదట పరిహాసం చేశారుకూడా. శారదకూడా అవిమర్శకుల కంటికి ఆనలేదు. అయినా మేము ఆ చిత్రం తీయడం ఒక తెగువే.

"మాంగల్య బలం"లో. చిన్ననాడు అయితేనేం ఒకసారి వివాహమైన ఆడకూతురు తెలిసో తెలియకో 'ఇంకొకర్ని' ప్రేమించడం 'యాంటీ సెంటిమెంట్' అని మమ్మల్ని తోటి నిర్మాతలు భయపెట్టారు.

"వెలుగు నీడలు"లో తా ప్రేమించిన యువతిని ఇంకొకరికిచ్చి వివాహం చేయించి, మొదటి ప్రేమదృశ్యాలు జరిగిన చోటనే కొత్త జంటవిహారాలు చూపడం తెలుగు 'సినిమా కాలానికి' ఎదురీత అని అన్నారు. "అయినా మేము సాహసించి తీశాము. అటువంటి పరిమితమైన సాహసాల కయితే దుమకవచ్చు కాని మీరుచెప్పే అన్నప్రాశన నాడే ఆవకాయమాత్రం తగదు."

తెలుగు - బెంగాలీ తారతమ్యం

తెలుగు, బెంగాలీ రచయితలలో యెవరిపైన, తెలుగు బెంగాలీ టెక్నిషియనులలో ఎవరిపైన ఆయనకు మోజో తెలుసుకొందామని "జ్యోతి" ప్రతినిధి ఇలా అడిగారు:



"డాక్టర్ చక్రవర్తి"లో నాగేశ్వరరావు, సావిత్రి.

"మీరు లోగడ బెంగాలీ చిత్రాలనుంచి తెలుగు చిత్రాలు తీశారు. అప్పుడు మీరు ఆ చిత్రాలకు ఆధారమైన బెంగాలీ నవలలు కూడా తిలకించారా? ఇప్పుడు మీరు తెలుగు నవలలనుంచి తెలుగు చిత్రాలు తీస్తున్నారు. బెంగాలీనుంచి తీసుకోవడం సులభంగా వుందా? తెలుగునుంచి తీసుకోడం సులభమనిపించిందా?"

వెంటనే వచ్చింది సమాధానం బెంగాలీ చిత్రాలను "అడాప్ట్" చెయ్యడమే సులభమని. గ్రంథంనుంచి చిత్రం తీయడంకంటే చిత్రంనుంచి చిత్రం తీయడమే ఏ భాషవారికైనా సులభమన్నారు. బెంగాలీచిత్రాలను చూసి తెలుగుచిత్రాలు తీసినా బెంగాలీ నవలలు చదివి తెలుగు వాతావరణానికి సరిపోయేవి తీసుకొన్నామన్నారు. బెంగాలీ చిత్రాలయినా మక్కికి మక్కికి తీసుకోలేదంటూ "ఇద్దరు మిత్రులు"కు ఆధారమైన "తాషేర్ ఘర్" నుంచి మూడే మూడు సంఘటనలు తీసుకొన్నామని, కామెడితో సహా తతిమ్మా చిత్రమంతా స్వయం కల్పనే అని అన్నారు. బెంగాలీ నవలలకూ వాటిని అనుసరించి తీసే చిత్రాలకూ పెద్ద వ్యత్యాసం లేదన్నారు. ఒక విధంగా చూస్తే బెంగాల్ వారికంటే మనమే ఎక్కువగా కల్పించామన్నారు.

గ్రంథకర్త-సినీరచయిత

నవలలు వ్రాసినవారే సినిమాకు స్క్రీన్‌ప్లే వ్రాయడం వాంఛనీయంకాదా? అని అడి

గితే వాంఛనీయమే అని అన్నారు. అయితే మరి "చదువుకొన్న అమ్మాయిలు", "డాక్టర్ చక్రవర్తి" విషయంలో మీ రా మార్గం ఎందుకు అనుసరించలేదు? అని ప్రశ్న వచ్చింది.

"చదువుకొన్న అమ్మాయిలు" రెండు నవలలు కలిపి తీసినట్టిదన్నారు. డాక్టర్ శ్రీదేవి "కాలాతీత వ్యక్తులు"లో వసుంధర పాత్రను తీసుకొని, మాన్యుస్క్రిప్టు దశలో వున్న-ఆమే రచించిన-మరొక నవలలోని మరి రెండు స్త్రీ పాత్రలు జోడించి స్క్రీన్‌ప్లే తయారుచేశామన్నారు. దురదృష్టవశాత్తూ ఆ రచయిత్రి స్క్రీన్‌ప్లే దశ రాకముందే కాలధర్మం చెందారన్నారు. "డాక్టర్ చక్రవర్తి" స్క్రీన్‌ప్లేను కోడూరి కౌసల్యాదేవిగారిచేతనే వ్రాయించాలని అభిలషించాము కాని వారు రాజమండ్రిలో వుండడంవల్ల, తాము హైదరాబాద్, మద్రాసుల మధ్య సంచారంలో వుండడంవల్ల అవసరమైనంత పొంతన కుదరలేదన్నారు. అయినా, 'ఆమె గారి అభిప్రాయాలను క్షుణ్ణంగా తెలుసుకొని, చర్చించి, స్క్రీన్‌ప్లే తయారుచేయించామన్నారు.

'సినిమాటిక్' పదంపై చర్చ

"చదువుకొన్న అమ్మాయిలు" మీ పూర్వపు చిత్రాలంత సినిమాటిక్‌గా లేదనే విమర్శ విన్నాను. దానికి మీ సంజాయిషీ-నిజమే సంజాయిషీ-ఏమిటి? "అని "జ్యోతి" ప్రతినిధి ప్రశ్నించారు.

"సంజాయిషీ" అన్నపదం ప్రయోగించినందుకు నిర్మాత బాధపడలేదు కాని "సంజాయిషీ కంటె సమాధానం యిస్తాను" అని ఆయన అన్నారు. నాగేశ్వరరావు, సావిత్రి ధరించిన పాత్రలు కథాగమనానికి ప్రబల సహాయం - సబ్‌స్టాన్షియల్ ఎఫర్ట్ - చెయ్యనందువల్ల, కామెడీ, స్వల్పపాత్రలు ప్రబలంగా ఇమిడినందువల్ల పెద్దవారిని పిన్నవారు పక్కకి నెట్టినట్లు ప్రేక్షకులు భావించారన్నారు. అన్ని చిత్రాలకంటె "చదువుకొన్న అమ్మాయి"లే యెక్కువగా సినిమాటిక్‌గా వున్నదని నొక్కి వక్కాణించారు.

"చదువుకొన్న అమ్మాయిలు" తీసిన తర్వాత తెలుగు నవలను వెండితెర కెక్కించాలనే అభిలాష పెరిగిందా? తరిగిందా?" అంటే, తప్పకుండా పెరిగిందన్నారు. ముమ్మాటికీ పెరిగిందన్నారు. ఈవిధంగానైనా తెలుగు సినిమావారు ఉడుతాభక్తి సారస్వత సేవచేస్తే సంతసించని ఆంధ్ర ప్రేక్షకులు వుండరేమో నన్నారు - గంభీర స్వరంతో.

ప్రశ్న : మీరొక ఇబ్బంది ఆలోచించారా? అచ్చులో మంచికథలు, సంఘటనలు వుంటె వేరొకరు వేరొక రూపంలో మీకంటె ముందే తెరకెక్కించే ప్రమాదం లేదా?

జవాబు : తప్పకుండావుంది. బెంగాల్‌లో అలా ఆశపడరు. మనవారుకూడా స్వయంగా కట్టుబాట్లు చేసుకొంటె రచయితలను, సరస్వతిని రక్షించినవారమౌతాము.

చరిత్ర - చిక్కులు

ప్రశ్న: ఇంతవరకు సాంఘిక నవలలనే వెండితెరకెక్కించారు. మన సారస్వతంలో అనేక చారిత్రక నవలలు వున్నాయి. వాటికి తెరపై తెలుపు నలుపు యోగం యివ్వడానికి ఈమారు ప్రయత్నిస్తారా?

జవాబు: చారిత్రక నవలను ఉన్నది ఉన్నట్లు తీస్తేనే చరిత్రకు న్యాయంచేసినవారమౌతాము. సూదిమోపు ఎడానికిపోయినా ద్రోహమే అవుతుంది. ఉన్నది ఉన్నట్లు

శక్తి స్వేచ్ఛ నాస్తి: సంగీతానికి సీను - మనం కోరినచోట్ల - మున్న.

సాంఘికమే అన్నపూర్ణజెండా అన్నారు చక్రవర్తి చిత్రకర్త.

"తేనెమనసులు": ఆదుర్తి థ్రిల్

"జ్యోతి" ఇంతవరకు వర్ణించిన సినీ నవశకం జూన్‌లో ప్రారంభమైంది.

జూన్ 10 వ తేదీ బుధవారంనాడు హైదరాబాద్ శ్రీ సారథి స్టూడియోస్‌లో అందరూ కొత్త నటీనటులే కల బాబూమూవీస్‌వారి "తేనెమనసులు" చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ప్రపంచ చలన చిత్ర చరిత్రలోనే ఇటువంటి సత్సాహసం అరుదు.

ఆ చిత్రంలో వున్నదే డజనుమంది నటీనటులు. వారందరికీ పోర్షను వున్న సెట్‌పై షూటింగ్ ప్రారంభమైంది. నాలుగురోజులు నాలుగు కాల్‌షీట్ల పని జరిగింది.

ప్రథమంగా-అనగా షూటింగ్ మొదటిరోజున, మొట్టమొదటి షాట్ - బేబీ రోజారాణిపై తీశారు. శ్రీ ఆదుర్తి సుబ్బారావు (దర్శకుడు) ఓ బాలతో చిత్ర నిర్మాణం ఆరంభించ నెంచుకోడంలో ఒక విశేషం లేకపోలేదు.

ఆదుర్తి ప్రథమంగా-అనధికారంగా-డైరెక్ట్ చేసిన (నూటికి 90 వంతులు)చిత్రం ప్రకాశ్ పిక్చర్స్‌వారి "బాలానందం" అనే పిల్లల చిత్రం. అప్పుడు ఆయన ఆసంస్థలో ఎడిటర్‌గా వుండేవారు. ఆ బాలానుబంధమే నేడీనాడు ఆదుర్తిని అగ్రదర్శకుని కోవలోకి తెచ్చిన శోభస్కరమైన బంధం. అంచేతనే బాటోలు "తెనెమనసులు"ను బాలతో ప్రారంభించారు.

ఆదుర్తి "అఫీషియల్ రికార్డు" చూస్తే "అమరసందేశం" ఆయన మొదట దర్శకత్వం వహించిన చిత్రం. నిర్మాతలలో ఒకరు డి. బి. నారాయణ (ఇప్పటి డి. బి. ఎన్. ప్రొడక్షన్స్ అధినేత). "అమర సందేశం" దర్శకుడుగా ఆదుర్తి ప్రథమంగా జూనియర్ శ్రీరంజనితో చిత్రీకరణ ప్రారంభించారు.

ఎంతో "తపస్సు" చేస్తేకాని దర్శకులు (సమర్థులైన విజయవంతులైన దర్శకులు) కాజాలరు.

"జీవితాశయమైన దర్శకత్వ పదవి వహించి, మొదటిరోజు షూటింగ్ (అమర సందేశంలో) ప్రారంభించినప్పుడు మీరు ఎక్కువ థ్రిల్ (గగుర్పాటు కలిగించే ఆనందం) పొందారా? లేక ఇప్పుడు "తేనెమనసులు"కు కొత్త నటీనటులతో మొదటి షాట్ తీసినప్పుడు ఎక్కువ 'థ్రిల్' ఫీల్ అయ్యారా?" అని జ్యోతి ప్రతినిధి ఆదుర్తిని అడిగారు.

క్వశ్చనర్‌కు థ్రిల్ తెచ్చే సమాధానం మరుక్షణంలోనే వచ్చింది.

"తేనెమనసులు" మొదటిషాట్ షూటింగే తనకు అత్యద్భుతమైన ఆనందానుభూతి కలిగించిందన్నారు.

తరువాతి పేజీలలో :

"జ్యోతి" ఫొటో శీర్షిక


"తేనెమనసులు" ప్రివ్యూ


ఫొటోలు : రూప











సంధ్యారాణి, రామమోహన్ స్క్రిప్టు చదువుతూ.........



ఇంతమందికి తమచిత్రంద్వారా మంచి రోజు వస్తున్నదీ అంటే అంతకుమించిన ఆనందం మరేమి వుంటుందన్నారు.

మొదటిసెట్ పని పూర్తిఅయ్యేవరకు గుండెలు ఒకవిధంగా పీచుపీచుమన్నవని, రషెస్ చూశాక కొండంత ధైర్యంవచ్చిందనీ చెప్పారు.

"ఏమో సాహసించి తీసేస్తున్నాము. మా చిత్రం బ్రహ్మాండమైన సక్సెస్అయినా కావచ్చు; కాకపోయినా కాకపోవచ్చు. బాక్సాఫీస్ దృష్ట్యా బాబూమూవీస్‌వారి ఈ చిత్రం ఏమయినా, మన ప్రేక్షక బాంధవులు "బాబులాంటి చిత్రం తీశారు బాబూ మూవీస్‌వారు అంటే చాలు, అదే పదివేలు" అని అన్నారు. ప్రజకు పత్రికలవారికి ఈ చిత్రం తప్పక నచ్చగలదనే నూటికి నూరున్నరపాళ్ళు నమ్ముతున్నామన్నారు.

మళ్ళీ జులై మధ్యనుంచి "తేనెమనసులు" షూటింగ్ కొనసాగుతుంది. సెప్టెంబర్ మధ్యకు పూర్తిచేసి ఆ మాసాంతంలోనే విడుదలచేయాలని నిర్మాతలసంకల్పం.

జ్యోతి



కృష్ణ సుకన్యను చదువుతూ ... ...


ప్రేక్షకులకు తా నెన్నడూ ఆశాభంగం కలిగించననే ధైర్యం వున్న దన్నారు ఆదుర్తి "జ్యోతి" ప్రతినిధితో జరిపిన ప్రత్యేకగోష్ఠిలో.

''తారల'' పరిచయం

"తేనెమననులు"లో అతి ముఖ్యపాత్ర ధారులు నలుగురు. తెనాలి నివాసి కృష్ణ నాటక కళాపరిషత్తు బహుమాన గ్రహీత. విజయవాడసంధ్యారాణి, రాజమండ్రి సుకన్య స్టేజితారలు. నాట్య కళ అభ్యసించారు. దేవ్‌ఆనంద్ పోలికలుకల నాల్గవ వ్యక్తి రామమోహన్ స్వస్థలం గిద్దలూరు. 1954 నుంచి హైదరాబాద్ హిందూస్తాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఉద్యోగి. ఏన్న మొన్నటి వరకు స్టేజి నటుడు.

సహాయ తారలలో పి. వెంకటేశ్వరరావు హాస్యపాత్రలకు పేరొందిన స్టేజినటుడు. విజయవాడలో టెలిఫోన్ డిపార్టుమెంటులో పనిచేస్తున్నారు. నాటకకళా పరిషత్తు చే ఉత్తమ హాస్యనటుని బహుమతిపొందిన ఈ యువకుడు పేరుతెచ్చుకొన్న నాటకాలు "కీర్తిశేషులు", "ఇదేమిటి ?".

జి. ఎస్. ఆర్. మూర్తి తండ్రిపాత్రలకు "ఎమోషనల్" పాత్రలకు ప్రసిద్ధులు. ముఖకవళికలద్వారాకాక అంగికాభినయంతో భావం ప్రకటించడం ఈయన ప్రత్యేకత.



కృష్ణ, రామమోహన్, సంధ్యారాణి, సుకన్య, వెంకటేశ్, అతిథి నటులు.

ముదిగొండ లింగమూర్తి విరచిత "వెంకన్న కాపురం"లో వెంకన్న పాత్రకు ఈయనదే పెట్టింది పేరు. పరిషత్తు చే ఉత్తమ నటుని బహూకరణ పొందారు. "రాగరాగిణి"లో నాయిక తండ్రిగాకూడా ఈయన చక్కగా అభినయించి వున్నారు. "దొంగవీరుడు"లోకూడా తండ్రి పాత్రకు పేరుపొందారు.

కుమారి వాణిబాల స్వస్థలం బందరు. నాటకాలలో నాయికపాత్ర ధరించేవారు. "అపరాజిత" ముఖ్యపాత్రధారిణిగా పరిషత్తుచే ఉత్తమనటి బహుమతి నందుకొన్నారు.

కోనేశ్వరరావు "ఫణి" నాటకంలో ఫణి పాత్రను చక్కగా అభినయించేవారు. "అపరాజిత" నాటకంలో నాయకుడు.

చలపతిరావు రైల్వేఉద్యోగి. హాస్య నటుడు. "దంతవేదాంతం"లో బాగా నటించారు.

ఇంకా పుష్పకుమారి, రాధాకుమారి, బేబి రోజారాణి 'తారాగణంలో కలరు.'

నటీనటులు సినిమాకు ఎంతఅననుభవజ్ఞులో టెక్నిషియనులు అంత అనుభవజ్ఞులు. వారి వివరమిది :

నిర్మాత; సి సుందరం. రచన: ఆత్రేయ. ముళ్ళపూడి వెంకటరమణ. సంగీతం: వి. ఎల్. రాయ్. ఎడిటర్ – కృష్ణ. సెకెండ్ యూనిట్ దర్శకుడు – కె. విశ్వనాథ్.

ఇక "తేనెమనసులు" చూడవలసింది ముక్కోటిన్నర ఆంధ్రుల విశాల నేత్రాలు.

విశాల నేత్రాలు

బాబూ మూవీస్‌వారి తదుపరి చిత్రం "విశాల నేత్రాలు" షూటింగ్ సెప్టెంబర్ మాసాంతంలో ప్రారంభమౌతుంది.

మరి అందులోకూడా కొత్త తారలను ప్రవేశపెడతారా? అని "జ్యోతి" ప్రతినిధి ప్రశ్నించగా "కొందరినైనా ప్రవేశపెట్టడం మా అభిమతం" అని జవాబిచ్చారు ఆయన.


ముఖ్యపాత్రధారి అక్కినేని నాగేశ్వరరావు తమకు 'ఎస్సెట్' అని. "విశాల నేత్రాలు"లో రామానుజాచారికి యెక్కువ పాత్ర వున్నదనీ. అవర్ప్సువున్న కొత్త వారిని ఆ భూమికకు తీసుకోవాలని చాలా కుతూహలపడుతున్నానని చెప్పారు.

నాయిక భూమికకు నిజానికి కొత్తతారను సృష్టించి నాగేశ్వరరావు ప్రక్క నటింపజేసి డబుల్ నావెల్టి తేవాలనివుందనీ, ఒకవేళ "తేనెమనసులు" స్త్రీ తారలలో ఎవరయినా ఆ స్థాయిని అందుకుంటే వారికే ఆ మహద్భాగ్యం లభిస్తుందన్నారు.

రంగులలో తీయాలనే ఆకాంక్ష అదుర్తికి వుంది. కాని అది నెరవేరే అవకాశం తెలుగువారికి ప్రభుత్వం కల్పించడంలేదు. ఇందుకు అమిత విచారం వ్యక్తంచేశారు సుబ్బారావుగారు.

ఏ చిత్రంద్వారా అయినా విదేశ ద్రవ్యార్జనచేస్తే ఆ డబ్బుకు కలర్ ఫిలిమ్‌ను ప్రభుత్వం యిస్తుంది. తెలుగు చిత్రాలకు విదేశమార్కెట్ లేదు. అందుచేత విదేశ ద్రవ్యార్జన లేదు. అందుచేత అదుర్తివంటి మహావాశయాలు కలవారికి ప్రభుత్వం రంగుఫిలిమ్ యివ్వదు.

"విశాలనేత్రాలు" నవలా రచయిత శ్రీ పిలకా గణపతిశాస్త్రి. సంభాషణలు శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ ఇతర టెక్నిషియనులు బాబూమూవీస్ యూనిట్ వారే.



డి. బి. ఎన్. వారి "దాగుడుమూతలు"లో రామారావు, సరోజాదేవి, బేబీ అవంతి.

ప్రత్యగాత్మ చిత్రంలో ఒక దృశ్యం ప్రివ్యూ

సంస్కరణాభిలాషతో చిత్రంతీసే దర్శకులలో ఒకరు శ్రీ కె. ప్రత్యగాత్మ. కథకుడుగా వున్నప్పుడు యీ పొందించిన "నిరుపేద" లేమి, సంభాషణకర్తగా వున్నప్పుడు రచించిన "మాయింటి మహాలక్ష్మి"యేమి. దర్శకుడై తీసిన "భార్యాభర్తలు", "కులగోత్రాలు", "పునర్జన్మ"యేమి ఏదో ఒక సంస్కరణభావం కలిగివున్నట్టివే.

ప్రత్యగాత్మ ఇప్పటికి పది పన్నెండు రీళ్ళు తయారుచేసిన ఛాయాచిత్రావారి సాంఘికంకూడా పై కోవకు చెందినదే. పుట్టుకకంటే పెరిగే వాతావరణ ప్రభావమే వ్యక్తి శక్తిని మలచుతుందనే సందేశమిచ్చే ఈ చిత్రం కథలో జడ్జీగారబ్బాయి దొంగల్లో పెరిగి, దొరలుగా కప్పించేవారికంటె ఎక్కువ సంస్కారం అలవరచుకొని తనను ఈసడించినవారికే ప్రాణరక్షణ యిస్తాడు.

జూన్‌లోనే పతాక సన్నివేశం షూట్ చేశారు. ముఖ్యపాత్రధారులందరూ – రామారావు. జగ్గయ్య. గుమ్మడి. జమున, హేమలత. పద్మనాభం. మిక్కిలినేని – ఆ సెట్ పనిలో పాల్గొన్నారు.

దొంగల గుహసెట్‌లో రామారావు, అజిత్‌సింగ్ ఫ్రీస్టయిల్ కుస్తీపోటీ షూట్ చెయ్యవలసివున్నది. ప్యాచ్‌వర్క్ చివరన జరుగుతుంది.

జూన్ మూడవవారంలో శ్రీ ప్రత్యగాత్మ వాహినీలో ఎడిటింగ్‌పనిలో నిమగ్నులై వున్నారు. చిత్రానికి ఇంకా పేరు నిర్ణయించకపోయినా "రక్తసాక్షి" అన్నది అన్ని విధాలా సరిపోతుందని అభిజ్ఞులు అనుకుంటున్నారు. అంచేత తాత్కాలికంగా ఆ పేరుతోనే ముందు రచన సాగిద్దాము.

"రక్తసాక్షి"లో మీ భావబలం ఎచ్చట కొట్టవచ్చినట్లు కన్పిస్తుంది. ఏ కొత్తదనం అదనంగా చూపాలనుకొంటున్నారు? అని "జ్యోతి" ప్రతినిధి ప్రశ్నించగా "అదంతా మీయొక్క, ప్రేక్షకులయొక్క తీర్పుకే వదలివేస్తా" నంటూ కథలో ఒక ముఖ్య సన్నివేశం బైటపెట్టారు.

"దొంగ" రామారావు "దొర" జగ్గయ్య పర్సుకొట్టేశాడు. డాబుగా వున్న రామారావు "దొంగ" అని జగ్గయ్య అనుకోనేలేదు. దొంగలపైనా, దొరలపైనా ఉభయులమధ్య వాగ్వివాదం జరుగుతుంది. రామారావులోని "రావణాసురుడు" అస్తమించడానికి నాంది పలికింది. రామారావు (చిత్రంలో పేరు వేణు) ఆ రాత్రి సముద్రతీరంలో (మద్రాసులోని ఇలియట్స్ రోడ్డు బీచి) గడిపారు. రాత్రల్లా మానసిక సంఘర్షణ. తెల్లవారుతున్నది

భానుడు ఉదయించాడు. రామారావులోని "రావణాసురుడు" ఆ రాత్రే అస్తమించాడు. ఈ ఉదయం రామారావులో ఉదయించింది నీతి భానుడు. సరాసరి ఆ బీచ్‌లోని దేవీ ప్రసాదరాయ్ చౌధురి శిల్పసృష్టిఅయిన గాంధీ విగ్రహంవద్దకు వెళ్లాడు. బాపూ హస్తం రామారావును స్పర్శించింది. పాత రామారావు దొంగ. ఈ కొత్త రామారావు దొర. నిజమైన నీతిగల స్వచ్ఛమైన దొర.

రామారావు పాత్రలో ఆ మార్పును చాలా భావగర్భితంగా చిత్రీకరించారు.

ఆ సన్నివేశంలోనే కృషి ఔన్నత్యం (డిగ్నిటీ ఆఫ్ లేబర్) రామారావు-గాంధీజీ హస్తాలపై చిత్రీకరించదలచానని ప్రత్యగాత్మ అన్నారు. ఈ అంశం తప్పక ఒక కొత్త ఆకర్షణభావం కాగలదనే ఆశాభావాన్ని ఆయన ప్రకటించారు.

మారిన "దొంగ" రామారావు దొంగల గుహకువెళ్ళి దొంగ సొత్తు వాపసుచేసి వేస్తాడు. దొంగల నాయకునికి రామారావుకు వాగ్వివాదం జరుగుతుంది. పైన పేర్కొన్న షూటింగ్ జరగవలసిన - గుహ సెట్‌పని అదే.

పోతే, రామారావు-అజిత్‌సింగ్ ఫైటింగ్ ఘట్టం చిత్రమైనది. హృదయాలను ద్రవింపజేసేది. ఆ అద్భుత సన్నివేశంగురించి ఇంకోమారు ప్రస్తావిస్తాము.

చిత్రానికి సంభాషణలు సమకూర్చింది పినిశెట్టి. గులాబిపై చేరే రకరకాల కీటకములను (వేణు వంటి దొంగలన్నమాట) ఓ కంట కనిపెట్టవలసిందని జమునను జగ్గయ్య హెచ్చరించే పాట ఒకటి ఆమధ్య చిత్రీకరించారు. దాశరథి ఆ పాటను వ్రాశారు.

చిత్రానికి సంగీత సారథులు ఎస్. రాజేశ్వరరావు, టి. వి. చలపతిరావు.

వాణీఫిలిమ్సువారు ఆగస్టు ఆరంభంలో విడుదలచేసే ఈ చిత్రంలో పొట్టి పద్మనాభం ప్రాబ్లెమ్‌పొట్టచెక్కలయ్యే నవ్వుతెప్పిస్తుంది.



డి. బి. ఎన్. వారి "దాగుడుమూతలు"లో బి. సరోజాదేవి, రామారావు.

"ఆంధ్ర మహావిష్ణువు" స్క్రిప్టు సిద్ధం

శ్రీ పింగళి నాగేంద్రరావు శంభుఫిలిమ్స్ వారి "ఆంధ్ర మహావిష్ణువు" స్క్రీన్‌ప్లే తొలి ప్రతి సిద్ధం చేశారు. ఏ. కె. శేఖర్ డైరెక్ట్ చేసే ఈ చిత్రంలో రామారావు ప్రధాన భూమిక ధరిస్తారు. నిర్మాత దగ్గుబాటి లక్ష్మీనారాయణచౌదరి.

ఇన్నాళ్ళకు ఆంధ్రదేవుని చరిత్రను వెండితెర కెక్కించడం ముదావహం. ఈ కథ శ్రీకాకుళంలోని ఆంధ్రదేవుని చరిత్రకు సంబంధించినది. ఆంధ్ర విష్ణువు శ్రీకాకుళం రాజధానిగా ఆంధ్రదేశాన్ని పాలించిన తొలి చక్రవర్తి. ఈయన నిశుంభుడనే నాగరాజును చంపి ఆంధ్రచక్రవర్తి అయినట్లు చరిత్ర చెబుతున్నది. శ్రీ నాగేంద్రరావు దీనిని నాటకంగా చాలా సంవత్సరాలక్రితం వ్రాసి వుంచారు. అచ్చుకాలేదు. ఇప్పుడు అమాంతం సెల్యులాయిడ్ రూపం ధరిస్తున్నది.

హిందీలో "ఏకవీర"

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ చారిత్రక నవలను హిందీ చిత్రంగా రూపొందించడానికి శ్రీ డి. ఎల్. నారాయణ ఏర్పాట్లు చేస్తున్నారు. మనోజ్ కుమార్, జమున ముఖ్య భూమికలు ధరిస్తారు.

పుండరీకాక్షయ్య జానపద చిత్రం

"ప్రతాపరుద్రీయం" ఈకాలపు 'సెక్యులరిజం'కు ఎబ్బెట్టుగా వున్నదనే తలంపుతో "మహామంత్రి తిమ్మరుసు"

నిర్మాత పుండరీకాక్షయ్య ఆ చిత్ర నిర్మాణ యత్నం విరమించుకొన్నారు. "ప్రతాప రుద్రీయం" నాటకం హక్కుల సందర్భంలో కొన్ని సన్నివేశాలపైకూడా పేచీ వచ్చింది. ఓ జానపద చిత్రాన్ని నిర్మించేందుకు పుండరీకాక్షయ్య ప్రయత్నాలు జరుపుతున్నారు.

"దాగుడు మూతలు" రీ రికార్డింగ్

డి. బి. ఎన్. ప్రొడక్షన్స్‌వారి "దాగుడు మూతలు" రీ రికార్డింగ్ పూర్తికావస్తున్నది. ఆదుర్తి దర్శకత్వంలో రామారావు తొలిసారి నటించిన ఈ చిత్రంలో నాయిక బి. సరోజాదేవి. రచన ముళ్ళపూడి.

వాహినీలో క్రొత్త ఫ్లోర్

శ్రీ బి. నాగిరెడ్డి వాహినీ స్టుడియోస్‌లో కొత్తగా ఒక ఫ్లోర్ నిర్మిస్తున్నారు. ఆదిరంగుల చిత్ర నిర్మాణానికి ప్రత్యేకించబడగలదని తెలుస్తున్నది. శ్రీ నాగిరెడ్డి దక్షిణ భారత ఫిలిం వాణిజ్యమండలి అధ్యక్షులుగా ఎన్నికైనారు.

"వీరాభిమన్యు" తారాగణం

రాజలక్ష్మి ప్రొడక్షన్స్‌వారి "వీరాభిమన్యు" తెలుగు వర్ణచిత్రంలో రామారావు, కాంతారావు, రేలంగి, శోభన్‌బాబు, అంజలీదేవి, ఎస్. వరలక్ష్మి, కాంచన బుక్ అయినారు. జులైలో షూటింగ్ ప్రారంభమై ఫిబ్రవరిలో విడుదల అవుతుంది. దర్శకుడు వి. మధుసూదనరావు.

నాగేశ్వరరావు భూప్రదక్షిణం

మార్చి 18 వ తేదీన అమెరికాకు ఒంటరిగా బయలుదేరివెళ్ళిన అక్కినేని నాగేశ్వరరావు మే 18 వ తేదీతో అమెరికా యాత్ర ముగించుకొని, ఆరోజు విమ్మట లండన్, పారిస్, జెనీవా, పశ్చిమ బెర్లిన్, డెన్మార్క్, టోకియో, హాంగ్‌కాంగ్, బ్యాంగ్‌కాక్‌లు ఒంటరిగా చూసి, జూన్ 14 నుంచి సతీసమేతంగా సింగపూర్ వెళ్లారు. మలయాకూడా సందర్శించారు. ఈ సంచిక వెలువడేనాటికి మద్రాసులో పత్నీసహితంగా పునఃప్రవేశం జరిపి వుంటారు నాగేశ్వరరావు సతీమణి శ్రీమతి అన్నపూర్ణ 14 వ తేదీనే మద్రాసునుంచి సింగపూర్ వెళ్లారు.

నాగేశ్వరరావు హాలీవుడ్‌లోని ఫిలిం స్టుడియోలపై వ్యాఖ్యానిస్తూ అచ్చట పనిచేసే వారికి సమగ్ర సాంకేతిక పరిజ్ఞానం వున్నదనడంలో సందేహంలేదని, భారత టెక్నీషియనులు అంతటి నిష్ణాతులు కాకపోయినప్పటికీ సమర్థంగా నిర్వహించడం విశేషమేనన్నారు. అమెరికాలో రేడియో టెలివిజన్‌లలో వ్యాపారప్రకటనలు తగ్గించి కళాప్రదర్శనలు హెచ్చుచెయ్యాలన్నారు.

నాగేశ్వరరావు భారతదేశానికి వచ్చిరావడంతోనే వీనస్‌వారి "సుమంగళి" కాల్‌షీట్లకు హాజరవుతారు. అయనతో ఈవరకే ముఖ్య సన్నివేశాలన్నీ తీశారు. ముఖ్యంగా పతాక సన్నివేశాలు అయిపోయినవి. ఎటొచ్చీ కథారంభంలోని కొన్ని ఘట్టాలను చిత్రీకరించవలసి వున్నది.

నాగేశ్వరరావు, గుమ్మడి, సావిత్రి మొదలైనవారు పాల్గొనే సన్నివేశాలను వెంటనే షూట్ చేస్తారు. దర్శకుడు ఆదుర్తి.

ఆతర్వాత "విశాలనేత్రాలు" సెట్ దర్శనం చేసుకొంటుంది.



విఠల్ ప్రొడక్షన్స్ "అగ్గిపిడుగు"లో కృష్ణకుమారి, రామారావు.

ఇంతలో పి. ఏ. పి. వారి స్క్రిప్టు సిద్ధమైంది. ఆగస్టులో షూటింగ్ ప్రారంభమౌతుంది. ప్రత్యగాత్మ యిచ్చిన ప్రాతిపదికలపై సదాశివబ్రహ్మంకథ అల్లారు. నిర్మాత శ్రీ ఏ. వి. సుబ్బారావు.

ఇవి ఓపట్టాన పడగానే జగపతివారి చిత్రం, రవీంద్ర ఆర్ట్స్ వారి చిత్రం షూటింగ్ దశకు చేరుకొంటవి. అవి ఓ మార్గంలోకి వచ్చేసరికి విజయవాడ వెంకటేశ్వర ఫిలిమ్స్ సంస్థచిత్రం కెమెరాదర్శన భాగ్యానికి నోచుకొంటుంది. మళ్ళీ అన్నపూర్ణాచిత్రం. ఇదీ నాగేశ్వరరావు చక్రభ్రమణం.

"డాక్టర్ చక్రవర్తి" విడుదల వాయిదా కారణం

విడుదల తేదీయిస్తే బ్రహ్మాండం మునుకుపోయినా దానికి కట్టుబడివుండే రెండు పెద్ద సంస్థలు ఈ సారి తేదీలు మార్చినవి. ఆర్. కె. ఫిలిమ్స్ రాజకపూర్, అనుకొన్న తేదీకి "సంగం" విడుదల చెయ్యలేకపోయారు. అన్నపూర్ణా పిక్చర్స్ వారు "డాక్టర్ చక్రవర్తి"ని అనుకొన్న తేదీకి విడుదల చెయ్యకలిగీ చెయ్యలేదు.

జూన్ 19 వ "డాక్టర్ చక్రవర్తి" విడుదలచేద్దామని అన్నపూర్ణావారు మొదట

టెక్నిస్కోప్

టెక్నికలర్ సంస్థవారు టెక్నిస్కోప్ అనే కొత్త సినీ చిత్రీకరణ విధానం కనిపెట్టారు. ఈపద్ధతిలో నెగెటివ్‌లో సగంపైపుమాత్రమే ఫొటోగ్రాఫ్ చెయ్యడానికి వీలవుతుంది. అనంతరం పూర్తి ప్రమాణం నెగెటివ్‌కు దానిని విస్తరింప జెయ్యవచ్చు. ఈవిధంగా రెండువేల అడుగుల బదులు వెయ్యి అడుగుల నెగెటివ్‌లోనే అంతపనీ ముగింపజెయ్యవచ్చు. భారత దేశానికి ఇది మిక్కిలి ఉపయోగం.

అనుకొన్నారు. ఇంతలో విజయవాడ భగ్గుమనేసరికి జూన్ 28 ప్రాంతాలకు వాయిదా వేద్దామనుకొన్నారు. కాని విజయవాడలో చల్లారకముందే మరికొన్ని ప్రాంతాలు భగ్గుమనేసరికి అంతా చల్లబడేవరకు తాము కడుపులో చల్ల కదలకుండా కూర్చుందామనుకొన్నారు. జులై 9, 10 ప్రాంతాల చిత్రం విడుదల చెయ్యాలని అన్నపూర్ణావారి సంకల్పం.

"ఇద్దరు మిత్రులు" వరకు అన్నపూర్ణావారి చిత్రాలు సంక్రాంతి కానుకలు. హైదరాబాద్ మార్పిడిమూలాన "చదువుకొన్న అమ్మాయిలు" ఉగాది కానుక అయింది. ఇక అగ్నిదేవుని మూలాన "డాక్టర్ చక్రవర్తి" కాలేజీలకి ప్రారంభ కానుక అవుతుంది. ఇందులో శంకరమంచి జానకి నటన డాక్టరేట్‌కు అర్హమైనది

ప్రత్యగాత్మ చారిత్రక వర్ణ చిత్రం

రీగల్ ప్రొడక్షన్స్ అనే కొత్తసంస్థ భానుని "స్వప్నవాసవదత్త"ను రంగులలో నిర్మించదలచిందని విశ్వసనీయంగా తెలియవచ్చింది ప్రత్యగాత్మను దర్శకునిగా బుక్ చేశారు. రామారావు నాయకునిపాత్రధరించవచ్చు. పి. ఎల్. రాయ్‌వద్ద ముఖ్య సహాయకునిగావుండి "లవకుశ", "మూగమనసులు" "దాగుడు మూతలు", "సుమంగళి" ఎమ్ జి ఆర్. ఈస్ట్‌మన్ కలర్ తమిళ చిత్రములలో పనిచేసిన, పని చేస్తున్న సినీకళాశాల డిప్లమో హోల్డర్ కె. రామకృష్ణారావు ఛాయాగ్రహణ దర్శకులుగా ఈ చిత్రానికి పనిచెయ్యగలరని తెలుస్తున్నది.

రవీంద్ర చిత్రంలో నాగేశ్వరరావు

"అక్షాధికారి" నిర్మించిన రవీంద్రావారు (నిర్మాత తమ్మారెడ్డి కృష్ణమూర్తి) తమ తదుపరి చిత్రంలో (సాంఘికం) నాయకుని భూమికకు అక్కినేని నాగేశ్వరరావును బుక్ చేశారు. వి. మధుసూదనరావు దర్శకులు. పేపర్ వర్కు ప్రారంభం కాబోతున్నది.



శ్రీ దేవి పిక్చర్సువారి "విచిత్ర వ్యక్తులు"లో ఎమ్. ఆర్. రాధ, శివాజీగణేశన్.

ప్రసాద్ చిత్రానికి ముళ్ళపూడి మాటలు

ప్రసాద్ ప్రొడక్షన్స్‌వారు ఒక మరాఠీ చిత్రం ఆధారంగా తెలుగులో తలపెట్టిన చిత్రానికి ముళ్ళపూడి వెంకటరమణ సంభాషణలు వ్రాయనున్నారు. ఎల్. వి. ప్రసాద్ సోదరుడు "ఎడిటర్" సంజీవి ఈచిత్రం దర్శకులు.

చిత్రాల ప్రోగ్రెస్

జూన్‌మాసంలో హైదరాబాద్ శ్రీ సారథి స్టూడియోస్‌లో నవరత్న ఫిలిమ్స్‌వారు పాటల రికార్డింగ్ ప్రారంభించారు

మద్రాసులో జూన్‌లో "అగ్గిపిడుగు", "శ్రీ సత్యనారాయణ మహాత్మ్యం", "ప్రమీలార్జునీయం", "ఉయ్యాల జంపాల" (ఆంధ్రలో ఔట్‌డోర్) తెలుగు "జిందగి", తెలుగు "ఫూలోంకె సేజ్", "బొబ్బిలి యుద్ధం", "నాదీ ఆడజన్మే", "దొరికితే దొంగలు" (హైదరాబాద్‌లో ఔట్‌డోర్) "బభ్రువాహన" షూటింగ్ జోరుగాసాగింది

మాధవీ ప్రొడక్షన్స్‌వారు "పాండవ వనవాసం" షూటింగ్ ప్రారంభించారు.

జూన్ చిత్రం "సంగం"

జూన్ నెలలో దేశ విదేశాలలో రాజ్‌కపూర్ "సంగం" కలిగించినంత సంచలనం మరే భారతీయ చిత్రం సృష్టించి వుండలేదు.

14 సంవత్సరాల క్రితం కొన్న కథకు మూడేళ్ళక్రితం కొత్తరూపమిచ్చి దాదాపు 75 లక్షల రూపాయల వ్యయంతో టెక్ని

కలర్‌లో లే, లడఖ్, హిమాలయాలు, ఆల్ప్స్, రోమ్, లండన్, వెనిస్, స్విట్జర్లెండు, పారిస్ మొదలైనచోట్ల షూట్ చేసిన ఈ ముగ్గురు మిత్రుల కథాచిత్రాన్ని మూడు వెర్షనులలో తయారుచేస్తున్నారు. గంగా, యమున, సరస్వతీ నదులవంటివి రాజ్‌కపూర్, రాజేంద్రకుమార్, వైజయంతిమాల పాత్రలు. భారతదేశంలో విడుదలకు ఒక వెర్షను తయారైంది. జూన్ 19 న విడుదలఅయింది. ఢిల్లీలో అడ్వాన్సు బుకింగ్ ప్రారంభమైన మొదటి రెండు రోజుల్లో 1,65,000 రూపాయల టిక్కెట్లు అమ్ముడుపోయినవి. ఇంతటి రికార్డు మరే చిత్రానికి లేదు. అంతర్జాతీయ మార్కెట్‌కోసం ప్రపంచ తార కావడంకోసం వైజయంతి "సంగం"కు అర్ధనగ్నంగాకూడా సహాయపడినట్లు మద్రాసు ఫిలింవర్గాలద్వారా తెలియవచ్చింది. మొట్టమొదటిసారి ఈ చిత్రంలో రాజ్‌కపూర్ ఎడిటింగ్ బాధ్యత కూడా వహించారు శ్రద్ధతో సన్నివేశాలాన్ని పెంచడం ఈ చిత్రంలో ఇంకొక విశిష్టత. పారిస్‌లోనే రాజకపూర్ పరుగుల డ్యూయెట్ పాటపెట్టారు. "మీ సినిమాలలో పాటలు ఎక్కువ" అన్న పాశ్చాత్యులు పారిస్‌లోనే ఈ "ఘోరం" చూసి మరేమంటారో! పాశ్చాత్యరాజ్యాలలో విడుదలకని వేరే వెర్షన్ తయారుచేస్తున్నారు.



ఎస్.ఎన్.ఏ.పి.వారి "బభ్రువాహన" చిత్రంలో అర్జునుడుగా రామారావు.

పత్తు ప్రయివేట్ షోలలో కొన్ని సన్నివేశాలుచూచిన వారన్నారు—వైజయంతి యిక ప్రపంచతార అయిపోతుందని. పోతే అంతర్జాతీయ మార్కెట్‌కని ఓవెర్షను (మూడవది) తయారుచేస్తున్నారు మూడింటి మూలసూత్రమూ ప్రాక్పశ్చిమ సంస్కృతుల సంగమం అవసరమని.

"ఐ లవ్ యూ" అనే జగత్ప్రసిద్ధ గీతంవొకటివుంది. ఆ ఆంగ్ల గేయం ఫ్రెంచి, జర్మన్, రష్యన్ భాషలలోకూడా పాడుతున్నారు. "సంగం"లో దానిని ప్రవేశపెట్టారు. ఇద్దరు మిత్రులు ఒకే అమ్మాయిని ప్రేమించడం "సంగం" కథలో ముఖ్యభాగం. కర్తవ్యపరాయణులైన సైనికదళాధికారి రాజకపూర్. □□□